www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సోమవారం | 19-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 125 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా. 11.55 తదుపరి పాడ్యమి; నక్షత్రం: శ్రవణం ఉ. 8.10, ధనిష్ఠ తె. 5.54; వర్జ్యం: ఉ. 11.45-1.12; దుర్ముహూర్తం: మ. 12.43-1.33, మ. 3.13-4.04; అమృతఘడియలు: రా. 8.23-9.50; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 19-8-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

## స్టాప్‌లాగ్ నుంచి లీకేజీ బంద్

చుక్క నీరు కూడా లీక్‌కాకుండా పనులు పూర్తి

తుంగభద్ర డ్యాం గేట్లన్నీ మూసివేత

ప్రస్తుత నీటిమట్టం 73.553 టీఎంసీలు

పరీవాహక ప్రాంతంలో జోరుగా వానలు

త్వరలో మళ్లీ డ్యాం నిండే అవకాశం

కన్నయ్యనాయుడికి తుంగభద్ర బోర్డు సన్మానం

హైదరాబాద్‌లో ఘనస్వాగతం



డ్యాం 19వ గేటు నుంచి ఆగిన నీటి లీకేజీ

9

# వాసుదేవరెడ్డికి సీఐడీ ఉచ్చు

## మద్యం స్కాంలో పిలిపించి ప్రశ్నించిన అధికారులు!

కీలక వివరాలు బయటపెట్టిన బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ

ఆ వివరాలను ఆధారాలతో పోల్చి చూస్తున్న సీఐడీ అధికారులు

డిస్టిలరీల యజమానులనూ విచారించాకే తదుపరి చర్యలు

మాజీ సీఎం జగన్‌కూ ఇక్కట్లే

అందుకే పెద్దపెద్ద లాయర్లతో చర్చలు

ఎన్నికల ఫలితాలొచ్చాక ఫైళ్లు, హార్డ్ డిస్కులు తీసుకెళ్లిన వాసుదేవరెడ్డి

జూన్ 6 నుంచి అజ్ఞాతంలోనే



జగన్ బెంగళూరు ప్యాలెస్ సమీపాన ఓ హోటల్లో వాసుదేవరెడ్డి మకాం!

లాయర్లతో కలిసి లోపలకు వెళ్లిన వైనం

పసిగట్టిన సీఐడీ బృందాలు.. వెంటనే పిలుపు

### మద్యం అక్రమాల సూత్రధారి వాసుదేవరెడ్డే!

డిస్టిలరీల నుంచి షాపుల వరకు ఆయన కనుసన్నల్లోనే

అస్మదీయ సంస్థలకు భారీగా ఆర్డర్లు.. పొరుగు కంటే అదనంగా చెల్లింపు

ఆ అదనపు మొత్తం పెద్దల జేబుల్లోకి.. బార్ పాలసీలోనూ పెత్తనం

సంబంధం లేని ఎక్సైజ్, సెబ్ అధికారుల బదిలీల్లో కూడా జోక్యం

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కీలక సూత్రధారి, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ డి.వాసుదేవరెడ్డిని సీఐడీ అధికారులు పిలిపించి విచారించారు. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన ఆయన కోసం సీఐడీ బృందాలు విస్తృతంగా గాలిస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ కూడా చేసింది. నాలుగు రోజుల క్రితం బెంగళూరులో ఆయన ఆచూకీ సీఐడీకి లభించింది. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి చెందిన యలహంక ప్యాలెస్‌కు సమీపంలోని ఒక హోటల్లో వాసుదేవరెడ్డి మకాం వేసినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. రెండ్రోజుల క్రితం ఆయన్ను పిలిపించి విచారించినట్లు తెలిసింది. మొత్తం కుంభకోణం తీరుతెన్నులపై ప్రశ్నించినట్లు సమాచారం. మద్యం పాలసీ నిర్ణయాలు మొదలుకుని.. విక్రయాలు, ముడుపులు, బ్లాక్ మార్కెట్ అమ్మకాలు.. కంపెనీల నుంచి వసూలు చేసిన పర్సంటేజీలు, అందులో తాడేపల్లి ప్యాలెస్‌కు చేరింది ఎంత.. ప్రభుత్వ పెద్దల్లో ఎవరి పాత్ర ఎంత.. అనే వివరాలను సీఐడీ అధికారులు రాబట్టారు. 2019-24 మధ్య ఏయే మద్యం కంపెనీల నుంచి ఎంత వ్యాపారం జరిగింది.. పొరుగు రాష్ట్రాలతో పోల్చితే ఆ బ్రాండ్ మద్యం ధరలు ఏపీలో ఎందుకు ఎక్కువగా ఉన్నాయి.. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన 32 రకాల నాసిరకం బ్రాండ్ల నుంచి వసూలు చేసింది ఎంత..? జగన్ అనుచరులకు సంబంధించిన 11 డిస్టలరీల నుంచే 65 శాతం మద్యం కొనుగోలు చేయడం వెనుక మతలబు ఏమిటి..? మద్యం ధరలు విపరీతంగా పెంచడం వెనుక అసలు రహస్యం ఏమిటి..? గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో ఎక్కువగా

మిగతా 11వ పేజీలో...



శ్రీసిటీలో ప్రారంభానికి సిద్ధమైన అపెరల్ కేబుల్స్ పరిశ్రమ

## నేడు 15 పరిశ్రమలు ప్రారంభం

రూ.1,570 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు

900 కోట్లతో 7 పరిశ్రమలకు భూమి పూజ

శ్రీసిటీలో సీఎం చేతులమీదుగా కార్యక్రమం

రూ.1,213 కోట్లతో మరో 5 పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు

తిరుగు ప్రయాణంలో సోమశిల సందర్శన

అమరావతి/తిరుపతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తిరుపతి జిల్లాలోని శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా రూ.1,570 కోట్ల పెట్టుబడులతో, 8,480 మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయిలో ఏర్పాటైన 15 పరిశ్రమలను ఆయన ప్రారంభించనున్నారు. అలాగే రూ.900 కోట్ల పెట్టుబడులతో 2,740 మందికి ఉద్యోగాలు కల్పించే 7 పరిశ్రమలకు భూమి పూజ చేయనున్నారు. అదేవిధంగా రూ.1,213 కోట్ల పెట్టుబడితో 4,060 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే మరో 5 పరిశ్రమల స్థాపనకు సంబంధిత ప్రతినిధులతో ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. అధికారిక సమాచారం మేరకు... సోమవారం ఉదయం 10.40 గంటలకు చంద్రబాబు గన్నవరం

మిగతా 9వ పేజీలో...

## వినూత్నంగా ఏపీ భవన్

కొత్త భవన నిర్మాణంపై ఢిల్లీలో సీఎం సమీక్ష

అమరావతికి తిరుగుపయనం

11

# పవన్ చెప్పినా బేఖాతర్!

## కాలుష్య నియంత్రణ మండలిని వీడని వైసీపీ వాసన

కాలుష్య నియంత్రణ మండలిలో కొందరు అధికారులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలనే బేఖాతరు చేస్తున్నారు! వద్దన్న పని చేయడానికే సిద్ధమవుతున్నారు.. ప్రభుత్వం మారినా వారిలో వైసీపీ వాసన వీడడంలేదు! బయో వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ అనుమతుల విషయంలో ఇప్పటికీ అడ్డగోలుగానే వ్యవహరిస్తున్నారు. తాజాగా విజయనగరంలో జిల్లాలో వైసీపీ నేతకు చెందిన ఓ కంపెనీ ఏర్పాటుకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులివ్వడానికి సిద్ధమయ్యారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో అనుమతులివ్వకుండా కొద్దిరోజులుగా ఆపేశారు. ఆయనను ఏమార్చి ఇప్పుడు మళ్లీ సదరు ఫైల్‌ను అధికారులు మెల్లగా తెరపైకి తీసుకువస్తున్నారు. దీనంతటికీ కారణం వైసీపీ హయాం నుంచి పాతుకుపోయిన కొందరు అధికారులు ఇప్పటికే భారీ ఎత్తున ముడుపులు తీసుకోవడమేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది కాకుండా రాష్ట్రంలో మరో ఏడు కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు భారీ స్కెచ్ వేశారు.

బయో వేస్ట్ ప్లాంట్ల ఏర్పాటులో సీపీసీబీ మార్గదర్శకాలకు తూట్లు

విజయనగరంలో వైసీపీ నేత కంపెనీకి అనుమతివ్వాలని నిర్ణయం

అడ్డగోలు అనుమతికి డిప్యూటీ సీఎం నో

అయినా ఫైలు నడుపుతున్న అధికారులు

భారీగా ముడుపులు తీసుకోవడమే కారణం

అప్పిలేట్ అథారిటీ ఆదేశాలు బేఖాతర్

సీపీసీబీ వద్దన్నా, హైకోర్టులో కేసులున్నా డోంట్‌కేర్

నిబంధనలకు విరుద్ధంగా 7 ప్లాంట్ల ఏర్పాటుకు స్కెచ్

కూటమి సర్కారు వచ్చినా తీరు మార్చుకోని కొందరు





(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బయో వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎక్కడపడితే అక్కడ.. ఎవరికి పడితే వారికి అనుమతులివ్వడానికి లేదు. ఇందుకు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ తీర్పులతోపాటు, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించింది. ఆయా మార్గదర్శకాలను అనుసరించి సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాత

మిగతా 11వ పేజీలో...

# నైరుతి.. తీరు మారింది

రోజుల తరబడి ఉండే ముసురు కనుమరుగు

అన్నిప్రాంతాలకూ విస్తరించే వర్షాలూ మాయం

ఒకచోట అతివృష్టి, మరోచోట అనావృష్టి



ఆగస్టులో అనేక జిల్లాల్లో దుర్భిక్ష పరిస్థితులు

సముద్రాలు, భూమి, ఉపరితలం వేడెక్కడమే కారణం

ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఖరీఫ్‌పై ప్రతికూల ప్రభావం

వర్షం నీటిని నిల్వ చేసుకోవడం తప్పనిసరి చేయాలి

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

శ్రావణమాసంలో ఎడతెరిపి లేకుండా రోజుల తరబడి ముసురు పట్టే వాతావరణం కనుమరుగైంది. వేసవి మాదిరిగా ఎండ తీవ్రత, భరించలేని ఉక్కపోత నెలకొంది. కురిస్తే అతివృష్టి..లేదంటే అనావృష్టి అన్నట్టుగా పరిస్థితులు మారిపోయాయి. మన రాష్ట్రంలోనే కాదు, దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. వర్షాలు అన్ని ప్రాంతాల్లో కురిసే పరిస్థితి మాయమైంది. ఇది

మిగతా 9వ పేజీలో...

## ఉక్కపోత.. కరెంటు మోత!



సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేశ్

# నలుగురిపై వేటు

## 'పోలవరం ఫైళ్లకు నిప్పు' కేసులో సస్పెన్షన్

ఇద్దరు డీటీలకు షోకాజ్.. విచారణాధికారిగా జేసీ

ఎవరినీ రక్షించాలనే ప్రయత్నాలొద్దు

బాధ్యులపై చర్యలు తప్పవు: మంత్రి దుర్గేశ్

తగలబెట్టిన పత్రాలన్నీ జిరాక్స్ కాపీలు, పనికిరాని కాగితాలన్న ఆర్డీవోపై ఆగ్రహం

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/ధవళేశ్వరం, ఆగస్టు 18: పోలవరం భూసేకరణ స్పెషల్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లకు నిప్పుపెట్టిన ఘటనపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం పోలీసుస్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు నిబంధనలు పాటించని నలుగురు ఉద్యోగులను సస్పెండ్

మిగతా 12వ పేజీలో...

# జేటీసీలూ బెజవాడ వచ్చేయండి

కమిషనరేట్‌లో 24 గంటల్లో రిపోర్టు చేయండి

ప్రభుత్వ ఆదేశాలు.. రవాణా శాఖలో కలకలం

పెద్దిరెడ్డి కుడిభుజం సహా నలుగురు జాయింట్ కమిషనర్లకు షాక్

వైసీపీ ప్రభుత్వంలో వసూళ్ల కోసం జిల్లాల్లో ప్రాంతీయ కార్యాలయాల ఏర్పాటు

ఇప్పుడు వాటి మూసివేతకు ఉత్తర్వులు

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలో సంచలన ఆదేశాలు వెలువడ్డాయి. ఒకేసారి నలుగురు జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ల(జేటీసీ)ను ప్రభుత్వం కమిషనరేట్‌కు పంపించింది. 24 గంటల్లో విజయవాడలోని రవాణా కమిషనరేట్‌కు వెళ్లి కమిషనర్ అప్పగించిన బాధ్యతలు చేపట్టాలని ఆదివారం నిర్దేశించింది. సెలవు రోజు

మిగతా 11వ పేజీలో...

## 15 వేల మంది టీచర్ల సర్దుబాటు!

అంచనా వేసిన పాఠశాల విద్యాశాఖ

ఎస్జీటీలు 4,922 మంది అవసరం 9

స్కూల్ అసిస్టెంట్లు 2,299 మంది కొరత

అవసరం లేని టీచర్లు ప్రస్తుత బడుల్లోనే



తగరపువలసలో గ్యాస్ కట్టర్‌తో కట్ చేసిన ఏటీఎం

# ఏటీఎంల్లో భారీ చోరీ

2 ఏటీఎంల నుంచి రూ.33 లక్షలు అపహరణ

విశాఖలో పోలీసులకు సవాల్ విసిరిన ఆగంతకులు

పెందుర్తి, తగరపువలస ఎస్‌బీఐ ఏటీఎంల్లో ఘటనలు

వైర్లు కత్తిరించి, గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంల బ్రేక్

సీసీ కెమెరాలపై బ్లాక్ పెయింట్ స్ప్రే 11

ఆధారాలు దొరక్కుండా సీసీ ఫుటేజ్ బాక్స్ అపహరణ

కారులో వచ్చి దర్జాగా దొంగతనం



## బీజేపీలోకి చంపయీ సోరెన్!

అరుగురు ఎమ్మెల్యేలతో ఢిల్లీకి జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి 10

కమలం అగ్రనేతలతో మంతనాలు

ఎక్స్ ఖాతాలో పార్టీ పేరు మాయం

తన ముందు 3 ప్రత్యామ్నాయాలు ఉన్నట్లు సుదీర్ఘ లేఖ





ఢిల్లీలో నిరసన వ్యక్తంచేస్తున్న వైద్యులు

# కోల్‌కతా హత్యాచారంపై సుప్రీం విచారణ

సుమోటోగా తీసుకున్న కోర్టు

రేపు సీజేఐ ధర్మాసనం ముందుకు

నిందితుడికి మానసిక పరీక్షలు

శాంతిభద్రతలపై ప్రతి 2గంటలకూ రాష్ట్రాలు నివేదిక పంపాలి: కేంద్రం

హడావిడిగా నా బిడ్డ అంత్యక్రియలు

దీనిపై అనుమానాలున్నాయి

న్యాయం జరిగేదాకా పోరాటం సాయం తీసుకోం

ట్రైనీ డాక్టర్ తండ్రి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 18: కోల్‌కతా హత్యాచారం ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ కేసుపై మంగళవారం విచారణ జరపనుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో వివరాలను వెల్లడించారు. 20న

మిగతా 10వ పేజీలో...

# ఆకాశమంత ఎత్తు.. ఆరోగ్యం చిత్తు?

## 30 అంతస్తులకు మించిన భవనాల్లో ఉండేవారికి ఆరోగ్య సమస్యల ముప్పు!

శ్వాసకోశ సమస్యలతో, హృద్రోగాలతో బాధ పడేవారు జాగ్రత్తగా ఉండాలి

పదే పదే కిందికి రాలేకపోవడం వల్ల జీవనశైలి జబ్బుల ప్రమాదం: వైద్యనిపుణులు



దేశవ్యాప్తంగా ఇటీవలి కాలంలో ఆకాశ హర్మ్యాల సంఖ్య విస్తృతంగా పెరుగుతోంది! 30 అంతకు మించి అంతస్తుల భవనాల నిర్మాణం జోరుగా సాగుతోంది!! ఉదాహరణకు.. హైదరాబాద్‌లోనే 30 నుంచి 40 అంతస్తుల భవనాలు దాదాపు 100 దాకా పలు దశల్లో ఉన్నాయి. మరో వైపు రాజధాని అమరావతి నిర్మాణం ఊపందుకుంటే భవిష్యత్తులో అక్కడా భారీ ఆకాశహర్మ్యాలు వచ్చే అవకాశం ఉంది. విశాఖలోనూ ఇప్పుడిప్పుడే ఇలాంటి భవనాల నిర్మాణం మొదలైంది. హైరైజ్ బిల్డింగ్స్‌లో ఉండడం హోదాకు చిహ్నంగా భావిస్తున్న చాలా మంది.. వాటిలో పోటీపడి ఫ్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. ఇలా వెంచర్ ప్రకటించగానే.. పునాదులు కూడా వేయకుండానే.. అలా వాటిలో ఫ్లాట్లను హాట్‌కేకుల్లా కొనేస్తున్నారు. ఈ అభివృద్ధిని ఆపడం అసాధ్యం. కానీ.. ఆకాశహర్మ్యాలు అందరికీ సరిపడకపోవచ్చని.. కొంతమందికి అనారోగ్య సమస్యలు వచ్చే ముప్పుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు.. 'దిల్‌బర్', 'వాస్తే' వంటి

మిగతా 10వ పేజీలో...



10

## మేజర్ నాయుడు.. అసామాన్యుడు!

ఆర్మీ మేజర్ రాంగోపాల్‌కు కీర్తిచక్ర

దేశ రెండో అత్యున్నత శౌర్య పురస్కారానికి ఎంపికైన మొట్టమొదటి తెలుగు రైతు బిడ్డ

దేశం కోసం ప్రాణాలొడ్డేందుకు సిద్ధమైన గోపాల్

కుప్వారాలో ఇద్దరు ఉగ్రవాదుల హతం

గ్రెనేడ్లు, తూటాలు దూసుకొచ్చినా.. ఉగ్రమూకకు ఎదురొడ్డి.. సైన్యాన్ని రక్షించిన సాహసం

ఆర్మీ క్లినికల్ ఆపరేషన్‌లో అతి గొప్ప నాయకత్వం

## అమెరికాలో ప్రకాశం టెకీ మృతి

కాలిఫోర్నియా బీచ్‌లో ఈతకు వెళ్లి దుర్మరణం

20 నెలల క్రితం యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం

6 నెలల క్రితం భార్య, కుమారుడు అమెరికాకు

భౌతికకాయం తెచ్చేందుకు ఏర్పాట్లు: టీడీపీ

9

# మానవత్వం గెలిచిన చోట పుట్టిన కథలివి

"నాకింకో వ్యాపకం లేదు. రైటింగ్ ఈజ్ డ్రీమింగ్ విత్ లెటర్స్. నాకది ఇష్టం. తిరువనంతపురంనుండి బెంగళూరు రావాలంటే ఫ్లైట్లో ఒక నవల ఊహించుకుంటాను. నేనది రాయక్కరలేదు. ఊహగా నాలో మెదిలినా చాలు. ఆ ఊహలు నాకిష్టం. ఆ చిత్రణ ఇష్టం. అందుకని సమయం సరిపోలేదనో కష్టమనో ఇన్నేళ్ళలో ఎప్పుడూ అనుకోలేదు."
– జయమోహన్



తమిళ రచయిత జయమోహన్‌లో చిత్రమైన ఆకర్షణ ఉంది, అది విజయవంతమైన రచయిత అయినంత మాత్రాన సాధించగల ఆకర్షణ కాదు. ఆయన నవ్వులో, పలకరింపులో, అప్రోచబుల్‌గా ఉండటానికి సందేహించని ఆయన మనస్తత్వంలో మనుషులను అయస్కాంతంలా లాగగల ఆకర్షణ ఉంది.

కెత్తేల్ సాయెబు, ఏనుగు డాక్టరు, వంద కుర్చీల ఆఫీసరు.. ఇలా మనసులో స్థిరపడే పాత్రలతో ఆసక్తిగొలిపే ఆయన కథల్లో కొన్నింటిని అవినేని భాస్కర్ 'నెమ్మి నీలం' పేరుతో తెలుగులోకి పుస్తకంగా తెచ్చి, బెంగళూరు బుక్ బ్రహ్మ లిటరరీ ఫెస్టివల్‌లో ఆవిష్కరించారు. అదయ్యాక, జయమోహన్‌తో మట్లాడేందుకు, నాకూ రాజిరెడ్డికీ కాఫీ టైం దొరికింది. 'గెలుపు' కథను ప్రస్తావిస్తూ, ఆయన కథల్లో లేయర్స్ గురించీ, డీటైలింగ్ గురించీ రాజిరెడ్డి మాట్లాడారు.

దానికి కొనసాగింపుగా– "మీరంత పెద్ద పెద్ద కథలెందుకు రాశారు?" అడిగాన్నేను.

### కథంటే చిన్నదవ్వాలన్న నియమం లేదు!

కథంటే చిన్న కథే కావాలన్న మాట ఎవరు సృష్టించారో తెలీదు. అదేమీ నియమం కాదు. అలా ఉండటం గొప్ప విషయమూ కాదు అంటూ అమెరికాలో, ఆ మధ్య 64 పేజీలతో వచ్చిన ఒక కథ అంతర్జాతీయ స్థాయిలో మొదటి బహుమతి పొందటం గురించి చెప్పారాయన.

ఇంత పెద్ద కథలు ఎలాగూ రాస్తున్నారు కదా, రాయడం కూడా ఇష్టంగా అలవోకగా చెయ్యగలరని తెలుస్తూనే ఉంది, ఈ కథలను నవలలుగా కూడా మార్చగల అవకాశం ఉన్నప్పుడు, అలా ఎందుకు చెయ్యలేదని అడిగాం.

జయమోహన్ అన్నారూ, ప్రతి కథకూ ఆయన మనసులో, బలమైన ఆధారం లాంటి వాక్యం ఒకటుంటుందిట. ఉదాహరణకు, ఆ వంద కుర్చీల కథలో, ఆఫీసర్ వంద కుర్చీలు కావాల్సిందే అనుకోవడం. కూటి ఋణంలో అతను మొత్తాన్నీ సాయిబు దగ్గర ఇచ్చేయడం, అతడు కళ్ళెత్తి కూడా చూడకపోవడం ఇలా. ఒకసారి ఆ మలుపు, ఆ వాక్యం దగ్గరికి వచ్చామంటే, కథ అయిపోయినట్టే. అక్కడి దాకా ఎన్ని పేజీలన్నది ఆయనకు లెక్క లేదు. కానీ ఆ మలుపు తర్వాత ఆ కథలో ఇక చెప్పడానికేమీ లేదు. కాబట్టి ఇవన్నీ కథలయ్యాయి. నవల అంటే, ఆయన దృష్టిలో ఇలాంటి సందర్భాలు, కథనిట్లా మలుపులు తిప్పగల వాక్యాలు ఇంకా ఎన్నో ఉండచ్చు, ఉండాలి. కనుక ఇవి కథలే తప్ప నవలలు కాలేవన్నది ఆయన జవాబు.



జయమోహన్‌తో మానస చామర్తి

జయమోహన్ కథల్లో ఏళ్ళకేళ్ళ జీవితాలు పరుచుకుని ఉంటాయి. ఇంత విశాలమైన జీవితాన్ని కాన్వాస్‌గా ఎందుకు తీసుకుంటారు, కథను చెప్పడం తేలిక చేస్తుందనా? అంత పెద్ద జీవితంలో నుండి ఏ తునకలనైనా ఎంచి చెప్పే వీలుంటుందనా? అని అడిగాను.

### ఆదర్శాలకు నిలబడే పాత్రలను చూపించడం ముఖ్యం

ఆయనకు మనిషి 'ఎథికల్ కన్సిస్టెన్సీ' మీద దృష్టి పెట్టడం ఇష్టమట. అంటే ఏదో పుణ్యానికి ఓ రోజు మంచి చెయ్యడం, స్నేహమో సాయమో చెయ్యడం- ఇలా కాదు. ఏళ్ళ తరబడి నడిచే జీవితంలో ఆ పాత్ర ఏ ఆదర్శాలను నమ్ముకుని జీవిస్తుందో చెప్పడం, వాటికి నిలబడిందో లేదో చూపించడం ఆయనకు ముఖ్యమని చెప్పారు. (పుస్తకం మొదటి పేజీ లోనే చెప్తారు ధర్మం మూలాలకు సంబంధించిన ప్రశ్నలతో మొదలైన ఈ కథలన్నీ మానవత్వపు గెలుపును చాటి చెబుతాయని).

జయమోహన్ కథలకు భాస్కర్ అనువాదాలు చదివిన రీడర్స్‌లో చాలామంది, మళ్ళీ వెనక్కు వెళ్ళి మరీ మూల రచయిత పేరు కూడా గమనించడం నాకు తెలుసు. చిన్నచిన్న కథలు, సంఘటనలు అందరి మీదా అన్నిసార్లూ బలమైన ముద్రను వేస్తాయని ఆశించలేం. కానీ నిడివి పెరిగే కొద్దీ, కథ బాగుంటే పాఠకుడు ఆ కథాజగత్తులో లీనమై పోతాడు. కొన్ని నిమిషాలపాటో, గంటలపాటో వేరే ప్రపంచంలోకి ట్రాన్స్‌పోర్ట్ అయిన పాఠకుడు, మళ్ళీ ఈ లోకంలోకొచ్చాక, ఆ ప్రభావం నుండి బయటపడ్డాక, రచయిత పేరు గమనించకుండా ఉండలేడు. ఆయన పేరు తెలుగు నాట కూడా ఇంత బలంగా నాటుకోవడానికి, ఈ కథల నిడివి ఒక కారణమంటే– ఆయన ఆ గమనింపుని ఒప్పుకున్నారు. రచయిత అట్లాంటి సాంద్రమైన పఠనానుభవం పాఠకులకు అందించాలన్నట్టు మాట్లాడారు.

"డెలిబరేట్‌గా చేస్తారా," అన్నాను.

తల అడ్డంగా ఊపుతూ అలా చేయాలని కూడా ఎప్పుడూ అనుకోనన్నారు. ఆయనకు కథ ఆర్గానిక్‌గా క్రియేట్ అవ్వాలి. అలాగే నడవాలి.

### దిద్దుకుంటూ కూర్చోను!

కరోనా లాక్‌డౌన్‌లో 'కథల తిరనాళ్ళు' అంటూ 'వంద రోజులు, రోజుకో కథ' అని ప్రకటించి మరీ వెబ్‌సైట్‌లో ప్రచురిస్తూ వచ్చారు. పరుగు పందేల్లో ఫినిష్ లైన్ చేరుకున్నాక కూడా మరికొంతదూరం పరుగెత్తినట్టు, ప్రకటించిన వంద కథలతో ఆగకుండా నూట ముప్పై కథలు రాశారు. అక్కడా నిడివితో నిమిత్తం లేదు.

రాజిరెడ్డీ నేనూ మళ్ళీ అడ్డు కొట్టేశాం. అలా ఎలా సాధ్యపడుతుంది? పోనీ గాలి మేడల్లాంటి కథలా అంటే అదీ కాదు. మంచి వస్తువూ ఉంటుంది. బలమైన చిత్రణా ఉంటుంది. ఆ ఊహకూ, అల్లికకూ, రాతకూ సమయమెలా సరిపోతుంది? ప్రత్యేకించి కథ బాగా రాబోతోందని తెలిసినప్పుడు ఇంకొంచం శ్రద్ధగా రాయాలనిపించడమూ రచయితలకు అనుభవమవుతూంటుంది కదా? అలాంటిదేమీ ఉండదా? అని అడిగాం. మరీ ముఖ్యంగా ఎడిటింగ్?

ఆయన చాలా అయిష్టంగా తిరస్కరించారు. ఎడిటింగ్ మొదలెడితే దానికిక ముగింపెక్కడ? ఏదో ఒకటి చెయ్యాలనిపిస్తూనే ఉంటుందిక. నేను ఆ పని పెట్టుకోను. అంత నచ్చకపోతే డిలీట్ చేసేస్తాను తప్ప దిద్దుకుంటూ కూర్చోనన్నారు.

"డిలీట్? డ్రాఫ్ట్ లో కూడా ఉంచరా? మళ్ళీ ఇంకోసారి చూసుకోరా?"

"నో. చూడను. అవి దిద్దే టైంలో కొత్త కథ రాసేసుకోవచ్చు" అన్నారు నవ్వి.

"ఎప్పటికప్పుడు కొత్తవి రాసేందుకు సమయమెలా సరిపోతుంది?" – మా అనుమానం తీరలేదు.

### మెదడుని తిట్టకూడదు. పిచ్చిగా వాడకూడదు.

"నాకింకో వ్యాపకం లేదు. రైటింగ్ ఈజ్ డ్రీమింగ్ విత్ లెటర్స్. నాకది ఇష్టం. తిరువనంతపురంనుండి బెంగళూరు రావాలంటే ఫ్లైట్లో ఒక నవల ఊహించుకుంటాను. నేనది రాయక్కరలేదు. ఊహగా నాలో మెదిలినా చాలు. ఆ ఊహలు నాకిష్టం. ఆ చిత్రణ ఇష్టం. అందుకని సమయం సరిపోలేదనో కష్టమనో ఇన్నేళ్ళలో ఎప్పుడూ అనుకోలేదు."

ఎప్పుడూ రాయాలనే ఉంటుందా?

"ఆహా! ఇదుగో ఇక్కడ ఉందే (మెదడుని చూపిస్తూ) దీనిని తిట్టకూడదు. పిచ్చిగా వాడకూడదు. ఆరోగ్యంగా ఉంచుకోవాలి. అల్లోపతి మందులు తినేసి శరీరాన్ని పాడుచేసుకోకూడదు. ఇవి రెండూ బాలేదంటే రాయాలనే అనిపించదు. కాబట్టి అవి ముఖ్యం. నిద్ర ముఖ్యం.

"మా అబ్బాయికి కరోనా వచ్చి హాస్పిటల్‌లో అడ్మిట్ చేసామొకసారి. రాత్రికి ఇంటికి చేరాక ఒక్కణ్ణే ఉన్నానప్పుడు– ఒళ్ళంతా ఒకటే సంతోషం. నరాల్లోకి పాకిన తియ్యదనం. నాకు తెలుస్తోంది ఆ పొంగు. 36 గంటలు లేవకుండా కూర్చుని ఒక నవలిక రాశాను – 'కుమరితుఱై'. ఎంతా ఏమిటీ అని కూడా చూడలేదు. సైట్‌లో మర్నాడు పబ్లిష్ అయ్యేలా సెట్ చేసి నిద్రపోయాను. అది చదివి మా అబ్బాయి 'నాన్నా, నువ్వొక కవివి' అన్నాడు.

"రాసే ఉధృతిలో ఎన్ని గంటలైనా కూర్చోవచ్చు, పర్లేదు. రాసేశాక మాత్రం కంటి నిండా నిద్రపోవాలి."

తరువాతి సెషన్‌కి వేళయి అందరం బయటకు వచ్చేశాక మాకు అనిపించిందొక్కటే. జీవితం ముఖ్యం. ఈ రాత మొత్తం దాని కొనసాగింపు. ఆయన జీవితాన్ని అనుభవిస్తున్నాడు. రాతనిట్లా ఆస్వాదిస్తున్నాడు.

ఆయన కథలింత బాగుండడంలో ఆశ్చర్యం ఏముంది?

■ మానస చామర్తి
✆ 7975468091

## nothingness



అలాగే

ఆకాశం నిర్మలంగా నిశ్చలంగా ఉంటుంది
హద్దులు లేక బరివాతల

నింగి నేల రాలదు

కాకపోతే కొంత ధూళి కణాలు కలిగి
మరింత అంతరిక్షనౌకల పొగచూరి
ఎదురుచూస్తూ
పిడుగుల్ని జడివానల్ని కురిపించ

II
భూమి ఉంటుంది
సరిహద్దుల గిరిగీతల బందీగా
యుద్ధ గాయాలను అట్లాస్లా మోస్తూ
మనిషి విధ్వంసానికి పగుళ్ళు బారి

భూకంప ప్రకోపాన్ని ప్రకటించ

III
ఆనకట్టల కట్టడికి కాసింత కలవరపడినా
నదుల గతులు మారవు
ఒకింత కల్మషాలను పెరిగిన కాలుష్యాలను
ముక్కు మూసుకుని బుద్ధుడిలా వహిస్తూ
జలప్రళయ తాండవమాడ
ఉంటాయి

IV
అలాగే.. దేహం జీర్ణమయి
గతించి నువ్వూ ఉంటావు

కొందరి మదిలోనో మస్తిష్కాల్లోనో
ఇంకా రూపు మారి
ప్రకృతి మరో పేరుతో
పంచభూతాల్లో మనిషిపై ప్రతీకారేచ్ఛతో

(కేరళ విలయం చూసి)

■ పిన్నంశెట్టి కిషన్
✆ 97002 30310

సోమవారం 19 ఆగస్టు 2024

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

# ఒక లచ్చవ్వ అనుభవంలో చరిత్ర స్మృతులు


చరిత్రకూ మానవ అనుభవానికీ ఉన్న సంబంధం సృజనాత్మక సాహిత్యానికి గొప్ప వనరు. అలాంటి సాహిత్యం చరిత్ర రచనకు ఆకరంగా ఉపయోగపడుతుంది. కానీ విస్తృత జీవన చిత్రణకు అవకాశం ఉన్న నవల సామాజిక శాస్త్రాలకంటే భిన్నమైన పాత్ర పోషిస్తుంది. అప్పుడు నవల చరిత్రకు కాల్పనిక రూపంగానే మిగిలి పోదు. చరిత్ర చెప్పలేని విషయాలను చెప్పి సరి పెట్టుకోదు. చరిత్రను దాటి ముందుకు వెళుతుంది. ఇట్లాంటి చర్చకు నిలవగల చాలా లక్షణాలు ఉన్న నవల 'తల్లులుబిడ్డలు'. దీన్ని మహమూద్ హుస్సేన్ రాశారు. రెండు సార్లు అరెస్టయి, జైలు జీవితం గడిపిన రచయిత సరిగ్గా ఈ నవల విడుదలైన రెండేళ్లకు మళ్ళీ జూలై 8న ఒక అక్రమ కేసులో అరెస్టయ్యాడు.



యాభైఏళ్ల కింద ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో కొద్ది మంది యువకులు ఆరంభించిన విప్లవోద్యమం దగ్గర ఈ నవల కూడా మొదలవుతుంది. వాళ్లకు అంతక ముందు ఎలాంటి పోరాట అనుభవం లేదు. కాక పోతే గతంలో జరిగిన అన్ని పోరాటాల కంటే పూర్తి భిన్నమైన ఆలోచనలతో పని ఆరంభించారు. పాత కమ్యూనిస్టు ఉద్యమం ఆర్థిక పోరాటాలకు, స్థానిక సమస్యలకు మాత్రమే పరిమితమై ఉండింది. కానీ ఈ యువకులు సింగరేణి బొగ్గు గనులు ఉన్న చిన్న ప్రాంతంలో ఆరంభించిన నిర్దిష్ట పోరాటానికి దేశవ్యాప్త సార్వజనీన రాజకీయ సాంస్కృతిక లక్ష్యం ఉన్నది. సింగరేణి అనే నిర్దిష్ట వాస్తవం దగ్గర నిలబడి దేశాన్ని ప్రభావితం చేయగల పోరాటానికి కార్మికవర్గాన్ని సిద్ధం చేయాలనుకున్నారు. దీని కోసం సమాజానికి, ఉద్యమాలకు ఉండగల అన్ని రకాల సంప్రదాయక భావ జాలాలను తిరస్కరించారు. కొత్త అన్వేషణ మొదలు పెట్టారు. ఆ రకంగా వాళ్ల ఒక కొత్త రాజకీయ సాంస్కృతిక చట్రాన్ని ప్రతిపాదించి ముందుకు తీసికెళ్లారు. అనేక సిద్ధాంత, సైనిక ఆటుపోట్ల మధ్య కూడా అది భవిష్యత్ లోకి విస్తరిస్తున్నది.

తల్లులు బిడ్డలు నవల ఇతివృత్తం వ్యక్తుల జీవిత విశేషం కాదు. పాత నుంచి బైటపడే క్రమంలో లక్షలాది మంది గడించిన అనుభవాన్నంతా వస్తువుగా స్వీకరించింది. ఇంత విస్తృత కథనానికి మళ్లీ గజ్జల లచ్చవ్వ అనే ఒక మహిళ అనుభవం ఫోకస్ పాయింట్. ఏది నవల అవుతుందో, ఎట్లా నవల అవుతుందో, నవలలోనే చెప్పవలసింది ఏమిటో తెలిసి రాసిన ఐదు వందల పేజీల నవల ఇది.

అప్పటి భౌతిక పరిస్థితులు, వాటిలో మానవ జోక్యం, దానికి ఉన్న అవకాశాలు చరిత్రకు సంబంధించినవి. అట్లా ఈ నవల చరిత్ర నుంచి వచ్చిందే. కానీ ఆ సమూహం పొందిన అనుభవం ఈ నవలా ఇతివృత్తం. క్రమంగా ఆ అనుభవం వందల వేల కుటుంబాల, లక్షలాది కార్మికుల, రైతు కూలీల, అంటరాని కులాల, మధ్య తరగతి జనాల, స్త్రీల, పురుషుల జీవితంగా మారింది. వాళ్లందరూ భాగమై ఉన్న మానవ సంబంధాల సంఘర్షణగా మారింది. దాన్ని చెప్పడానికి హుస్సేన్ ఈ నవల రాశారు.



**సంప్రదాయక నవలా నిర్మాణం వైపు నుంచి చూసినప్పుడు 'తల్లులు బిడ్డలు' మీద విమర్శలు ఉండవచ్చు. కానీ జీవితాన్నే సంప్రదాయకంగా చూడకూడదనే చైతన్యం నుంచి, ఆచరణ నుంచి పోగుపడిన అనుభవం దీని ఇతివృత్తం. కాబట్టి రచయిత ఏ ప్రామాణిక పద్ధతులనూ పాటించలేదు.**

సంప్రదాయక నవలా నిర్మాణం వైపు నుంచి చూసినప్పుడు 'తల్లులు బిడ్డలు' మీద విమర్శలు ఉండవచ్చు. కానీ జీవితాన్నే సంప్రదాయకంగా చూడకూడదనే చైతన్యం నుంచి, ఆచరణ నుంచి పోగుపడిన అనుభవం దీని ఇతివృత్తం. కాబట్టి రచయిత ఏ ప్రామాణిక పద్ధతులనూ పాటించలేదు. దీన్ని ఆయన చారిత్రాత్మక స్మృతులు అంటూనే నవలా నిర్మాణంలో రావాల్సిన విప్లవాత్మక మార్పులను చర్చనీయాంశం చేసే శిల్పాన్ని ఎంచుకున్నారు. నవలతో సహా సాహిత్య ప్రక్రియలన్నీ మానవ సంస్కృతికి సంబంధించినవి. జీవన సంస్కృతి మారే క్రమంలో కళా రూపాల ప్రమాణాలు కూడా మారవలసి ఉంటుంది.

ఈ దృష్టితో చూసినప్పుడు హుస్సేన్ తీసుకొచ్చిన శిల్పపరమైన మార్పులు పాఠకులకు సన్నిహితమైనవి. ఈ నవలలో మనకు రచయిత కూడా కనిపిస్తారు. కానీ కథ రచయిత చెప్పరు. ప్రజలందరి గాఢమైన అనుభవాన్ని కథలోకి మళ్లించి ఆబ్జెక్టివ్‌గా, గ్రాఫికల్‌గా చెబుతూపోతారు. ఒక ఆలోచన నుంచి మరో కొత్త ఆలోచన రావడానికి, ఒక పని నుంచి అంతకంటే ఉన్నతమైన పనిలోకి సాగడానికి మనుషులు అనుభవించే ప్రయాస అంతా రాశారు. అనేక సమూహాల అనుభవంగా, ఒక కాలపు అనుభవంగా చెబుతారు. తీవ్రమైన భావోద్వేగాలు, అసాధారణమైన సాహసాలు, విపరీతమైన సందిగ్ధతలు, నిలువ నీటిలో ఒక చిన్న కదలిక తేవడానికి లెక్కలేనన్ని ప్రయత్నాలు, అత్యంత సృజనాత్మకమైన ఊహలు ధరించే వాస్తవ రూపాలు.. నవలగా మారాయి. ఈ క్రమంలో ఇందులోకి వచ్చిన దుఃఖం, తెగువ ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. నడుస్తున్న చరిత్రతోపాటు ప్రజల అనుభవం ఎన్నెన్ని రూపాల్లో విస్తరించేదీ చిత్రించడమే ఈ నవల ప్రత్యేకత.

■ పాణి ✆ 98661 29458

# మోహం

1
జీవితమ్మీద ఇంత మోహమేమిటి
అంటారు
ఏ రోజైనా వెళ్ళిపోయే విరక్తి ఉంది గనక
అంటావు




ఆ దీపం వెలుతురు, బాటపై మనుషులు,
ఇళ్లపై వెలుగునీడల దోబూచులాట
ఉండి ఉండి తగిలే గాలితెరలు
కురవలేక బేలగా నిలబడిన మబ్బులు
మానుష ప్రపంచపు వింతవింత శబ్దాలు
చనిపోతే ఇక దొరకవు కదా అని కూడా



2
జీవించటం ఇంత అపురూపమైన సంగతా
అంటారు

చనిపోతే అంతా చెరిగిపోతుంది,
ఇదంతా ఉంటుందో, లేదో తెలియకుండాపోతుంది
వెళ్ళిపోగల ప్రతి సంగతీ అపురూపమే అంటావు
ఉండటం మీద ఇష్టంతో కదా
ఇదంతా ఇక్కడ ఉంది అని కూడా



3
ఇవాళ తెల్లవారింది
వెలుతురులో ప్రపంచం ఉత్సవం జరుపుకుంది

సౌఖ్యం, దుఃఖం, కలయిక, వియోగం
ప్రతిదీ ఒక ఉత్సవం, ఒక ప్రార్థన, ఒక దీవెన
గాఢనిద్రలో మెరిసే ఖాళీలో
మిగిలేదేమీ లేదు కదా అంటావు



4
నువు ప్రేమించేది దేనినీ చెప్పమంటారు

దేనిని ప్రేమిస్తున్నానో నాకూ తెలియదు
బహుశా, ఈ వెలుగునీడల కదలికల్లో
నన్ను నేనే పొందుతున్నాను, దాచుకొంటున్నాను
జీవితం ప్రియురాలి రూపంలో
నన్నే చూసుకుని ఆశ్చర్యపోతూ, ప్రేమిస్తున్నాను




5
ఇంతలో, తలుపు తెరిచిన చప్పుడయింది
తలుపు, తెరవటం, చప్పుడు, వినబడడం
మన అర్థాలకి అందని
ఈ అనుభవ సమూహం
మనని దేనికి తట్టి లేపాలని చూస్తుంది

■ బివివి ప్రసాద్
✆ 90320 75415



**మాకు నెంబర్స్ కంటే ఈ కొత్త పాఠకులను తయారుచెయ్యడం ఎక్కువ సంతోషాన్నిస్తోంది. అలాగే ఈ కొత్త రీడర్స్‌లో మేము గమనించింది ఏంటంటే, ఏదైనా నచ్చితే దాన్ని తమకు నచ్చిన పద్ధతిలో ఫ్రెండ్స్‌కి షేర్ చేస్తారు. అందువల్లే ఈ పుస్తకం ఒకరి నుంచి ఒకరికి పాకి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది.**



## 3? మూడు ప్రశ్నలు

■ వి. మల్లికార్జున్

# రెండొందల కాపీలు పోని చోట ముప్పైమూడు వేలు ఎలా అమ్మారు!

**మీ ప్రచురణ సంస్థ అజు పబ్లికేషన్స్ విడుదల చేసిన రవి మంత్రి నవల 'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' ముప్పైమూడువేల కాపీలు అమ్ముడై బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. ఇంతమంది పాఠకుల దాకా పుస్తకాన్ని తీసుకువెళ్ళటానికి మీరు ఎలాంటి ప్రయత్నాలు చేశారు?**

'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' నవల ఇరవై ఐదు వేల కాపీలు అమ్ముడై ముప్పై వేలకు దగ్గరవుతుండటం మాకు ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది. ఇందులో పబ్లిషర్స్‌గా మేమేం చేశామని ఆలోచిస్తే ఈ ఒక్క పుస్తకం కోసమే అని ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. తెలుగులో ఒక పుస్తకం వెయ్యి కాపీలు అమ్ముడైతే చాలు అనుకుంటున్న రోజుల్లో 'అజు పబ్లికేషన్స్' పుట్టింది. నేనేమీ ఈ నెంబర్స్ మార్చాలని, వేల కాపీలు అమ్మాలని అనుకొని ఇది మొదలు పెట్టలేదు. నా పుస్తకాలు నేనే ప్రచురించుకుందామని మొదలుపెట్టాను. నాతోపాటు కోపబ్లిషర్‌గా శ్వేత యర్రం జాయినయ్యాక వేరే రచయితల పుస్తకాల్ని కూడా ప్రచురించడం మొదలుపెట్టాం. అన్ని పుస్తకాలకూ ఎలా పని చేస్తామో అలాగే 'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' పుస్తకానికీ చేశాం. 2023 జూన్‌లో ఈ పుస్తకం మార్కెట్లోకి వస్తే 2024 మే వరకు మూడు ఎడిషన్లు అయిపోయాయి. అప్పటికే మేము ఈ పుస్తకం బాగా వెళ్తోంది కదా అనుకున్నాం. నాలుగో ఎడిషన్ వెయ్యి కాపీలు ప్రింట్ చేస్తే రెండే రెండు రోజుల్లో అయిపోయాయి. ఆ వెంటనే ఐదు, ఆరు, ఏడు – ఇలా ఎడిషన్‌కి రెండు వేల కాపీలు ప్రింట్ చేసినా వారంరోజుల్లోపే అయిపోతున్నాయి. ఎనిమిదో ఎడిషన్‌కి ఐదు వేలు, తొమ్మిదో ఎడిషన్‌కు పది వేలు, ఇప్పుడు పదో ఎడిషన్‌కు పది వేలు వేశాం. ఇలా గత రెండు నెలలుగా పుస్తకం రీప్రింటుకి వెళ్తూనే ఉంది.

ఇంత డిమాండ్‌కి కారణం ఏంటని అన్ని కోణాల్లోంచి విశ్లేషిస్తూనే ఉన్నాం. కచ్చితంగా ఇక్కడ మొదలైందని చెప్పలేం గానీ, ఇన్‌స్టాగ్రాంలో కొన్ని మీమ్ పేజీలు ఈ పుస్తకాన్ని చదివి రీల్స్ చేశాయి. అందులో కొన్నింటికి యాభై అరవై లక్షల వ్యూస్ వచ్చాయి. అదే టైంకి ఇన్‌స్టాగ్రాంలో ఈ పుస్తక రచయిత రవి మంత్రి కూడా కంటెంట్ క్రియేటర్‌గా బాగా పాపులర్ అయ్యాడు. అన్నీ కలిసి రెండు నెలల క్రితం ఈ పుస్తకానికి ఒక క్రేజ్ తీసుకొచ్చాయని అనుకుంటాను. ఆ క్రేజ్ చూసి కొన్నవాళ్ళంతా చదివి బాగుందంటూ షేర్ చెయ్యడం మొదలుపెట్టాక ఇంక ఈ పుస్తకం ఆగింది లేదు. మేమెప్పుడూ పేర్లు కూడా వినని చిన్న చిన్న బుక్ షాప్‌ల నుంచి రోజూ ఫోన్లు వస్తున్నాయి. అమెజాన్‌లో వచ్చే ఆర్డర్లను ప్యాక్ చెయ్యడానికి వర్క్ ఫోర్స్ సరిపోక రోజుకి ఐదొందల ఆర్డర్లకు మించి తీసుకోలేని పరిస్థితి. ఈ రెండు నెలలుగా మేం చూస్తున్న ప్రతిదీ మాకు కొత్తదే. ఈ పుస్తకం ఎంత దూరం వెళ్తుందని అడిగితే మాకైతే ఇంకా ఏ అంచనా రాలేదు.

మీరడిగిన ప్రశ్న దగ్గరికే మళ్ళీ వెళ్దాం. పబ్లిషర్స్‌గా మేం చేసింది ఏంటంటే, మొదట్నుంచీ మేం కట్టుబడి ఉన్న విషయాలు కొన్ని ఉన్నాయి:

1) పుస్తకానికి వీలైనంత తక్కువ ధర పెట్టడం. (కొన్ని పుస్తకాలకు మొదటి ఎడిషన్ అయిపోయిన తర్వాత కూడా బ్రేక్ ఈవెన్ రాలేదు)

2) కొత్త పాఠకులను చేరే మార్గాలను వెతుకుతూనే ఉండటం. ఈ క్రమంలోనే ట్విట్టర్‌లో, ఇన్‌స్టాగ్రాంలో మా ప్రెజెన్స్‌ను ఈ మూడేళ్లలో ఇరవై రెట్లు పెంచగలిగాం. మాకొచ్చే ఆర్డర్లలో ఎక్కువ శాతం సోషల్ మీడియా ద్వారా వచ్చేవే. ఇప్పుడు అమ్మ డైరీలో.. పుస్తకాన్ని చదివి ఓన్ చేస్కొని ఇంత దూరం తీసుకొచ్చింది కూడా ఇన్‌స్టాగ్రాం బాగా వాడే పాతికేళ్ళలోపు వయసున్నవాళ్ళే. వీళ్ళలో చాలామందికి ఇది మొదటిపుస్తకం. వాళ్ళంతా మొదటిసారి ఒక పుస్తకం చదువుతుంటే కలిగే అనుభూతి గురించి చెప్తుంటే బాగుంది. మాకు నెంబర్స్ కంటే ఈ కొత్త పాఠకులను తయారుచెయ్యడం ఎక్కువ సంతోషాన్నిస్తోంది. అలాగే ఈ కొత్త రీడర్స్‌లో మేము గమనించింది ఏంటంటే, ఏదైనా నచ్చితే దాన్ని తమకు నచ్చిన పద్ధతిలో ఫ్రెండ్స్‌కి షేర్ చేస్తారు. అందువల్లే ఈ పుస్తకం ఒకరి నుంచి ఒకరికి పాకి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది.

3) కంటెంట్ విషయంలో క్వాలిటీ అన్నది ఎలాగో మా బేసిక్ రూల్. ప్రింట్ క్వాలిటీ కూడా బాగుండాలని బలంగా నమ్ముతాం. అలాగే ఎవరైనా పుస్తకం కోసం వెతికితే అది వెంటనే దొరికేలా అమెజాన్ స్టోర్‌ఫ్రంట్‌ను నడిపిస్తున్నాం.

సోషల్ మీడియాలో సెన్సేషన్ అయిన అమ్మ డైరీలో కొన్ని పేజీలు పుస్తకానికి, ముందు నుంచీ మేము ఫాలో అవుతున్న ఈ అంశాలు ఒక ప్లాట్ఫాంగా పనిచేసి ఉండొచ్చు అనుకుంటున్నా.

**పుస్తకంలో ఏ అంశం/ ఏ విధమైన శైలి పాఠకుల్ని ఇంతగా ఆకట్టుకుంది అనుకుంటున్నారు?**

ఈ పుస్తకానికి బ్యాక్ కవర్లో రవి మంత్రి రాసినట్టు 'ఇది అమ్మ ప్రేమ కథ' అన్న అంశం ఎక్కువమందిని ఆకర్షించింది. చక్కటి శైలితో ఒక్కసారి మొదలుపెడితే చివరివరకు చదివింపజేసే కథనం అందరికీ నచ్చింది. ప్రేమలో అవతలి మనిషిని కోల్పోతామేమో అనే భయమూ, కోల్పోయినప్పుడు ఉండే బాధా ఈ నవలలో కనిపిస్తాయి. వాటిగురించీ ఎక్కువమంది మాట్లాడటం చూస్తుంటే, నిజాయితీగా ప్రేమలో ఉండే ఇన్నొసెన్స్‌ని పట్టుకొని రాయడం వల్ల కూడా ఈ నవలకు ఇంత పాపులారిటీ వచ్చి ఉండొచ్చు.

**మీ 'అజు పబ్లికేషన్స్' దగ్గర నుంచి ఇప్పటిదాకా వచ్చిన టైటిల్స్ లో యంగ్ ఆడియన్స్‌ని ఆకట్టుకున్న ఇతర టైటిల్స్ ఏమిటి? పుస్తకాల్లోని ఏయే ఫాక్టర్స్ యంగ్ ఆడియన్స్ ని ఆకట్టుకుంటున్నాయని మీరు భావిస్తున్నారు?**

మేము ఇప్పటివరకు పద్నాలుగు పుస్తకాలు ప్రచురిస్తే అందులో ఏడు కొత్త రచయితల మొదటి పుస్తకాలే. ఇందులో దాదాపు అన్ని పుస్తకాల రీడర్ బేస్ కూడా యంగ్ రీడర్సే. నల్లగొండ కథలు, ఇరానీ కేఫ్, గాజుల సంచి, రామగ్రామ నుంచి రావణలంక దాకా, కాగితం పడవలు – ఈ పుస్తకాలన్నీ అమెజాన్‌లో బెస్ట్‌సెల్లర్స్ ప్లేసుకెళ్ళి కనీసం మూడు రీప్రింట్‌లకు వెళ్ళాయి. సులువుగా ఉండే భాష, ఈతరం మాట్లాడుకునే సంభాషణలే ఉండటం వల్ల కూడా యంగ్ రీడర్స్‌కు ఈ పుస్తకాలు దగ్గరయ్యాయనుకుంటాను. సరిగ్గా చదివింపజేసే శైలితో వాళ్ళు రిలేట్ చేసుకోగలిగేలా రాస్తే ఎలాంటి థీమ్స్‌ని అయినా యాక్సెప్ట్ చేస్తున్నారు. అలాగే కొత్తగా పుస్తకాలు చదువుతున్న చాలామంది కథ కంటే నవలనే ఎక్కువ ఇష్టపడుతున్నారనిపిస్తోంది.

(వి. మల్లికార్జున్ రచయిత, ప్రచురణకర్త.
శ్వేత యర్రంతో కలిసి అజు పబ్లికేషన్స్ నడుపుతున్నారు.
అజు పబ్లికేషన్స్ ఇప్పటి దాకా 14 పుస్తకాలు ప్రచురించింది.)

### దీపావళి కథల పోటీ

డాక్టర్ అమృతలత – పాలపిట్ట సంయుక్త ఆధ్వర్యంలో దీపావళి కథల పోటీకి రచయితలు తమకు నచ్చిన ఇతివృత్తంతో కథలు రాసి పంపాలి. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు. మరో పది కథలకు రూ.1000 చొప్పున ప్రత్యేక బహుమతులు. కథలను సెప్టెంబర్ 25లోగా చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 3, బ్లాక్ 6, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500044కు పంపాలి. మరిన్ని వివరాలకు ఫోన్: 9490099327 ఈమెయిల్: palapittabooks@gmail.com

గుడిపాటి

### బెల్లంకొండ రామదాసు శత జయంతి సదస్సు

కేంద్ర సాహిత్య అకాడమీ, పల్నాడు కళా క్షేత్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న బెల్లంకొండ శత జయంతి సదస్సు ఆగస్ట్ 25న ఉ.10 నుంచి సా.5గంటల వరకు నరసరావుపేటలో భువనచంద్ర టౌన్ హాల్‌లో జరుగుతుంది. సదస్సులో బెల్లం కొండ సాహిత్యంపై పత్ర సమర్పణ ఉంటుంది. సి. మృణాళిని, వేదాంతం సీతరామావధాని, సయ్యద్ నశీర్ అహ్మద్, రెంటలా జయదేవ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 9966757407

కరీమ్

### మినీకథల పోటీ


కీ.శే. భావరాజు సత్యన్నారాయణ మూర్తి 89వ జన్మదిన సందర్భంగా శ్రీమతి భావరాజు రాజ్యలక్ష్మి (విశాఖపట్నం) 'సాహితీ కిరణం' పత్రిక సౌజన్యంతో మినీ కథల పోటీ నిర్వహిస్తున్నారు. మూడు ఉత్తమ కథలకు రూ.1,116/ చొప్పున మూడు నగదు బహుమతులు ఉంటాయి. కథ 250 నుండి 300 పదాల మధ్యలో డీ.టీ.పీ. చేసినవి కాని, చక్కని దస్తూరితో కాగితానికి ఒక వైపు వ్రాసినవి కానీ అయి ఉండాలి. కథలను ఆగస్ట్ 31లోగా చిరునామా: ఎడిటర్, సాహితీ కిరణం, ఇం.నెం.1113154, రోడ్ నెం.3, అలకాపురి, హైదరాబాద్-500102. సెల్:9490751681కు పంపాలి.

పొత్తూరి సుబ్బారావు

పవిత్రోత్సవాల సందర్భంగా తొలిరోజు ఆదివారం ఇంద్రకీలాద్రి భక్తులతో పోటెత్తింది. మూడు రోజులపాటు ఆలయంలో పవిత్రోత్సవాలను నిర్వహిస్తారు. వేకువజామున 3 గంటల నుంచి అమ్మవారికి సుప్రభాత సేవ, స్నపన కార్యక్రమాలను నిర్వహించటం కారణంగా సమయం తీసుకోవటంతో సాధారణ దర్శన సమయానికన్నా ఆదివారం 4 గంటలు ఆలస్యంగా దర్శనాలు ప్రారంభమయ్యాయి. క్యూలైన్లలో భక్తులు భారీ సంఖ్యలో వేచి ఉన్నారు.

## బ్యారేజీకి మళ్లీ వరద

53,866 క్యూసెక్కుల నీరు రాక



ప్రకాశం బ్యారేజీ గేట్లు మళ్లీ పైకి లేచాయి. పులిచింతలకు అనుబంధంగా ఉన్న జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా విడుదల చేస్తున్న నీటిని దిగువకు విడుదల చేశారు. జలవిద్యుత్ కేంద్రం నుంచి 16 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం పులిచింతల నుంచి 53,866 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ఈ మొత్తం నీటిని 50 గేట్లను అడుగు మేరకు ఎత్తి దిగువలోకి విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ 20 గేట్లను కిందికి దించి ఉంచారు. ఈ ఇన్‌ఫ్లో మరో రెండు రోజులు ఉంటుందని బ్యారేజీ అధికారులు చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

## ఇంద్రకీలాద్రి కిటకిట



# ఆస్థాన అసిస్టెంట్లు


## సంప్రదాయంగా మారిన అసిస్టెంట్లు

### ప్రతి ఇన్‌స్పెక్టర్‌కు ప్రత్యేకంగా ఒక అసిస్టెంట్

### ఇన్‌స్పెక్టర్‌గా ఎవరున్నా అసిస్టెంట్లు మాత్రం వాళ్లే

**ఇన్‌స్పెక్టర్ల తర్వాత తామే అన్నట్టుగా వ్యవహరిస్తున్న అసిస్టెంట్లు**

కొద్దిరోజుల క్రితం ఒక అర్జీదారుడు ఓ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. రిసెప్షన్‌లో కూర్చున్న సిబ్బంది ఏం కావాలని అడిగారు. ఇన్‌స్పెక్టర్ అసిస్టెంట్ కావాలని అర్జీదారుడు అడిగాడు. ఆయన బయటకు వెళ్లారని సమాధానం చెప్పగానే ఏ పని మీద వచ్చాడో చెప్పకుండానే వెళ్లిపోయాడు అర్జీదారుడు.



**(ఆంధ్రజ్యోతి-విజయవాడ) :** కృష్ణాజిల్లా, కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లకు అసిస్టెంట్లుగా వ్యవహరిస్తున్న కానిస్టేబుళ్ల తీరు వివాదాస్పదమవుతోంది. ఈ అసిస్టెంట్ల స్థానంలో కొంతమంది ఏళ్లతరబడి పాతుకుపోవడంతో ఆరోపణలూ తీవ్రంగానే వస్తున్నాయి. కమిషనరేట్, కృష్ణా జిల్లాలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు ఇన్‌స్పెక్టర్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారు. ఈ రెండు కాకుండా ప్రత్యేకంగా సీసీఎస్ విభాగంలోనూ ఇన్‌స్పెక్టర్లు ఉంటారు. జిల్లాలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు నగరాలు, పట్టణాల్లో మాత్రమే ఉంటాయి. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ స్టేషన్లకు ఎస్‌హెచ్‌వోలుగా వ్యవహరించే ఇన్‌స్పెక్టర్లకు సహాయకుడిగా కానిస్టేబుల్, హోంగార్డును నియమించుకునే అవకాశం ఉంది. ఎక్కువమంది ఇన్‌స్పెక్టర్లు కానిస్టేబుళ్లను అసిస్టెంట్లుగా నియవిఎంచుకున్నారు. చాలామంది తక్కువ మంది మాత్రమే హోంగార్డులను అసిస్టెంట్లుగా ఏర్పాటు చేసుకున్నారు. ఎస్‌హెచ్‌వోలకు సహాయకులుగా ఉండాల్సిన ఈ అసిస్టెంట్లు స్టేషన్లకు సర్వస్వం అయిపోతున్నారు. వారి ప్రవర్తన పోలీసు వర్గాల్లోనే విమర్శలకు తావిస్తోంది.


### మార్పు కనిపించేనా..

ఒక్కో పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ మూడేళ్లపాటు పనిచేస్తారు. కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్లను ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకుంటే బదిలీ చేస్తారు. స్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఇన్‌స్పెక్టర్ ఒక అసిస్టెంట్‌ను ఏర్పాటు చేసుకుంటే ఆ తర్వాత ఎంతమంది ఇన్‌స్పెక్టర్లు మారినా వాళ్లే అసిస్టెంట్లుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం కమిషనరేట్‌లో బదిలీలు జరుగుతున్నందున అసిస్టెంట్ల వ్యవహారంపై జోరుగా చర్చ సాగుతోంది. ప్రస్తుతం అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారు సుదీర్ఘకాలంగా అదే పోస్టులో కొనసాగుతున్నారు. కొద్దిరోజుల క్రితం రెండు దఫాలుగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగాయి. తాజాగా కమిషనరేట్‌లో 100 మంది ఎస్‌ఐలను మార్పు చేశారు. ఈ నేపథ్యంలో ఇటు కమిషనరేట్‌లోను, అటు జిల్లాలోను అసిస్టెంట్ల మార్పు ఉంటుందా అన్న ప్రశ్న పోలీసు వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. ఇన్‌స్పెక్టర్లకు అసిస్టెంట్లుగా వ్యహరించేవారు యూనిఫాంలో ఉండరు. నిత్యం సివిల్ దుస్తుల్లోనే కనిపిస్తారు. ఇన్‌స్పెక్టర్ ఎక్కడికి వెళ్తే అక్కడికి వెంట వెళ్తారు. స్టేషన్‌లో ఇతర సిబ్బంది మాదిరిగా షిఫ్టులు ఉండవు. ఒకవేళ వీఐపీ బందోబస్తులు నిర్వహించాల్సి వచ్చినా ఇన్‌స్పెక్టర్లకు నీడలా ఉంటారు. ఇవన్నీ పైకి కనిపించే సదుపాయాలు మాత్రమే. పైకి కనిపించని, ఆధారాలు లేని రాచకార్యాలు కొన్నింటిని అసిస్టెంట్లు చక్కబెట్టేస్తారు. ప్రస్తుతం కృష్ణా జిల్లాలోనూ, కమిషనరేట్ పరిధిలోనూ ఆరోపణలు బలంగా ఉన్న వారు ఇన్‌స్పెక్టర్లకు అసిస్టెంట్లుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా జరిగిన బదిలీల్లో ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు ఎంత పోటీ ఏర్పడిందో ఇప్పుడు అసిస్టెంట్ సీట్లు ఎక్కడానికి ఆ విధంగానే పోటీ పడుతున్నారు. ఇన్‌స్పెక్టర్లకు అసిస్టెంట్లుగా ఉండడంతో స్టేషన్లలోని సిబ్బందితో కొంతమంది చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. మహిళా సిబ్బందిని నువ్వు అని ఏకవచనంతో సంబోధిస్తున్నారని వారు ఆవేదన చెందుతున్నారు.

### మాకు అవకాశం ఇవ్వండి

ఇటీవల జరిగిన బదిలీల్లో పాత నీరు పోయి కొత్త నీరు వచ్చింది. కొంతమంది ఇన్‌స్పెక్టర్లు ఎప్పటి నుంచో ఉన్న వారినే అసిస్టెంట్లుగా కొనసాగిస్తున్నారు. మరికొంతమంది పాత వారిని పక్కన పెట్టి తాత్కాలికంగా ఒకరిని ఏర్పాటు చేసుకున్నారు. స్టేషన్‌లో సిబ్బందిని మొత్తం స్కాన్ చేసిన తర్వాత మంచి మార్క్ ఉన్న వారిని అసిస్టెంట్లుగా నియవిఎంచుకోవాలని మరి కొంతమంది ఇన్‌స్పెక్టర్లు చూస్తున్నారు. దీంతో అసిస్టెంట్ల పోస్టులోకి ఎక్కడానికి సిబ్బంది పోటీ పడుతున్నారు. తమకు అవకాశాలు ఇవ్వాలని కొంతమంది నేరుగా ఇన్‌స్పెక్టర్లకు విన్నవించుకుంటే, మరికొంతమంది స్పెషల్ బ్రాంచ్‌లో ఉండే ఇన్‌స్పెక్టర్లతో సిఫార్సులు చేయించుకునే పనిలో ఉన్నారు.

## ఆకాశ దేశాన అరుణోదయం!



ప్రశాంతమైన ఆకాశంలో కత్తుల సమరం జరిగినట్టు.. నీలి మబ్బులన్నీ రక్తంతో తడిసి ఎకమైనట్టు.. బంగారపు వన్నెతో మెరిసిపోయే భానుడికి ఆ రక్తాన్ని పక్షి అద్దుతున్నట్టు ఉన్న ఈ దృశ్యం విజయవాడలోని సూర్యాస్తమయాన కనిపించింది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించిన కొన్ని చిత్రాలు 4వ పేజీలో..

## ఆగని కిడ్నీ మరణాలు

- ఎ.కొండూరులో మరో వృద్ధురాలి మృతి

**ఎ.కొండూరు, ఆగస్టు 18 :** మరో ఉద్దానంగా పేరుగాంచిన ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధి మరణమృదంగం మోగిస్తుంది. వ్యాధి బారినపడిన రోగులు ఒక్కొక్కరుగా ప్రాణాలు కోల్పోతున్నారు. మండల కేంద్రమైన ఎ.కొండూరు చైతన్య నగర్ తండాకు చెందిన బాణావతు పగడమ్మ(64) కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఇటీవల క్రియాటిన్ పరీక్ష చేయగా సాధారణం కన్నా అధికంగా ఉంది. దీంతో డయాలసిస్ చేయించుకుంది. పగడమ్మకు వ్యాధి తీవ్రత పెరిగి ఆదివారం విజయవాడ జీజీహెచ్‌లో మృతిచెంది. మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని, కిడ్నీ వ్యాధికి శ్వాశత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు ఆనందరావు, వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు.



పగడమ్మ (ఫైల్)

## నీ సంగతి తేలుస్తా

- దుర్గగుడి సెక్యూరిటీ గార్డుకు వెలంపల్లి పూర్వ అనుచరుడు, ప్రస్తుత బీజేపీ నాయకుడు పైడి ఫణి బెదిరింపులు
- 25 మందిని ఉచితంగా అమ్మవారి దర్శనానికి తీసుకెళుతుండగా అడ్డుకున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు.. గార్డుపై ఫణి ఆగ్రహం


4లో..

# నష్టాల్లో దిగుబడి..

## వర్షాలు, తెగుళ్లతో పూర్తిగా దెబ్బతిన్న పెసర

- ఎకరాకు రూ. 12 వేలు నష్టం

తొలకరిలో ఎంతో ఆశతో సాగుచేసిన పెసర పూర్తిగా దెబ్బతిన్నది. దిగుబడి క్వింటాళ్లలో కాదు కదా కిలోల్లో కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఎకరానికి కౌలు కాకుండా రూ.12 వేల వంతున పెట్టుబడి నష్టం వాటిల్లడంతో రైతుల ఆవేదనకు అంతు లేకుండాపోయింది. పెసర ఒకవైపు వర్షాలు, మరోవైపు చీడపీడల వల్లే ఈ దుస్థితి దాపురించింది.



కాయల్లేని పెసర మొక్కలు

**కంచికచర్ల, ఆగస్టు 18 :** జిల్లాలో ఈ ఏడాది తొలకరిలో 10 వేల ఎకరాలకుపైగా పెసర సాగైంది. సాధారణంగా ఆగస్టు రెండో వారం నుంచి పెసర కోతలు జరుగుతుంటాయి. అలాంటిది ప్రస్తుతం ఒక్క గింజ కూడా ఇంటికి రాలేదు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల పెసర చేలు నిలువునా దెబ్బతిన్నాయి. తెగుళ్లు ఉధృతంగా సోకాయి. పురుగు దాడి ఎక్కువైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు నాలుగు సార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా పురుగు తగ్గలేదు. తెగుళ్లు అదుపులోకి రాలేదు. దీనికితోడు గత నెలలో చేలు పూత దశలో ఉండగా భారీ వర్షాలు పడ్డాయి. ఎడతెగని వర్షాలకు పూత మొత్తం దూసుకుపోయింది. మళ్లీ చేలు తిప్పుకున్నాయి. మరోసారి పూత వచ్చింది. పూత, పిందెలతో కళకళలాడుతున్న చేలు, గతవారం కురిసిన భారీ వర్షాలకు మళ్లీ దెబ్బతిన్నాయి. పూత, పిందె మళ్లీ దూసుకుపోయాయి. అక్కడక్కడా ఒకటీ అర ఉన్న కాయలను పురుగులు తినేస్తున్నాయి.

### పడిపోయిన దిగుబడి

సాధారణంగా ఎకరానికి మూడు నుంచి ఐదు బస్తాల వరకు దిగుబడి వస్తుంది. పంట దెబ్బతినడంతో బస్తాల సంగతి దేవుడెరుగు? మానికల్లో కూడా దిగుబడి వచ్చేటట్టుగా లేదు. వ్యవసాయం, విత్తనాలు, పురుగు మందులు, ఇతరత్రా కలిపి ఎకరానికి రూ.12 నుంచి రూ.13 వేలు పెట్టుబడి అయింది. ఎకరం కౌలు సగటున రూ.15 వేలు అయింది. కళ్ల ముందే పంట దెబ్బతిని నష్టపోవాల్సి రావటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటల బీమా పథకం వర్తిస్తుందో లేదో ఇంకా తెలియదు. వ్యవసాయాధికారులు సైతం తెలియదంటున్నారు తప్పితే ఏమీ చెప్పలేకపోతున్నారు.

### వర్షాలకు పంట దూసుకుపోయింది



ఈ ఏడాది తొలకరిలో 40 ఎకరాల్లో పెసర సాగు చేశాను. నాలుగు సార్లు పురుగు మందు పిచికారీ చేశాను. వర్షాలకు పూత రెండు సార్లు దూసుకుపోయింది. కౌలుతో ఎకరానికి రూ.28 వేల వంతున ఖర్చు అయింది. కనీసం పొలంలో చల్లిన విత్తనాలైనా చేతికి దక్కకపోగా, పొలం బాగు చేసేందుకు రూ.ఐదు వేల వరకు ఖర్చు అవుతుంది.

- జాలిపర్తి మనోహర్, కంచికచర్ల

### ప్రభుత్వం ఆదుకోవాలి



భారీ వర్షాలు, తెగుళ్లు, పురుగుల వల్ల పెసర రైతులు తీవ్రంగా నష్టపోయారు. కోతలు జరగాల్సిన తరుణంలో పూత, కాయలు లేని చేలు చూస్తుంటే కన్నీళ్లు ఆగటం లేదు. పది ఎకరాల్లో పంట వేయగా, కౌలు కాకుండా రూ.1.25 లక్షలు నష్టపోయాను. పంటల బీమా పథకం కింద పరిహారం వస్తుందో రాదో తెలియదు. బాధిత రైతులను ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలి.

- మాగంటి బాలకృష్ణ, నక్కలంపేట

# రైల్వే ఆపరేషనల్‌లో పాంప్లెట్ యుద్ధం

## అధికారుల వేధింపులపై కరపత్రాలతో ఉద్యోగుల తిరుగుబాటు



Station manager office RAJAHMUNDRY

1)D.Srinivas Reddy

O.s.(Office superintendent)

2)A.S.S.RANGANADH

Station manager

3) Prasad

Traffic inspector/Staff/BZA

➢ The following deeds are being done by them

ఉద్యోగులు ముద్రించిన కరపత్రం

- ముగ్గురు అధికారుల తీరుపై కరపత్రాల ముద్రణ
- ఉన్నతాధికారులకు తెలియడం కోసం ఆఖరి అస్త్రం
- డీఆర్ఎం ఆనంద్ పాటిల్ విచారణ చేపట్టాలని ఉద్యోగుల విన్నపం

బెజవాడ రైల్వే డివిజన్‌లో కిందిస్థాయి ఉద్యోగులపై అధికారుల వేధింపులు తీవ్రమయ్యాయి. రైల్వే ఆపరేషనల్ విభాగంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన కొందరు అధికారుల వేధింపులను దశాబ్దకాలంగా అనుభవిస్తున్న ఉద్యోగులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లలేక ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకున్నారు. తమపై జరుగుతున్న అకృత్యాలను కరపత్రాల రూపంలో ముద్రించి పంపిణీ చేయించారు. ప్రధానంగా ముగ్గురిపై అభియోగాలు చేస్తున్నారు. తమ సమస్య డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ తక్షణం పరిష్కరించాలని కోరుతున్నారు.

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ):** ఉద్యోగులు వదిలిన కరపత్రం ప్రకారం వారిపై వేధింపులకు పాల్పడుతున్న వారిలో విజయవాడ డివిజన్‌లో సీనియర్ డివిజినల్ ఆపరేషనల్ మేనేజర్ (సీనియర్ డీఓఎం) కింద పనిచేసే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ (టీఐ) ప్రసాద్ ఒకరు. ఈ టీఐ ప్రసాద్ స్టాఫ్ మ్యాటర్స్ చూస్తుంటారు. ఏ అధికారి అయినా ఒక స్థానంలో నాలుగు సంవత్సరాలకు మించి పనిచేయటానికి వీలు లేదు. మరి ఈ అధికారి ఏకంగా 15 సంవత్సరాలుగా ఇక్కడే పని చేస్తున్నారు. మొదటి నుంచీ తమను హింసిస్తున్నాడని ప్రసాద్‌పై డివిజన్‌కు చెందిన గార్డులు, డ్రైవర్లు వాపోతున్నారు. టీఐ ప్రసాద్ వైఖరి కారణంగా తమకు విశ్రాంతి దొరకటం లేదని వాపోతున్నారు. రన్నింగ్ స్టాఫ్ ఏడు నుంచి ఎనిమిది రోజుల పాటు విధి నిర్వహణ చేపడుతుంటారు. ఇలాంటి వారికి ఒకటి, రెండు రోజులు సెలవులు అవసరం ఉంటుంది. సెలవులు ఇచ్చే విషయంలో టీఐ తీరు తమకు ఇబ్బందికరంగా ఉంటుందని సిబ్బంది వాపోతున్నారు. సెలవులు తీసుకోవటానికి బతిమిలాడాల్సి వస్తోందని, అయినా కనికరించటం లేదని వాపోతున్నారు. గట్టిగా అడిగితే పనిష్మెంట్లకు సిఫార్సులు చేస్తున్నాడని, ధైర్యం చేసి ఆయన ముఖాన అడిగేవారికి డీఆర్ఎంకు చెప్పుకున్నా దిక్కుండదని అంటున్నారని వాపోతున్నారు. ఈ విషయాన్ని సీనియర్ డీఓఎంకు చెప్పుకుందామని ప్రయత్నిస్తే తమను కలవనీయకుండా టీఐ ప్రసాద్ అడ్డుకుంటున్నారని చెబుతున్నారు.

### స్టేషన్ మేనేజర్, ఓఎస్‌లపై మరో కరపత్రం

విజయవాడ డివిజన్ పరిధిలోని రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ మేనేజర్ ఆఫీసులో సిబ్బందిపై జరుగుతున్న దాష్టీకాలు, అవకతవకలపై మరో కరపత్రాన్ని ప్రచురించి పంపిణీ చేయటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. స్టేషన్ మేనేజర్ ఏబీఎస్ రంగనాథ్, ఆఫీసు సూపరింటెండెంట్ (ఓఎస్) శ్రీనివాసరెడ్డి... ఉద్యోగులపై సాగిస్తున్న వేధింపులు, అరాచకాలపై ఆ కరపత్రంలో పొందుపరిచారు. రాజమహేంద్రవరం స్టేషన్ పరిధిలో దాదాపుగా 300 మందికిపైగా రైల్వే గార్డులు, పాయింట్స్‌మెన్, స్టేషన్ మాస్టర్‌లను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పీరియాడికల్ రెస్ట్‌లకు సంబంధించి తీవ్ర అసమానతలు చూపుతున్నారని వాపోతున్నారు. సెలవుల కేటాయింపులో వీరిద్దరూ వ్యక్తిగత కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బాక్స్‌బాయ్ బిల్లుల చెల్లింపులో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయని చెబుతున్నారు. ఒక అధికారి 25 మంది ఉద్యోగులతో ఫంక్షన్లు చేసుకోవటంతో మేలో రూ.20 లక్షలకుపైగా ఓవర్‌టైమ్ ద్వారా రైల్వేకు నష్టం జరిగిందని ఉద్యోగులు అంటున్నారు. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవటం గమనార్హం.

### స్టేషన్‌మేనేజర్ అహంకార వైఖరి

స్టేషన్ మేనేజర్ రంగనాథ్ అహంకార వైఖరి చూపటం వల్ల ఉద్యోగుల సమస్యలు చెప్పనలవి కాకుండా ఉన్నాయని వాపోతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తీవ్ర పనిష్మెంట్లు ఇస్తున్నారని వాపోతున్నారు. కిందిస్థాయి ఉద్యోగులు అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ చేసినా రంగనాథ్‌కు విపరీతమైన చిరాకు, కోపం వస్తుందని, ఫోన్ చేసిన వారిపై విరుచుకుపడతారని, ఈ వ్యవహారాలన్నీ చూసే బాధ్యతలను శ్రీనివాసరెడ్డి మీద మోపటంతో ఆయన ఇష్టారాజ్యంగా మారిపోయిందనీ అంటున్నారు. అనుకూలురైన వారిని పోగేసుకుని వారితో విందులు, వేడుకలు చేసుకుంటూ మిగిలిన వారిపై పనిభారం మోపటం, ప్రశ్నించిన వారికి పనిష్మెంట్స్ విధించటం రివాజుగా మారిపోయిందని ఆరోపిస్తున్నారు. తమపై రంగనాథ్, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్ సాగిస్తున్న వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు. సమస్యలను డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ తక్షణం పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

దుర్గగుడిలో శాస్త్రోక్తంగా..

# పవిత్రోత్సవాలు ప్రారంభం



పూజలందుకుంటున్న అమ్మవారు

**వన్‌టౌన్, ఆగస్టు 18:** ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం శాస్త్రోక్త, వేదోక్త విధానంలో పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య పవిత్రాలను ఈవో రామారావు, ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్, ఇతర అర్చకులు ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకొచ్చారు. అనంతరం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, సర్వ ప్రాయశ్చిత్త విధులను నిర్వహించారు. పవిత్రాలకు ప్రోక్షణ చేసి అమ్మవారి మూల విరాట్‌కు, మల్లేశ్వరస్వామికి, నందీశ్వర విగ్రహానికి, అమ్మవారి వాహనం సింహం విగ్రహానికి, ఉపాలయాల్లో కొలువైన దేవతలకు పవిత్రాలను ధరింపజేశారు. పవిత్రోత్సవాల సందర్భంగా ఈనెల 20 వరకు పత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలను రద్దు చేశామని, నిత్య కైంకర్యాలను దేవస్థానం అర్చకులు మాత్రమే నిర్వహిస్తారని ఈవో రామారావు తెలిపారు.





మేళతాళాలతో పవిత్రాలు తీసుకొచ్చి, నంది విగ్రహానికి సమర్పిస్తున్న ఈవో, అర్చకులు

## దుర్గగుడిలో భక్తుల రద్దీ

దుర్గమ్మ ఆలయానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పవిత్రోత్సవాల తొలిరోజైన ఆదివారం అమ్మవారికి స్నపన కార్యక్రమాన్ని నిర్వహించటం, అర్చనాది కార్యక్రమాల కారణంగా ఉదయం 9 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేకువ జామున 3 గంటల నుంచి అమ్మవారికి సుప్రభాత సేవ, స్నపన కార్యక్రమాలను నిర్వహించటం కారణంగా సాధారణ దర్శన సమయానికన్నా 4 గంటలు ఆలస్యంగా దర్శనాలు ప్రారంభమయ్యాయి. భక్తులు క్యూలైన్లలో భారీ సంఖ్యలో వేచి ఉన్నారు. ఇప్పటికే శుక్ర, శని, ఆదివారాల్లో, పర్వదినాల్లో భక్తుల రద్దీని పురస్కరించుకుని అనుసరించాల్సిన విధి విధానాలను రూపొందించటంతో ఆయా విభాగాల అధికారులు భక్తులకు శీఘ్రదర్శనం కల్పించారు. భక్తులకు ఆలయ అధికారులు ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు.

### అమ్మవారికి కానుకగా మంగళసూత్రాలు



దాతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు



విజయవాడ మొగల్రాజపురానికి చెందిన కొండపల్లి హరి ప్రసాద్ కుటుంబసభ్యులు అమ్మవారి అలంకరణ నిమిత్తం 29 గ్రాముల బరువు గల రాళ్లు పొదిగిన బంగారు మంగళ సూత్రాలు, నాను కోడును ఆలయ అధికారులకు అందజేశారు. దాత కుటుంబసభ్యులకు అమ్మవారి చిత్ర పటం, ప్రసాదాలను అధికారులు అందించారు.

### అన్నవితరణకు విరాళం

దుర్గగుడిలో అన్నవితరణకు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం, బ్రాహ్మణపల్లి చెన్నాయబోడుకు చెందిన యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళాన్ని అధికారుల ద్వారా దేవస్థానానికి అందజేశారు. దాతలకు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని అందజేశారు.



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

## చాంబర్‌కు పూర్వవైభవం తీసుకురండి

- నూతన కార్యవర్గానికి ఎంపీ కేశినేని చిన్ని సూచన

**ధర్నాచౌక్, ఆగస్టు 18:** విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీని ఆర్థికంగా పటిష్ఠం చేసి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేయాలని నూతన కార్యనిర్వాహకవర్గానికి ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) సూచించారు. చాంబర్ నూతన కార్యనిర్వాహకవర్గ ప్రమాణస్వీకారం చాంబర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం బాలవెంకట రవికుమార్, వక్కలగడ్డ శ్రీకాంత్‌తో ఎంపీ ప్రమాణ స్వీకారం చేయించారు. చాంబర్ సభ్యులు, వర్తక, వ్యాపార వర్గాలు ఏకతాటిపై ఉండి చాంబర్‌ను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని ఎంపీ సూచించారు. చాంబర్‌కు అన్ని విధాలుగా అండగా ఉండి, చాంబర్ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. చాం బర్ సభ్యులు ప్రభుత్వానికి అండగా నిలవాలని, అన్న క్యాంటీన్లకు సహాయ సహ కారాలు అందించాలని కోరారు. తనను చాంబర్ అధ్యక్షుడిగా ఏకగ్రీవం చేయడంలో సహాయ సహకారాలు అందించిన కేశినేని చిన్ని, ఆశోక్‌బాబుకు అధ్యక్షుడు గడ్డం బాలవెంకట రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. చట్టాల్లో వచ్చే మార్పులపై సభ్యులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. చాంబర్‌కు అన్నివేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే గద్దె రామ్మో హన్ హామీ ఇచ్చారు.

### అన్న క్యాంటీన్లకు రూ.25 లక్షల విరాళమిస్తాం

చాంబర్ తరఫున అన్న క్యాంటీన్లకు రూ.25 లక్షల విరాళాన్ని సభ్యులందరి సహకారంతో ఎమ్మెల్సీ ఆశోక్‌బాబు నేతృత్వంలో సీఎం చంద్రబాబుకు అందజేస్తామని చాంబర్ కార్యనిర్వాహక సభ్యుడు దూండి రాకేష్ తెలిపారు.

## ఎనర్జీ అసిస్టెంట్లకు సర్వీస్‌రూల్స్ అమలు చేయాలి

- సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్

**ధర్నాచౌక్, ఆగస్టు 18:** గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లకు విద్యుత్ సంస్థల పాత సర్వీస్ రూల్స్(ఏపీఎస్ఈబీ)ను అమలు చేయాలని సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర ముఖ్య నేతల సమావేశం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. సచివాలయ బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇవ్వాలని అసోసియేషన్ నేతలు కోరారు. ప్రొబేషన్ పీరియడ్ కంప్లీట్‌ను 2022 జూలై నుంచి అమలు చేయాలన్నారు. బదిలీలకు అవకాశం కల్పించాలని, పాత ప్రమోషన్ చానల్ కల్పించి, ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్హత కలిగిన వారికి కన్వర్షన్ అవకాశం కల్పించాలని, ఆర్‌ఈ సీఎస్ చీపురుపల్లి ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని డిమాండ్ చేశారు. పేస్లిప్‌లలో రెగ్యులర్ అని రావాలని, టీఏ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని లేదంటే ఉద్యమ కార్యాచరణకు రాష్ట్రవ్యాప్తంగా సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి, సీవీ మంజునాథ్, ఏఐటీయూసీ అధ్యక్షుడు రవీంద్రనాథ్, కార్యదర్శి బాలకాశీ పాల్గొన్నారు.

## ఇంద్ర కష్టాలు

- సీఎం నియోజకవర్గానికి డొక్కు బస్సు !
- తరచూ మొరాయిస్తున్న విజయవాడ - కుప్పం ఇంద్ర బస్సు
- కుప్పం వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- సీఎం నియోజకవర్గానికి కూడా డొక్కు బస్సేనా అంటున్న ప్రయాణికులు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ):** ముఖ్యమంత్రి నియోజకవర్గమైనా సరే.. మా రూటే సపరేటు అన్నట్టుగా ఉంది ఆర్టీసీ అధికారుల తీరు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పానికి ఆర్టీసీ అధికారులు ఓ డొక్కు బస్సును నడుపుతున్నారు. విజయవాడ నుంచి కుప్పానికి నడుపుతున్న ఇంద్ర ఏసీ బస్సు తరచూ మరమ్మతులకు గురవుతోంది. ఎప్పుడు బస్సు ఆగిపోతుందో అర్థం కాని పరిస్థితి ఉంది. విజయవాడ బస్ డిపో నుంచి రోజూ ఇంద్ర ఏసీ బస్సు కుప్పం బయలుదేరుతుంది. ఈ బస్సు వారంలో నాలుగు రోజులు మొరాయిస్తోంది. ఎక్కడ పడితే అక్కడ ఈ ఆగిపోతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా సార్లు ఈ బస్సును రద్దు చేయాల్సి వస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గానికి బస్సు నడుపుతున్నామని ఆర్టీసీ అధికారులు ఆలోచించకపోవటం దురదృష్టకరమని వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా కుప్పానికి మంచి బస్సు వేయాలని, ఉన్నతాధికారులు ఈ దిశగా నిర్ణయం తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



సఫాన్ షాబాబ్‌ను సత్కరిస్తున్న జంపాల సీతారామయ్య తదితరులు

## సఫాన్ షాబాబ్‌కు ఇండియా బుక్‌లో చోటు

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 18:** ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన హర్యాజ్ పవర్ సేవింగ్ సిస్టం బై సోలార్ కార్యక్రమంలో సోలార్ కరెంట్‌ను ఉపయోగించి డొమెస్టిక్, గవర్నమెంట్, అగ్రికల్చర్ సెక్టార్లలో పవర్ ఆదా చేయడంపై ప్రదర్శన ఇచ్చి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో సఫాన్ షాబాబ్ చోటు సాధించాడు. అతను పశ్చిమ ఇబ్రహీంపట్నానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు షేక్ ముస్తఫా మనుమడు. ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య షాబాబ్‌ను సత్కరించారు.

# హంసలదీవి బీచ్‌లో విషాదం

- అలల తాకిడికి కొట్టుకుపోయిన ఆరుగురు
- యువకుడి గల్లంతు, మహిళ మృతి
- నలుగురిని రక్షించిన స్థానికులు, మెరైన్ పోలీసులు





సముద్రంలో కొట్టుకుపోతున్న వారిని రక్షించి ఆటోలో తరలిస్తున్న పోలీసులు, ప్రమాదం నుంచి బయటపడి అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళను పరామర్శిస్తున్న మండలి బుద్ధప్రసాద్



మృతిచెందిన షేక్ ఫజాలా



గల్లంతైన అబ్దుల్ ముషరఫ్

**కోడూరు, ఆగస్టు 18:** హంసలదీవి బీచ్‌లో ఆదివారం విషాదం నెలకొంది. అలల తాకిడికి ఓ యువకుడు గల్లంతయ్యాడు. మరో మహిళ మృతిచెందింది. గుడివాడ బంటుమిల్లి రోడ్డులోని నక్కల కాలువ రోడ్డులో నివసిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన 14 మంది రెండు ఆటోల్లో హంసలదీవి బీచ్‌కు ఆదివారం ఉదయం వచ్చారు. కొద్దిసేపు సముద్రంలో స్నానాలు చేశాక, ఆరుగురు లోపలికి వెళ్లారు. సముద్రపు పోటు అధికం కావటంతో ఒక్కసారిగా వారిని అలలు లోపలికి లాగేశాయి. గమనించిన స్థానికులు, మెరైన్ పోలీసులు ఐదుగురిని రక్షించారు. అబ్దుల్ ముషరఫ్(21) సముద్రంలో గల్లంతు కాగా, మిగిలిన వారిని ఒడ్డుకు తీసుకొచ్చారు. వారిని అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఐదుగురిలో షేక్ ఫజాలా(28) అనే మహిళ సముద్రపు నీళ్లు ఎక్కువగా తాగటంతో మృతి చెందింది. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, సీఐ యువకుమార్, ఎస్ఐ శిరీష యువకుడి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఒకరు మృతి చెంది, మరొకరు గల్లంతు కావటంతో కుటుంబసభ్యులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మహిళ మృతదేహాన్ని అవనిగడ్డలో పోస్టుమార్టం చేసి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై పి.శిరీష తెలిపారు.

### మృతుల కుటుంబాలను ఆదుకుంటాం : మండలి

**అవనిగడ్డ:** హంసలదీవి బీచ్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. మెరైన్ పోలీసులు రక్షించిన నలుగురిని అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, బుద్ధప్రసాద్ వారిని పరామర్శించి మృతుని కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. షేక్ హసీన్, అఫ్రిన్, కరీమ్‌లను పరామర్శించి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన మెరైన్ పోలీసులను అభినందించారు. గల్లంతైన ముషరఫ్ ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేసినట్లు తెలిపారు.



ముషరఫ్ కోసం పడవల్లో గాలింపు

### పర్యవేక్షణ లోపంతోనే..

పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సముద్రంలోకి యాత్రికులు పోటు సమయంలో లోపలికి వెళ్లకుండా సూచనలు చేయాల్సిన మెరైన్ సిబ్బంది తక్కువగా ఉండటం, కట్టుదిట్టమైన భద్రతలేని కారణంగా ఈ ఘటన జరిగిందని ప్రజలు అంటున్నారు. మెరైన్ సీఐ ఇటీవల బదిలీ కాగా, ఎవరినీ నియమించలేదు. పాలకాయితిప్ప సమీపంలో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేసినా సరిగా వాహనాలు తనిఖీలు చేయకపోవటం, పర్యవేక్షణ కొరవడడం స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు చెబుతున్నారు. పాలకాయితిప్ప మెరైన్ స్టేషన్‌కు 60 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, 20 మంది మాత్రమే ఉండటం, వారిని కూడా మూడు ప్రాంతాలకు పంపడంతో పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని వాపోతున్నారు.

## విద్యుత్ షాక్‌తో 18 నెలల చిన్నారి మృతి

- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



తండ్రితో చిన్నారి మైనా(ఫైల్)

**అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 18:** వచ్చీ రాని మాటలు, బుడి బుడి నడకలతో ఇల్లంతా సందడి చేస్తున్న చిన్నారి ఇక లేదని తెలిసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల వారు శోకసంద్రంలో మునిగిపోయారు. విద్యుత్ తీగల రూపంలో మృత్యువు 18 నెలల చిన్నారిని బలికొనడంతో ఆడుకుంటూ మృత్యు ఒడిలోకి వెళ్లిపోయిన చిన్నారిని చూసి న్యూ రాజరాజేశ్వరి పేటలోని కేజీఎఫ్ అపార్ట్‌మెంట్స్ వద్ద స్థానికులు కంటతడి పెట్టారు. కుంభా రాజ్‌కుమార్, తిరుపతమ్మలు న్యూ రాజరాజేశ్వరి పేటలోని అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్నారు. వీరికి మైనా(18 నెలలు) అనే కుమార్తె ఉంది. రాజ్‌కుమార్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం ఆడుకుంటూ అపార్ట్‌మెంట్ కింద భాగంలో ఉన్న విద్యుత్ మీటర్ల బోర్డు వద్దకు మైనా వచ్చింది. అప్పటికే విద్యుత్ బోర్డులోని విద్యుత్ తీగలు తెగి బోర్డు మొత్తం విద్యుత్ సరఫరా అవుతోంది. విద్యుత్ మీటర్ల బోర్డు వద్ద ఆడుకుంటున్న మైనా విద్యుత్ బోర్డుకు తగిలింది. ఒక్కసారిగి మైనాకు విద్యుత్ షాక్ తగలడంతో అలాగే ఉండిపోయింది. స్థానికులు, కుటుంబ సభ్యులు చిన్నారిని బోర్డు వద్ద నుంచి తప్పించి చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ చిన్నారి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది.

### కుటుంబానికి న్యాయం చేయాలి: సీహెచ్ బాబూరావు

చిన్నారి మైనా కుటుంబ సభ్యులను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పరామర్శించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి ఓ పసిప్రాణం బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మైనా కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

బాలిక మృతి చెందడానికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంత కాలంగా విద్యుత్ మీటర్ల బోర్డుకు వైర్ తగిలి విద్యుత్ షాక్ కొడుతోందని పలుమార్లు విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేశామని అయినా సమస్య పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైనా మృతి చెందిన సమాచారం తెలుసుకున్న సిబ్బంది ఆదివారం ఉదయం అపార్ట్‌మెంట్ల వద్దకు వచ్చి విద్యుత్ మీటర్ల బోర్డులో తెగి బోర్డు మొత్తానికి విద్యుత్ సరఫరా అవుతున్న విద్యుత్ వైర్లకు టేపులు వేసి అడ్డుగా ఓ చిన్న చెక్కముక్కను పెట్టి చేతులు దులుపుకొన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ప్రమాదం జరిగిన చోట చెక్కముక్కను ఏర్పాటు చేసిన విద్యుత్ సిబ్బంది



అపార్ట్‌మెంట్స్ విద్యుత్ మీటర్ల బోర్డు వద్ద చిందరవందరగా వైర్లు

## రూ.4.30 లక్షల విలువైన ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు, మోటార్లు స్వాధీనం

- 8 మంది చోరుల అరెస్టు

**గుడివాడ రూరల్, ఆగస్టు 18:** గుడివాడ రూరల్, పరిసర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు, మోటార్లు చోరీ చేస్తున్న 8 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.4.30 లక్షల విలువైన ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు, మోటార్లు, టాటా ఏస్ వాహనం స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు గుడివాడ రూరల్ ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు బొమ్మలూరు శివారు వద్ద సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా టాటా ఏస్ వాహనంలో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు తరలిస్తున్న గుడివాడ పంచవటి కాలనీకి చెందిన 8 మందిని అరెస్టు చేశామని ఆయన తెలిపారు. కట్టా కిరణ్, షేక్ మహబుబ్ సుభాని, గుంజ నాగరాజు, ఉప్పతల జమలయ్య ఉప్పతల రామకృష్ణ, ఇస్సాక్ బేగ్, గుంజ శివయ్య, ఉప్పతల రామకృష్ణను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంటిబాబు తెలిపారు.



విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఆర్‌హెచ్‌ఏ సంస్థ సభ్యులు

## నిత్యావసరాల పంపిణీ

**అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 18:** ఆర్‌హెచ్‌ఏ(రాబిన్‌హుడ్ ఆర్మీ) ఆధ్వర్యంలో పేద విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం మధురా నగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఆర్‌హెచ్‌ఏ రాష్ట్ర కోర్డినేటర్ కె.శ్రీనివాస్ విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఆర్‌హెచ్‌ఏ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. పేద విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నామని, చలికాలం దుప్పట్ల పంపిణీ, రక్తదాన శిబిరాలు రోడ్డుభద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. జీరో ఫండ్ విధానం ద్వారా నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమాలు ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు జరగనున్నాయని పేర్కొన్నారు. సంస్థ సిటీ ప్రతినిధి అజయ్, కో ఆర్డినేటర్లు రత్నశ్రీ, అనంతకుమార్, లక్ష్మీ, రామచంద్ర పాల్గొన్నారు.

# నీ సంగతి తేలుస్తా

- దుర్గగుడి సెక్యూరిటీ గార్డుకు వెలంపల్లి పూర్వ అనుచరుడు, ప్రస్తుత బీజేపీ నాయకుడు పైడి ఫణి బెదిరింపులు
- 25 మందిని ఉచితంగా అమ్మవారి దర్శనానికి తీసుకెళుతుండగా అడ్డుకున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుపై ఫణి ఆగ్రహం

**వన్‌టౌన్, ఆగస్టు 18:** వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మాజీ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అనుచరుడిగా చలామణి అయి, ప్రస్తుతం బీజేపీలో చేరిన కొత్తపేటకు చెందిన పైడి ఫణి దుర్గగుడిలో ఆదివారం హల్‌చల్ చేశాడు. టికెట్లు లేకుండా అమ్మవారి అంతరాలయ దర్శనానికి తీసుకెళ్లేందుకు మెట్ల దిగువన ఈవో కార్యాలయం పక్కన ఉన్న గేటు వద్దకు 25 మంది భక్తులను తీసుకెళ్లాడు. గేటు వద్ద విధుల్లో ఉన్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డు అతనిని అడ్డుకున్నాడు. తాను దుర్గగుడి లడ్డూ తయారీ కాంట్రాక్టర్ నని నన్నే అడ్డుకుంటావా? నీ సంగతి తేలుస్తానంటూ బెదిరింపులకు దిగాడు. సెక్యూరిటీ గార్డు ఆలయ ఏఈవో దృష్టికి తీసుకెళ్లాడు. ఏఈవో లడ్డూ తయారీ కాంట్రాక్టర్‌తో మాట్లాడాడు. కాంట్రాక్టర్ తాను భక్తులను తీసుకురాలేదని చెప్పాడు. దీంతో గేటు వద్ద హడావుడి చేసి కాంట్రాక్టర్ పేరు చెప్పిన పైడి ఫణిని పోలీసులకు అప్పగించమని సూచించారు. పోలీసులు అతనిని అదుపులోకి తీసుకోకుండా పక్కకు తప్పించి రూ.300 క్యూలైన్‌లో వదిలేశారు. దీనిపై పలువురు భక్తులు పైడి ఫణితో పాటు పోలీసు కానిస్టేబు ల్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. వారం క్రితం కూడా పైడి ఫణి 20 మందిని టికెట్ లేకుండా అంతరాలయం లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం అయనను అడ్డుకున్నాడు. దీంతో ఫణి సూపరింటెండెంట్‌పై రెచ్చిపోయి నీ అంతుచూస్తా, వారంలో నిన్ను లేపేస్తానంటూ బెదిరించాడు. ఇటీవల పశ్చిమ ఎమ్మెల్యే పేరు చెప్పి, ఓ మాజీ వైసీపీ నాయకుడు 40 మందిని టికెట్ కొనుగోలు చేయకుండా దర్శనానికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా, ఆలయ ఉద్యోగులు అడ్డుకున్నారు. ఆ నాయకుడు ఆలయ ఉద్యోగులను బెదిరించాడు. వీరిని కట్టడి చేయటంలో దేవస్థానంపై విధులు నిర్వహిస్తున్న పోలీసులు పూర్తిగా విఫలమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### లింగన్నకోడులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

**కోడూరు, ఆగస్టు 18:** లింగన్నకోడు మురుగు కాల్వలో శనివారం గల్లంతైన వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఉల్లిపాలెం గ్రామానికి చెందిన మాచర్ల బిన్ను(58) శనివారం పశువులను కడిగేందుకు కాలువలోకి దిగాడు. పశువులను కడిగి తన చేతి కర్ర నీటిలో మునిగి పోతుందని ముందుకు వెళ్లాడు. నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. గల్లంతైన మృతదేహం ఆదివారం లభ్యమైంది. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు కోడూరు ఎస్ఐ పి.శిరీష తెలిపారు.

### మహిళపై బాత్‌రూం యాసిడ్‌తో దాడి

- నిందితుడు విశ్రాంత ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి

**విజయవాడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):** ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం తాగడం, ఎదురుగా ఉన్న వాళ్లతో జగడాలకు కాలు దువ్వడం, ఓ విశ్రాంత ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి జగడాల బాగోతం ఇది. మద్యం మత్తులో ఓ మహిళను దూషించి ఆమెపై బాత్‌రూం యాసిడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటన గురునానక్ కాలనీలోని నాక్ కల్యాణ మండపం వద్ద జరిగింది. సీహెచ్ ఆంజనేయప్రసాద్ ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసి ఉద్యోగ విరమణ చేశాడు. ఆయన ఇంటికి ఎదురుగా ఆటోనగర్‌కు చెందిన జొన్నలగడ్డ వెంకట రాజేశ్వరమ్మ బడ్డీ కొట్టు నిర్వహిస్తోంది. ఆంజనేయప్రసాద్ రోజూ మద్యం తాగి ఆమె కొట్టు వద్దకు వెళ్తాడు. గుట్కాలు, ఖైనీలు విక్రయిస్తున్నావని ఆమెతో గొడవ పడతాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో రాజేశ్వరమ్మ కొట్టు వద్దకు వెళ్లాడు. ఆమెను అసభ్యకరంగా దూషించి ఇంటికి వెళ్లిపోయాడు. ఆమె తనను ఎందుకు దూషిస్తున్నావని ఇంటికి వెళ్లి ప్రశ్నించింది. ఇద్దరి మధ్య కొద్దిసేపు వివాదం జరిగింది. ఆంజనేయప్రసాద్ ఇంట్లోకి వెళ్లి బాత్‌రూంను శుభ్రం చేసే యాసిడ్ తీసుకొచ్చి ఆమెపై పోశాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. వెంటనే పటమట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆంజనేయప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసును పటమట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బతుకు చిత్రాలు

### నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



పారిశుధ్య కార్మికుడి కష్టానికి, శ్రమకు గుర్తుగా..

కార్మికుడి కష్టాన్ని బంధించిందా కన్ను.. చిరువ్యాపారి కావడి కష్టాన్ని కళ్లకు కట్టినట్టు చూపిందా చిత్రం.. కళాకారుడి కళా విశ్వరూపాన్ని విశ్వానికి విజువలైజ్ చేసింది ఆ దృశ్యం..వలస పక్షుల విహారాన్ని వీక్షకులకు విశదీకరించింది ఆ ఫొటో.. పక్క ఫొటోలన్నీ సమాజంలో వ్యక్తులు, పక్షుల బతుకు చిత్రాలు..ప్రపంచానికి చూపిన కెమెరామెన్ల కష్టానికి చిహ్నాలు..సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రాఫర్లందరికీ శుభాకాంక్షలు.. - విజయవాడ



చిరువ్యాపారి కావడి కష్టానికి చిహ్నాంగా..





కళాకారుడి ప్రతిభకు గుర్తుగా..

## నేటి నుంచి జై సంతోషిమాత జయంతి

**పాయకాపురం, ఆగస్టు 18 :** పాయకాపురంలోని జై సంతోషిమాత జయంతి ఉత్సవాలు ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, సోమవారం ఉదయం 5 గంటలకు అమ్మ వారికి పంచామృతాలతో జరగనున్న అభిషేక పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, తొలి రోజు అమ్మవారికి విశేషాలంకరణ, లక్ష్మీ గణపతి హోమం, కుంకుమ పూజ, మహా నైవేద్యం, పూజ్య స్వామీజీలకు సత్కార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## నగర అభివృద్ధికి నిపుణుల సహకారం తీసుకుంటాం

**ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్**



పాలిటెక్నిక్ కళాశాల వాకర్స్‌తో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

**మొగల్రాజపురం, ఆగస్టు 18 :** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు నగరంలో సమస్యలు పరిష్కరించడానికి ఐటీ నిపుణుల సహకారం తీసుకుంటామని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. ఆదివారం ఉదయం వారు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వాకర్స్‌తో, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో నగర అభివృద్ధి నగరంలో సమస్యల గురించి పాలిటెక్నిక్ కళాశాల సిబ్బందితో మాట్లాడి సలహాలు, సూచనలు తీసుకోవడం జరిగిందన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సకాలంలో తీసుకొచ్చి రాష్ట్రాన్ని, నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఉంది కాబట్టి కేంద్రం కూడా రాష్ట్రం పట్ల తమ వంతు సహకారాన్ని అందిస్తుం దన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, అమరావతి పరిధిలో క్రీడలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని చెప్పారు. వాకర్స్ సంఘాలకు కూడా అవకాశాలు కల్పించాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపీ కేశినేని శివనాథ్ ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ క్రీడల అభివృద్ధికి ఆయన తనవంతు సాయం చేస్తారని చెప్పారు. రామవరప్పాడు నుంచి నిడమానురు వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేస్తున్నామని, కొండప్రాంతాలలో వర్షం నీరు రోడ్లమీదకు వచ్చి నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చే నిధులు వినియోగించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా చేబుతోందని దానిని అచరించి చూపి స్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు చెన్నుపాటి ఉషారాణి, జాస్తి సాంబశివరావు, సూరపనేని శివనాగేశ్వరరావు, గుత్తికొండ సతీష్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, విష్ణు, రాజా, ధూళిపాళ్ల రమేష్, మల్లెల రామకృష్ణ, ఎర్నేని వేదవ్యాస్, వాసిరెడ్డి లక్ష్మణరావు, కాటంరాజు, పడాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గగుడిలో అరుణ పారాయణ



**వన్‌టౌన్, ఆగస్టు 18 :** దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఆదివారం సందర్భంగా దేవస్థానం అర్చకులు, వేద పండితులు సకలజనులకు ఆయురారోగ్య వృద్ధి, యోగక్షేమాలను కోరుతూ అరుణ పారాయణ నిర్వహించారు. సూర్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక జప, తర్పణ చేశారు.

**అన్న వితరణకు విరాళం..**

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అన్నవితరణకు ఆదివారం కృష్ణాజిల్లా, కంకిపాడుకు చెందిన వణుకూరు వెంకట రమణ తరుపున ఎల్ఎల్ అన్నపూర్ణ రూ.1,00,116లు విరాళాన్ని అధికా రులను కలిసి అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం దాతకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందచేశారు.

**అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన..**



ఆదివారం ధర్మపదం వేదికపై నరసాపూర్‌కు చెందిన వి. అనంతలక్ష్మి ఆధ్వర్యంలోని ఆదిపరాశక్తి నృత్య నికేతన బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించింది. పలు కీర్తనలకు హృద్యంగా నర్తించి ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం కళాకారులకు అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.

## ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**వన్‌టౌన్, ఆగస్టు 18 :** వన్‌టౌన్‌లోని గాంధీజీ మహిళా కళాశాలలో ఆదివారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూరపాటి స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య, ఆర్.హెచ్.వీ పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల శర్మలు పాల్గొని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. లక్ష్యంతోనే విజయాలు సాధించవచ్చని చెప్పారు. విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని సూచించారు. విద్యార్థినులు ఈ సందర్భంగా ఆట, పాట నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్ కె. పిచ్చియ్య, ప్రిన్సిపాల్ ఎన్.రమణశ్రీ, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మకు బోనాలు

**గుణదల :** గ్రామ దేవలను నమ్ముకున్న వారి ఇంట కష్టాలు ఉండవని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకి అన్నారు. చుట్టుగుంట వద్ద ముత్యాలమ్మ తల్లి 36వ బోనాల వేడుకలో ఆమె పాల్గొని ముత్యాలమ్మకి సారె, బోనాలు సమర్పించారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా సతీమణి బొండా సుజాత ముత్యాలమ్మకు పసుపు, కుం కుమ, చీర, గాజులు, పూలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.



మాట్లాడుతున్న ఎస్టీవీఎస్ జాతీయ కన్వీనర్ దేవరకొండ

## ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ చేపట్టాలి

**ధర్నాచౌక్ :** సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ చేయాలని ఎస్టీ వర్గీకరణ సాధన సమితి (ఎస్టీవీఎస్) జాతీయ కన్వీనర్ డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశ ప్రధానీ మోదీ, అన్ని రాష్ట్రా ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ ఆల్ ఇండియా సారధ్యంలో ఎస్టీ వర్గీకరణ, క్రిమీలేయర్ అంశాలపై ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎస్టీల్లోని 35 తెగల్లో అంతర్గత సామాజిక న్యాయం కొరవడిందన్నారు. సుప్రీం తీర్పును అమలు చేయడం ద్వారా సామాజిక న్యాయం జరు గుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. సమితి కో-కన్వీనర్లుగా రాచగిరి మధుసూధనరావు, చేవూరి పద్మజ, పాలపర్తి బాలాజీ, ఏపీ కన్వీనర్, కో.కన్వీనర్లుగా కొమరగిరి శ్రీనివాసరావు, గంటిమళ్ళ సత్తిబాబు, దేవరకొండ సాంబశివరావు, బొడ్డు రమేష్, తెలంగాణ కన్వీనర్, కో-కన్వీనర్లుగా మరకల ప్రసన్నకుమారి, ఎరుకలి బాలకృష్ణ, కందుల ఝాన్సీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## అలరించిన వాయులీన సంగీత కచేరి

**విజయవాడ కల్చరల్, ఆగస్టు 18 :** సత్యనారాయణపురం శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం సాయంత్రం స్వరఝరి సంస్థ ఆధ్వర్యంలో ఎస్.సుబ్బులక్ష్మి, ఎస్.స్వర్ణలత వాయులీన సంగీత కచేరీ నిర్వహించారు. తొలుత అక్కరాయ సుబ్బలక్ష్మి రచించిన కనకాంగి వరం రాగంలో కచేరి జరిగింది. అన్నమాచార్య కీర్తన నమో నమో రఘుకుల నాయక మధురంగా సాగింది. పరమపురుష కీర్తనను షణ్ముఖప్రియ రాగంలో బంటు రీతి కొలువు కృతిని హంసనాదం రాగంలో మధురంగా వినిపించారు. మృదంగం సాయి గిరిధర్, ఘటంపై హరిబాబు సహకారం అందించారు. మోదుమూడి సుధాకర్ నిర్వహించారు.

## ఆకట్టుకున్న సంగీత విభావరి

**విజయవాడ కల్చరల్, ఆగస్టు 18 :** తెలుగు కళావాహిని, పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి, సుశీల్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తకౌతా పూర్ణానంద కళావేదికపై ఆదివారం సంగీత విభావరి జరిగింది. గాయనీ గాయకులు డేవిడ్‌రాజు, ప్రిన్స్ కుమార్ గుప్తా, మోహన్‌కృష్ణ, అయ్యప్పన్, భారతి, మల్లాది స్వాతి, రజిని, దుర్గా నాగమణి, సూర్యకామేశ్వరి, సుశీల్ కుమార్ మధురంగా గానం చేశారు. చింతకాయల చిట్టిబాబు, కోటా వెంకటేశ్వరరెడ్డి, బీవీ వీరభద్రరావు, జ్ఞాన కిషోర్, ప్రసూనా రామన్, భుజంగరావు, సింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారులను సత్కరించారు.

## హత్యాచారాన్ని నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి

**మొగల్రాజపురం :** మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ అన్నారు. కోల్‌కతాలో డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా సమితి మహిళా విభాగం అధ్వర్యంలో ఆదివారం మదర్ థెరెసా జంక్షన్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ షబానా మాట్లాడుతూ మానవ మృగాలు రెచ్చిపోతుంటే లోపం ఎక్కడుందో తెలియని పరిస్థితులు ఉండటం బాధాకరంగా ఉందన్నారు. ప్రధాన కార్యదర్శి మెహ్రూర, ఉపాధ్యక్షురాలు ఫాతిమా మాట్లాడుతూ మహిళల రక్షణకు కఠినమైన చట్టాలు రూపొందించి త్వరితగతిన అమలు చేయాలన్నారు. ఏపీసీసీ నాయకురాలు కుర్షీద్ అపా, ఆయేషా, దీపిక, రివ, తస్నీ, నిధి, బబితా జైన్, జ్యోతి, ఫాతి మా, నాజియా, రాఫీ సుల్తానా,నౌషీన్, అఫ్రోజ్, రజియా, రాదిక విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**పాయకాపురం, ఆగస్టు 18 :** ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అనంత్ శ్రావణకుమారి(37) వాంబేకాలనీలో నివాసం ఉంటుంది. భర్త నాని లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. గత కొంత కాలంగా మహిళ అనారోగ్యంతో బాధపడుతుంది. ఈనెల 16న మహిళ ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు నగరంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. అయితే మహిళ బ్రైన్‌లో రక్తం గడ్డకట్టడం కారణంగా మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. శ్రావణకుమారి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు ధర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడు ఆత్మహత్య

**పాయకాపురం, ఆగస్టు 18 :** ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఓ యువకుడు మృతి చెందిన ఘటన వాంబేకాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం వాంబేకాలనీ బీబ్లాక్‌కు చెందిన షేక్ కేశవ(17) నగరంలోని కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం ఉదయం ఎవరు లేని సమయంలో ఇంట్లోని ఫ్యానుకు చీరతో ఉరివేసుకున్నాడు. సాయంత్రం కుటుంబ సభ్యులు వచ్చి చూసిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే కేశవ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైద్యశిబిరానికి అనూహ్య స్పందన



చికిత్స అందిస్తున్న డాక్టర్ అక్కినేని మణి

**విద్యాధరపురం, ఆగస్టు 18 :** భవానీపురంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. భవానీపురం ఎన్డీయే కార్యాలయంలో ఈనెల 16వ తేదీన పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రారంభించిన ఉచిత వైద్య శిబిరంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన వైద్య సదుపాయాలను అందిస్తున్నట్లు ఎన్ఆర్ఐ వైద్య కళాశాల వ్యవస్థాపక డైరెక్టర్ అక్కినేని మణి అన్నారు. ఆదివారం వైద్య శిబిరంలో ఆమె స్త్రీలకు సంబంధించిన గర్భాశయ ముఖద్వార కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హెల్త్‌క్యాంప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బొమ్మకంటి వెంకట రమణ మాట్లాడుతూ, ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు ప్రతి కుటుంబానికి వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 24 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు చిట్టినగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో రెండవ విడత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ వైద్య శిబిరాన్ని సుజనా ఫౌండేషన్, షేర్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

## రాష్ట్రానికి ప్రత్యేకహోదా కోరుతూ ధర్నా



ధర్నాలో పాల్గొన్న పలువురు నేతలు

**ధర్నాచౌక్ :** రాష్ట్రానికి ప్రత్యేకహోదా కల్పించాలని కోరుతూ ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపకుడు దశరథ రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడలో ధర్నా నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ గతంలో ప్రధానీ మోదీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. ప్రత్యేకహోదా వల్ల రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్రం మరో ఢాకా కాక ముందే ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. ప్రత్యేక హోదా కోసం రాష్ట్రంలోని అన్ని పార్టీలు, ప్రజలు, అన్ని సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపినిచ్చారు. అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ రాష్ట్ర నేత గొల్లపల్లి ఫణిరాజ్, ప్రత్యేక హోదా జేఏసీ స్టేట్ కన్వీనర్ మర్ని రాజా శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ సిటీ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల పరమేష్, ఐక్య కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతు రామ్మోహన్‌రావు, సీపీఐ జిల్లా నేత లంక గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

## విజేత చైత్రదీపికకు ఎంపీ చిన్ని ప్రశంస



**వన్‌టౌన్, ఆగస్టు 18 :** రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆర్టిస్టిక్ పోటీల్లో పతకాలు సాధించిన ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన చైత్రదీపికను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించి ప్రశంసించారు. ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో ఆమె ఎంపీ శివనాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె సాధించిన పతకాలను, సర్టిఫికెట్లను ఎంపీకి చూపించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధించి క్రీడాఖ్యాతిని ప్రపంచానికి చాటాలని ఆమెకు సూచించారు. చైత్రను ప్రోత్సహించినందుకు తల్లిదండ్రులు పి. సతీష్, లలితాదేవి, శిక్షణ ఇచ్చిన కోచ్ పి. సత్యనారాయణను అభినందించారు. విజయవాడ ఎస్ఎస్ఎం స్కూల్లో 9వ తరగతి చదువుతున్న చైత్ర దీపిక అన్నిస్థాయిల్లో జరిగిన పోటీల్లో పాల్గొని 42 పతకాలను కైవసం చేసుకుంది.

## వృద్ధులకు సేవ అభినందనీయం

**సత్యనారాయణపురం :** వయో వృద్ధులకు నిత్యావసర వస్తువులు, మందులు అందజేయడం అభినందనీయమని గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రత్నఈశ్వర్ అన్నారు. అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని విజయ్ నర్సింగ్‌స్కూల్‌లో ఆదివారం సాయంత్రం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవాధ్య లేడీస్ గ్రూప్ సహకారంతో వృద్ధులకు నిత్యావసర వస్తువులు, మందుల పంపిణీ చేశారు. రత్న ఈశ్వర్ మాట్లాడుతూ, వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లాహరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ మాట్లాడుతూ తాము చేస్తున్న సేవలకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేని వన్నారు. సెప్టెంబరు 29న శతాధిక వృద్ధులకు సత్కారం చేస్తున్నామని చెప్పారు.

## భార్యపై కోపంతో ఆత్మహత్య

**విద్యాధరపురం, ఆగస్టు 18 :** భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఓ వివాహితుడు తాను నివాసం ఉంటున్న అద్దె ఇంటిలో బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, రామచంద్రపురానికి చెందిన లక్ష్మీనారాయణ వ్యవసాయం చేసుకుని జీవనం చేస్తుంటాడు. ఆయనకు ముగ్గురు సంతానం. మూడవ కుమారుడు శ్రీకాంత్ (30) పటమటలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మత్తుమందు డాక్టర్ వద్ద సహాయకుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఎవరో అమ్మాయితో మాట్లాడుతున్నాడని అతని భార్య త్రివేణి గమనించి ఎవరితో మాట్లాడుతున్నావని అడిగింది. దీనిపై కోపగించిన అతను త్రివేణిపై చేయి చేసుకున్నాడు. ఈ విషయాన్ని అత్తమామలకు తెలిపింది. మీరు గొడవ పడవద్దు నేను, నాభార్య కలిసి వస్తున్నామని చెప్పాడు. ఈ క్రమంలో శ్రీకాంత్ పని చేస్తున్న ఆసుపత్రిలో అమ్మాయితో మాట్లాడడని తెలుసుకుని ఆమెను ఇంటికి పిలిపించింది. ఆమె ఇంటికి వచ్చి నీ భర్తకు నాకు ఎటువంటి సంబంధం లేదని చెప్పింది. మరలా శ్రీకాంత్ కలుగజేసుకుని మమ్మల్ని ఎందుకు అనుమానిస్తున్నావ్ అంటూ భార్య త్రివేణిని మరలా కొట్టి ఇంటిలోకి వెళ్లి బెడ్‌రూమ్ తలుపులు వేసుకున్నాడు. కొంత సేపటికి భార్య వెళ్లి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని శ్రీకాంత్ కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గొట్టుముక్కలకు ఎమ్మెల్యే బొండా పరామర్శ



**అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 18 :** తెలుగుదేశం పార్టీ నేత, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజును సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న రఘురామరాజు నివాసానికి వెళ్లిన బొండా ఉమా ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని బొండా ఉమా హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో దాసరి కనకారావు, ఆకుల సూర్యప్రకాష్, ఘంటా కృష్ణమోహన్, శేషంరాజు, వెలపూడి శ్రీను, తదితరులు ఉన్నారు.

## చిత్రలేఖనంలో చిన్నారులకు శిక్షణ

**గవర్నర్‌పేట, ఆగస్టు 18 :** ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాల యంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనంలో ఉచిత శిక్షణా కార్యక్రమం జరిగింది. గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి శిక్షణను ప్రారంభించారు. బొమ్మలు ఎలా వేయాలి, కలర్స్ ఎలా ఎంపిక చేయాలి, కలర్స్‌ను ఏ విధంగా వాడాలి అనే అంశాలపై డ్రాయింగ్ టీచర్ ఎం. దుర్గాభవానీ విద్యార్థులకు వివరించారు. బొమ్మలు వేయడంలో మెళకువలను నేర్పించారు.

## తుంగభద్ర డ్యామ్‌లో స్టాప్‌లాగ్ ఏర్పాటు అద్భుతం

**వన్‌టౌన్, ఆగస్టు 18 :** తుంగభద్ర డ్యామ్‌లో క్రస్ట్ గేట్ స్థానంలో స్టాప్‌లాగ్ ఏర్పాటు చేయటం అద్భుతమని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దశ దిశా నిర్దేశంతో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సూచనలతో హైడ్రో మెకానికల్ ఇంజనీర్ క్రస్ట్ గేట్ నిపుణులు ఎన్.కన్నయ్యనాయుడు ఆధ్వర్యంలో నిపుణుల బృందం యుద్ధప్రాతిపదికన మొత్తం ఐదు స్టాప్‌లాగ్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో కారు డ్రైవర్ మృతి

**వన్‌టౌన్, ఆగస్టు 18 :** అనుమానాస్పద స్థితిలో తిరుపతికి చెందిన కారు డ్రైవర్ ఉప్పలపాటి గిరిధర్ (55) మృతి చెందినట్టు ఆదివారం కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన కంచి గోపికృష్ణ వ్యాపార పనుల నిమిత్తం ఆది వారం ఉదయం విజయవాడ వచ్చాడు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకున్నాడు. అదే హోటల్‌లో గోపికృష్ణ స్నేహితుడు, స్నేహితుని తల్లిదండ్రులు కూడా ఉన్నారు. వారి డ్రైవర్ తిరుపతిలోని సప్తగిరినగర్‌కు చెందిన ఉప్పలపాటి గిరిధర్ హోటల్ వద్ద ఉన్నాడు. డ్రైవర్ గిరిధర్‌కు గోపికృష్ణ ఫోన్ చేయగా స్పందించకపోవటంతో వేరొక డ్రైవర్‌ను గిరిధర్ కారువద్దకు పంపారు. అయితే కారు డోర్ ఓపెన్ చేసి చూడగా డ్రైవర్ సీట్‌లో నుంచి గిరిధర్ ముందుకు పడిపోయి ఉన్నాడు. వెంటనే స్థానికుల సహాయంతో అతనిని సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు.

## ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

### రీజనింగ్

## టైమ్ సీక్వెన్స్ టెస్ట్

1. తేజకు అతని సోదరి నందిత పుట్టినరోజు జూలై 21 నుంచి జూలై 26 మధ్య అని గుర్తు. మరో సోదరుడు భవేష్‌కు వారి సోదరి పుట్టినరోజు జూలై 24 నుంచి 29 మధ్య అని గుర్తు. అయితే నందిత పుట్టినరోజు ఏ రోజు అవుతుంది?

ఎ) జూలై 26 బి) జూలై 25
సి) జూలై 24 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: తేజకు అతని సోదరి పుట్టినరోజు జూలై 21 నుంచి 26 మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్యలోని తేదీలు తీసుకోవాలి. 22, 23, 24, 25 భవేష్‌కు, సోదరి నందిత పుట్టినరోజు జూలై 24 నుంచి 29 మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్యలోని తేదీలు 25, 26, 27, 28.

గమనించండి: రెండింటిలో కామన్‌గా ఉండే తేదీ '25' అనగా జూలై 25 సమాధానం అవుతుంది.

2. సాత్విక్‌కు అతని తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 12 మధ్య అని గుర్తు. అతని సోదరి సౌమికకు వారి తల్లితండ్రుల పెళ్లిరోజు అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 4 మధ్య అని గుర్తు. అతని సాత్విక్, సౌమికల తల్లిదండ్రుల పెళ్లిరోజు అవుతుంది?

ఎ) అక్టోబర్ 10 బి) అక్టోబర్ 11
సి) అక్టోబర్ 10 లేదా 11 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: సాత్విక్‌కు అతని తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 7 నుంచి 12కు మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్య తేదీలు 8, 9, 10, 11. అతను సోదరి సౌమికకు వారి తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 14కు మధ్య అని గుర్తు, ఇచ్చిన తేదీలకు మధ్య తేదీలు 10, 11, 12, 13.

గమనించండి: రెండింటిలో కామన్‌గా ఉన్న తేదీలు 10, 11. ఈ విధంగా రెండు తేదీలు వచ్చినప్పుడు అక్టోబర్ 10 లేదా అక్టోబర్ 11 (అనగా either, or)) సమాధానంగా గుర్తించాలి.

3. పవిత్రకు ఆమె సోదరి మేఘన పుట్టినరోజు జనవరి 20 నుంచి జనవరి 24 మధ్య అని గుర్తు. వారి మరో సోదరి మౌనికకు, మేఘన పుట్టినరోజు ఫిబ్రవరి 22, ఫిబ్రవరి 26ల మధ్య అని గుర్తు. అయిన పవిత్ర మౌనికల ప్రకారం వారి సోదరి మేఘన పుట్టినరోజు ఏ రోజు అవుతుంది?

ఎ) జనవరి 23 బి) ఫిబ్రవరి 23
సి) చెప్పలేం డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: పవిత్రకు ఆమె సోదరి మేఘన పుట్టినరోజు జనవరి 20 నుండి జనవరి 24 మధ్య అని గుర్తు. వారి మరోసోదరి మౌనికకు, మేఘన పుట్టినరోజు ఫిబ్రవరి 22, ఫిబ్రవరి 24ల మధ్య అని గుర్తు.

గమనించండి: ఇద్దరి సమాచారం ప్రకారం నెలలు వేర్వేరుగా ఉన్నాయి. దాదాపు 30 రోజుల తేడా ఉన్నది. కావున సమాధానం చెప్పలేం అవుతుంది.

4. ఒక బస్సు వరంగల్‌కు ప్రతి 45 ని.లకు ఉంది. విచారణాధికారి తనను కలిసిన ప్రయాణికునితో బస్సు వెళ్ళిపోయి 15 ని. అయింది. తరవాత బస్సు 11.30 ఎ.ఎం. అని చెప్పారు. అయిన ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికునితో ఏ సమయంలో చెప్పారు?


ఎ) 10.50 ఎ.ఎం. బి) 11.00 ఎ.ఎం.
సి) 11.10 ఎ.ఎం. డి) 11.15 ఎ.ఎం.

సమాధానం: (బి)

వివరణ: బస్సు వరంగల్‌కు ప్రతి 45 ని. ఉంది. తదుపరి బస్సు వచ్చే సమయం గం. 11.30 ని. అనగా ముందు బస్సు వచ్చిన సమయం 11.30-45 ని. = గం. 10.45 ని. విచారణాధికారి ప్రయాణికునితో బస్సు వెళ్ళిపోయి 15 ని. అయింది అని చెప్పారు. దాని అర్థం ప్రయాణికుడు 15 ని. ఆలస్యంగా వచ్చాడు. (ఆలస్యంగా వస్తేనే కదా బస్సు వెళ్ళి పోయింది) కాబట్టి విచారణాధికారికి, ప్రయాణికునికి మధ్య సంభాషణ జరిగిన సమయం 10.45+15 ని.= 11.00 ఎ.ఎం. అవుతుంది.

5. ఒక కార్యాలయంలో 30 మంది ఉద్యోగులు ఉన్నారు. 10 మంది ఉద్యోగులు మొదటి గ్రూపుగా ఉదయం 7 గం.ల నుంచి మధ్యాహ్నం 1.00 గం. వరకు పని చేస్తారు. 12 మంది వ్యక్తులు రెండో గ్రూపుగా ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గం. వరకు పనిచేస్తారు. 8 మంది వ్యక్తులు మూడో గ్రూపుగా ఉదయం 11.00 గం.ల నుంచి సాయంత్రం 5 గం. పనిచేస్తారు. అయితే కార్యాలయంలోని ఉద్యోగులందరూ ఏ సమయం నుంచి ఏ సమయం వరకు కలుసుకుంటారు?

ఎ) 11.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం.



బి) 10 ఎ.ఎం. నుంచి 12 మధ్యాహ్నం
సి) 1 పి.ఎం. నుంచి 3 పి.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: కార్యాలయంలో ఉద్యోగులందరు కలుసుకునే సమయం అనగా మూడు గ్రూపుల వారికి కామన్ టైమ్ తీసుకోవాలి. మొదటి గ్రూపు పని చేసే వేళలు 7.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం.వరకు అనగా 7-8, 8-9, 9-10, 10-11, 11-12, 12-11

రెండో గ్రూపువారు పనిచేసే వేళలు 9.00 ఎ.ఎం. నుంచి 3.00 పి.ఎం. వరకు అనగా 9-10, 10-11, 11-12, 12-1, 1-2, 2-3. మూడో గ్రూపువారు పనిచేసే వేళలు 11.00 ఎ.ఎం. నుంచి 5.00 పి.ఎం. వరకు అనగా 11-12, 12-1, 1-2, 2-3, 3-4, 4-5. గమనించండి: మూడు గ్రూపులలో కామన్ టైమ్ 11 నుంచి 1 వరకు అని తెలుస్తున్నది. కాబట్టి మూడు గ్రూపులు కార్యాలయంలో కలిసి పనిచేసే వేళలు 11.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం. సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ



కరెంట్ అఫైర్స్/ జనరల్ ఎస్సే

# ఎస్సీ ఉప వర్గీకరణ
# సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

భారతీయ సమాజంలో అసమానతలకు బీజం వేసింది నాలుగంచెల చాతుర్వర్ణ వ్యవస్థ. ఎగువ అంచెల వారి కి పాలనాధికారాన్ని, ప్రతిష్ఠను కట్టబెట్టి దిగువ అంచెల వారిని వారికి సేవకులను చేసింది. అన్నింటికన్నా దిగువ అంచె అయిన శూద్రుల్లో సేవక కులాలనన్నింటినీ జమచేయడం జరిగింది. వారి వృత్తులను బట్టి కాలక్రమంలో శూద్రుల్లో కూడా స్థాయీ భేదాలు వచ్చాయి. కొన్ని పనులు చేసేవారు అంటరాని వారయ్యారు. ఊరిలోని మాలిన్యాన్ని తొలగిస్తూ, అందరి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ తాము మాత్రం ఊరవతలకే పరిమితమయ్యారు. కనీస అవసరాలకు నోచుకోలేదు. కాలక్రమంలో వీరే దళితులుగా పిలువబడ్డారు.

స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన శూద్ర కులాల వారి అభ్యున్నతికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి పురోభివృద్ధికి బాటలు వేసింది. అయితే దళితులను(మాల, మాదిక, వారి ఆశ్రిత కులాలను) షెడ్యూల్డ్ క్యాస్ట్, వివిధ ఆదివాసీ జాతులను షెడ్యూల్డ్ ట్రైబ్స్‌గా పేర్కొంటూ మూకుమ్మడి రిజర్వేషన్లను రెండు వర్గాల్లో అమలు చేశారు. అయితే తదనంతర కాలంలో అనగా 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేశారు. ఈ వర్గీకరణ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో అనుసరించలేదు. దీని కారణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని కొన్ని ఆధిపత్య కులాలు, జనాభాపరంగా తక్కువ సంఖ్య ఉన్న కులాలు రిజర్వేషన్ ఫలాలను ఎక్కువగా పొందాయి. క్రమంగా వారి తరవాతి తరాలూ ఈ లబ్ధిని కొల్లగొట్టాయి. ఏబీసీల మాదిరి క్రిమిలేయర్ విధానం కూడా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో లేకపోవడంతో అభివృద్ధి చెందిన ఉప కులాలే మరింత రిజర్వేషన్లు ఉపయోగించుకుని అభివృద్ధి చెందారు. ఇతర ఉపకులాలు అణగారిపోయారు. ఎస్సీ, ఎస్టీల్లోని అనేక కులాలు, ఆశ్రిత కులాల్లో దీనిపై అసంతృప్తి ఉన్నప్పటికీ తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీల్లోని మాదిగ కులం వారిలో చైతన్యం వచ్చింది.

> 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను( ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేశారు.

### ఎస్సీ ఉపవర్గీకరణ పోరాట పుట్టినిల్లు తెలుగుగడ్డ

అనాదిగా చర్మకారులుగా అట్టడుగు స్థాయిలో ఉన్న మదిగవారు, తమ తోటి ఉపవర్గం వారితో కూడా అంటరానివారిగా చూడబడ్డారు. తమకన్నా సామాజికంగా ముందున్న మాల వారితో కలిసి ఉమ్మడిగా అవకాశాలు పంచుకోవాల్సి రావడం అన్యాయంగా గుర్తెరిగారు.

జనాభాపరంగా తమకంటే తక్కువ సంఖ్యలో ఉన్న మాల వారు ఉమ్మడి రిజర్వేషన్లు కారణంగా ఎక్కువ లబ్ధి పొందుతున్నారని గ్రహించారు. తమకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు అమలుచేయాలని ఏడో దశకం నుంచి ప్రభుత్వాలకు వినతులు సమర్పిస్తున్నారు. అయితే 1994లో 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఈదుమూడిలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పాటైన నాటినుంచి ఎస్సీ ఉపవర్గీకరణ పోరాటం ఉద్యమ స్థాయిని అందుకుంది. తమ పోరాటానికి 'మాదిగ దండోరా' ఉద్యమంగా నామకరణం చేశారు. వరుసగా భారీఎత్తున దండోరా సభలు, ర్యాలీలు నిర్వహించారు. ఎస్సీల్లో ఉపకులాలను వారి సామాజిక స్థాయి, జనాభా ఆధారంగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డి అనే కేటగిరీలుగా అమలు చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు, సమాజం నుంచి మద్దతు కూడగట్టారు.

ఈ ఉద్యమఫలంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను ఏర్పాటుచేసి సమస్య పరిష్కారానికి సూచనలు కోరింది. 1997లో ఈ కమిషన్ ఎస్సీలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరేవిధంగా చర్యలు తీసుకోమని సూచించింది. తత్ఫలితంగా 1997 జూన్ 6న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీలకు ఉన్న 15% కోటాను ఏ, బీ, సీ, డీ వర్గాలుగా విభజిస్తూ ఒక జీవోను విడుదల చేసింది. ఏ గ్రూపులో రెల్లి, దాని అనుబంధ కులాలను చేర్చి 1 శాతం కోటాను, బీ గ్రూపులో మాదిగ, దాని ఉప కులాలను చేర్చి 7శాతం కోటా, సీ గ్రూపులో మాల, దాని ఉపకులాలను చేర్చి 6శాతం కోటా, డీ గ్రూపులో ఆది ఆంధ్రులతో పాటు ఇతర కులాలను చేర్చి 1 శాతం కోటాను ఇచ్చారు. ఈవిధంగా ఏ గ్రూపును ఎస్సీల్లో అట్టడుగు కులాల గ్రూపుగా తదుపరి బీ, సీ, డీలను క్రమానుగతంగా దాని పైస్థాయి గ్రూపులుగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లలో కోటాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే మాలలు ఈ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. మాల మహానాడు సంఘం ఈ రిజర్వేషన్ వర్గీకరణను న్యాయస్థానంలో సవాలు చేసింది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జీవో రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రప్రభుత్వ అధికార పరిధిలో లేని విషయమని తీర్పు ఇవ్వడంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. తదుపరి మరలా ఎంఆర్‌పీఎస్ పోరుబాట పట్టింది. దీంతో 2000 సంవత్సరంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం' ద్వారా తిరిగి ఎస్సీ ఉప వర్గీకరణను ప్రవేశపెట్టింది. 2004 నవంబరు వరకూ ఈవిధంగా ఎస్సీ ఉప వర్గీకరణ చట్టం అమలులో ఉంది. 2004లో ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో 5గురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ ఉప వర్గీకరణ చెల్లదని, ప్రకరణ 341(1) ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు సజాతీయ కులాలను ఎస్సీలుగా వర్గీకరించారని, దానిని తిరిగి ఉప వర్గీకరించే అధికారం రాష్ట్రప్రభుత్వాలకు లేదని తీర్పునిచ్చింది. దీంతో మరలా కథ మొదటికి వచ్చింది. తిరిగి ఎంఆర్‌పీఎస్ ఉద్యమించడంతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ ఉప వర్గీకరణకు పార్లమెంటు రాజ్యాంగ సవరణ చట్టం తీసుకురావాల్సిందిగా కోరుతూ అసెంబ్లీలో ఒక తీర్మానం చేసింది. దీంతో కేంద్రం 2007లో ఉషామెహ్రా కమిషన్‌ను ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఉపవర్గీకరణ అంశానికి సంబంధించి ఎదురయ్యే రాజ్యాంగ, చట్టపరమైన అవరోధాలను పరిశీలించి తగిన సూచనలు చేయాల్సిందిగా కోరింది. 2008లో నివేదిక సమర్పించిన ఈ కమిషన్ రాజ్యాంగ ప్రకరణ 341కి క్లాజ్ 3ని చేర్చి, రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా రాష్ట్ర అసెంబ్లీలు ఏకగ్రీవ తీర్మానం చేసినప్పుడు పార్లమెంటు ఆమోదించే అవకాశాన్ని ఏర్పాటు చేయవచ్చని సూచించింది. ఈ సూచనలు అమలుకు నోచుకోలేదు.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

రాజకీయాల్లో..

## క్షత్రియులకు అవకాశం కల్పిస్తాం

- క్షత్రియభవన్‌కు భూమిని కేటాయిస్తాం
- క్షత్రియ సేవా సమితి.. అభినందన సభలో తెలంగాణ సీఎం రేవంత్
- ప్రభాస్ సినిమాపై పొగడ్తల వర్షం
- తెలుగు సినిమాను విశ్వవ్యాప్తం చేశారని వ్యాఖ్య



క్షత్రియ సేవాసమితి అభినందన సభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో క్షత్రియ సామాజికవర్గానికి తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని, నగరంలో క్షత్రియ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో పాల్గొని, ప్రసంగించారు. 1960లలోనే క్షత్రియులు ఆంధ్రప్రాంతం నుంచి హైదరాబాద్‌కు వచ్చి.. ద్రాక్ష తోటలు, పౌల్ట్రీ వంటి వ్యాపారాలు నిర్వహించారని.. శ్రమ, అకుంఠిత దీక్షతో ఉన్నతస్థాయికి ఎదిగారని రేవంత్‌రెడ్డి వివరించారు. కష్టపడే గుణం వల్ల క్షత్రియులు ఎక్కడైనా విజయవంతమవుతారన్నారు. "క్షత్రియులకు రాజకీయాల్లో తగిన ప్రోత్సాహం అందిస్తాం. మీరే తగిన పేర్లు ఇస్తే.. వారికి పార్టీ పదవులు ఇచ్చి.. కార్పొరేటర్, ఎమ్మెల్యే ఎన్నికల్లో అవకాశం కల్పిస్తాం" అని క్షత్రియ సేవాసమితిని కోరారు. ఆంధ్రాలో అల్లూరి సీతారామరాజు, తెలంగాణలో కొమరం భీం పోరాట యోధుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని.. ముందుకెళ్తున్నామన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లతోపాటు ఫ్యూచర్‌సిటీని అభివృద్ధి చేయబోతున్నామని, దానిలో కూడా రాజులు భాగస్వాములు కావాలన్నారు. పెట్టుబడులతో ముందుకొస్తే అన్నివిధాల ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో క్షత్రియ కమ్యూనిటీ భాగస్వామ్యం ఉందన్నారు. కర్ణాటకలో రాజకీయ సమీకరణలు, పరిస్థితుల ప్రభావం వల్ల బోసురాజుకు పోటీచేసే అవకాశం రాలేదన్నారు. మంత్రివర్గం ఏర్పాటు సమయంలో మంత్రి పదవి కేటాయించాలని స్వయంగా రాహుల్‌గాంధీ చెప్పారని గుర్తుచేశారు. దీన్ని బట్టి.. రాజులు క్రమశిక్షణతో పనిచేస్తారనే అభిప్రాయం అధిష్ఠానంలో ఉందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా శ్రీనివాస్‌రాజును నియమించడం రాజులపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి ప్రతీక అన్నారు. "క్షత్రియభవన్ స్థలాన్ని మేము అందిస్తాం, భవనాన్ని మీరు నిర్మించండి మళ్లీ జరిగే సమావేశం క్షత్రియ భవన్‌లో జరుపుకుందాం" అని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, తెలుగు రాష్ట్రాలకు చెందిన క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు నాగరాజు, నాని, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రభాస్ సినిమాపై..

విజయానికి, విశ్వాసానికి క్షత్రియులు మారుపేరని పేర్కొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇదే సామాజిక వర్గానికి చెందిన ప్రభాస్.. తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. ప్రభాస్ కాకుండా వేరే నటుడిని బాహుబలి స్థానంలో ఊహించుకోలేమన్నారు. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో బోసురాజు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా దివంగత సినీనటుడు కృష్ణంరాజుతో తనకు ఉన్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు.



'లేటరల్ ఎంట్రీ'తో

## యువతకు అన్యాయం

- ఆరెస్సెస్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల నియామకం
- ఐఏఎస్‌ల ప్రైవేటీకరణ... రిజర్వేషన్ల అంతానికి మోదీ హామీ: రాహుల్




న్యూఢిల్లీ, ఆగస్టు 18: వివిధ మంత్రిత్వ శాఖల్లో పోస్టులను లేటరల్ ఎంట్రీ విధానంలో భర్తీ చేయాలని కేంద్రం నిర్ణయించడంపై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. యూపీఎస్సీకి బదులు ఆరెస్సెస్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులను నియమిస్తూ రాజ్యాంగంపై ప్రధాని మోదీ దాడి చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను బహిరంగంగానే లాక్కుంటున్నారని ఆయన ఆదివారం 'ఎక్స్'లో ఆరోపించారు. లేటరల్ ఎంట్రీలో ప్రభుత్వ ఉద్యోగులను నియమించుకోవడం జాతి వ్యతిరేక చర్యని ధ్వజమెత్తారు. 'అణగారిన వర్గాలకు ఉన్నత స్థానాల్లో ప్రాధాన్యం దక్కడం లేదని ఎప్పటినుంచో చెబుతున్నాం. దాన్ని మెరుగుపరచడానికి బదులు లేటరల్ ఎంట్రీ పేరుతో వారిని ఉన్నత పదవులకు మరింత దూరం చేస్తున్నారు. ఇది యూపీఎస్సీకి సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన యువత హక్కులు కాలరాయడమే. అణగారిన వర్గాలకు రిజర్వేషన్లతో సహా సామాజిక న్యాయం అనే భావనపై దాడి చేస్తున్నారు. నిర్ణయాత్మక ప్రభుత్వ పదవుల్లో కూర్చోవడం ద్వారా కొన్ని కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఏం చేస్తారో చెప్పడానికి సెబీ ఒక స్పష్టమైన ఉదాహరణ. పాలనా వ్యవస్థను, సామాజిక న్యాయాన్ని దెబ్బతీసే ఈ జాతి వ్యతిరేక చర్యను ఇండియా కూటమి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది' అని రాహుల్ పేర్కొన్నారు. ఐఏఎస్‌ల ప్రైవేటీకరణ అనేది రిజర్వేషన్ల రద్దుకు మోదీ హామీ అని ఆయన దుయ్యబట్టారు.

### అకోబరు 2 నుంచి ఆందోళన: అఖిలేశ్

లేటరల్ ఎంట్రీ విధానం అమలును సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ తప్పుబట్టాయి. బీజేపీ చేస్తున్న కుట్రకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైందని, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ట్వీట్ చేశారు. దీనిపై అక్టోబరు 2నుంచి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వారి కోటా ప్రకారం నియామకాలు చేపట్టకపోతే అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని బీఎస్పీ అధినేత్రి మాయావతి పేర్కొన్నారు. ఈ విధానం బీజేపీ నిరంకుశత్వానికి నిదర్శనమని, ఇది రాజ్యాంగ విరుద్ధం, చట్ట వ్యతిరేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, వివిధ శాఖల్లోని జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీల వంటి కీలక పోస్టుల్లో 45 మందిని లేటరల్ ఎంట్రీ విధానంలో నియామకానికి యూపీఎస్సీ శనివారం దరఖాస్తులు ఆహ్వానించింది.

## కమల కంటే నేనే అందంగా ఉంటా..



పెన్సిల్వేనియా, ఆగస్టు 18: అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తన ప్రత్యర్థి డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌పై మరోసారి నోరుపారేసుకున్నారు. పెన్సిల్వేనియాలోని విల్కేస్- బారిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ట్రంప్ మాట్లాడుతూ, కమలా హారిస్ నవ్వు భయంకరంగా ఉంటుందని, ఆమె కంటే తానే అందంగా ఉంటానని వ్యాఖ్యానించారు. టైమ్ మ్యాగజైన్ కవర్ పేజీపై కమలా హారిస్ ఫొటోను ముద్రించడాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఉధృతం

గాజాస్ట్రిప్, ఆగస్టు 18: అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ పర్యటన నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. శనివారం అర్ధరాత్రి నుంచి జరిగిన బాంబింగ్‌లో 19 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. కాల్పుల విరమణకు అమెరికా ప్రయత్నాల్లో భాగంగా ఆదివారం బ్లింకెన్ గాజాలో పర్యటించడానికి ముందు ఈ దాడులు జరగడం గమనార్హం! సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో బ్లింకెన్ భేటీ కానున్నారు.

## బ్లింకెన్ పర్యటన వేళ..
## గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఉధృతం

గాజాస్ట్రిప్, ఆగస్టు 18: అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ పర్యటన నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. శనివారం అర్ధరాత్రి నుంచి జరిగిన బాంబింగ్‌లో 19 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కాల్పుల విరమణకు అమెరికా ప్రయత్నాల్లో భాగంగా ఆదివారం బ్లింకెన్ గాజాలో పర్యటించడానికి ముందు ఈ దాడులు జరగడం గమనార్హం.! కాగా.. సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో బ్లింకెన్ భేటీకానున్నారు.

## కోస్ట్‌గార్డ్ డీజీ రాకేష్ పాల్ హఠాన్మరణం

- సమర్థుడైన అధికారిని కోల్పోయాం: రాజ్‌నాథ్ సింగ్



రాకేష్ పాల్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఇండియన్ కోస్ట్ గార్డ్ డైరెక్టర్ జనరల్ రాకేష్ పాల్(58) గుండెపోటుతో మరణించారు. ఆదివారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు కోస్ట్‌గార్డ్‌కు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు హఠాత్తుగా గుండె నొప్పి రావడంతో చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అనంతరం కొద్దిసేపటికే ఆయన మరణించారు. విషయం తెలియడంతో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెంటనే ఆస్పత్రికి వెళ్లి రాకేష్ పాల్ మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన అకాల మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన సమర్థవంతమైన, నిబద్ధతతో కూడిన అధికారి అని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, ఐసీజీ 25వ డైరెక్టర్ జనరల్‌గా రాకేష్ పాల్ గతేడాది జూలై 19న బాధ్యతలు స్వీకరించారు. ఆయన భౌతికకాయాన్ని ఢిల్లీకి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

## ఉక్రెయిన్ అణు కేంద్రానికి సమీపంలో డ్రోన్ దాడి

- ప్లాంట్ భద్రతపై అణు ఇంధన సంస్థ ఆందోళన
- ఉభయులూ సంయమనం పాటించాలని ఐఏఈఏ విజ్ఞప్తి

కీవ్, ఆగస్టు 18: ఉక్రెయిన్‌కు చెందిన అణు కేంద్రం భద్రతపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న జపోరిజియాలోని ఈ అణు కేంద్రం సమీపంలో డ్రోన్ దాడి జరగడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రాఫెల్ మారియానో గ్రోసీ తెలిపిన మేరకు ఈ అణు కేంద్రం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది. ఈ ప్లాంట్ సిబ్బంది ఉపయోగించే రోడ్డుపై ఉక్రెయినే ఈ డ్రోన్ దాడికి దిగిందని రష్యా మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ప్లాంట్‌కు చెందిన కూలింగ్ స్ప్రింక్లర్స్‌కు సమీపంలో, 750 కిలోవాట్ల పవర్ లైన్‌కు కేవలం వంద మీటర్ల దూరంలో ఈ డ్రోన్ ద్వారా పేలుడు జరపడం కలవరపెడుతోందని, ఇప్పటికైనా ఉభయ పక్షాలు సమయమనం పాటించాలని గ్రోసీ విజ్ఞప్తి చేశారు. దాడి జరిగిన ప్రాంతాన్ని తమ బృందం పరిశీలించిందని, డ్రోన్ దాడిలో ఎలాంటి ప్రాణ నష్టమూ జరగలేదని, అలాగే, అణు కేంద్రానికి చెందిన పరికరాలపైనా ప్రభావమేమీ లేదని గ్రోసి తెలిపారు. ప్లాంట్‌కు చెందిన రెండు మెయిన్ గేట్లకు మధ్య రోడ్డుపై ఈ దాడి జరిగిందని పేర్కొన్నారు. యూరప్‌లోనే అతి పెద్దదైన జపోరిజియాలోని ఈ అణు కేంద్రం ఫిబ్రవరి 2022 నుంచి రష్యా ఆధీనంలోకి వెళ్లింది.

పర్వదినం



నేడు రాఖీ పౌర్ణమి

# సోదర బంధానికి రక్ష! రక్ష!

శ్రావణం ఐశ్వర్యప్రదమైన మాసం. దీని విశిష్టతను పరమశివుడు పార్వతికి వివరిస్తూ "అస్మిన్ మాసే కృతం యద్యత్తదనంతాయ కల్పతే... ఈ మాసంలో ఆచరించే క్రతువులు అనంతమైన ఫలాలను ఇస్తాయి" అని చెప్పాడు. ఎంతో మహిమాన్వితమైన ఈ నెలలో... పౌర్ణమి మరింత ప్రత్యేకమైనది. హయగ్రీవుడిగా శ్రీమహావిష్ణువు అవతరించినది శ్రావణ పౌర్ణమి నాడే. హయగ్రీవ వృత్తాంతం భాగవతంలోను, మహాభారతంలోను కనిపిస్తుంది. వేదాలను అపహరించిన రాక్షసుల సంహారం కోసం ఆవిర్భవించిన హయగ్రీవుణ్ణి జ్ఞాన ప్రదాతగా ఆరాధిస్తారు.



ఇదే రోజును 'రక్షా బంధన దినోత్సవం'గా, 'రాఖీ పౌర్ణమి'గా నిర్వహించే సంప్రదాయం భారతదేశమంతటా ఉంది. సోదరీ సోదరుల మధ్య జీవితాంతం ఉండవలసిన అనురాగ బంధం గురించి చాటి చెప్పే పర్వదినం రాఖీ పౌర్ణమి. సోదరుల ఉన్నతిని ఆకాంక్షిస్తూ, తనకు రక్షగా ఉండాలని కోరుతూ అక్కలు, చెల్లెళ్ళు రాఖీలను కడతారు. ధర్మ రక్షణ, దేశ రక్షణ, పరస్పర రక్షణ భావనలు రక్షాబంధనంలో ఇమిడి ఉన్నాయి. ఇది అనాది సంప్రదాయమని భవిష్యోత్తర, బ్రహ్మాండ, అగ్ని పురాణాల్లో, ఇతిహాసాల్లో, చరిత్రలో కనిపించే ప్రస్తావనలు రుజువు చేస్తున్నాయి. యమధర్మరాజుకు ఆయన సోదరి యమున రక్షను కట్టగా... ఆమెను యముడు ఆశీర్వదిస్తూ, "ఈ రోజు సోదరులకు రక్షను కట్టిన మహిళలకు సర్వ శుభాలు కలుగుతాయి" అని వరమిచ్చాడని, దేవ దానవ యుద్ధ సమయంలో ఇంద్రుడి విజయం కోసం శచీదేవి రక్ష కట్టిందని పురాణ కథలు ఉన్నాయి. చిత్తోడ్ రాజ్యం మీద బహదూర్‌షా దండయాత్రకు సిద్ధపడినప్పుడు, సాయం కోరుతూ మొఘల్ చక్రవర్తి హుమయూన్‌కు రాణి కర్ణావతి రాఖీ పంపిందనీ, ఆమెను సోదరిగా భావించిన హుమయూన్ తన సేనను పంపించి బహదూర్‌షాను ఓడించాడనీ చరిత్ర కథనం. రాజపుత్ర వనితలు యుద్ధ సమయాల్లో తమ భర్తలకు రక్ష కట్టేవారట. తుల్జా భవానీని ఆరాధించి, ఆమె కటాక్షంతో ఖడ్గాన్ని, రక్షా కంకణాన్ని ఛత్రపతి శివాజీ పొందాడనే కథ కూడా ప్రాచుర్యంలో ఉంది.

దేశంలోని అన్ని ప్రాంతాల్లో... తమ తమ ఆచారానుసారం పలు పద్ధతుల్లో, వివిధ పేర్లతో ఈ పర్వదినాన్ని ప్రజలు జరుపుకొంటారు. శ్రావణ పౌర్ణమిని 'జంధ్యాల పౌర్ణమి' అని కూడా అంటారు. ఉపనయన సంస్కారం పొందినవారు ఈ రోజున కొత్త యజ్ఞోపవీతాలను ధరించి, గాయత్రీ దేవిని పూజిస్తారు. గురుముఖంగా వేదాధ్యయనం చేయడానికి శ్రావణ పౌర్ణమిని ఉత్తమమైన రోజుగా పండితులు పరిగణిస్తారు.

***యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః***
***తేనత్వామభిబధ్నామి రక్షే మాచలమాచల***

బలి చక్రవర్తి అభిమానానికి మెచ్చిన మహావిష్ణువు... అతని వద్దనే చిక్కుకుపోయాడట. విష్ణుమూర్తిని విడిపించడం కోసం బలి చక్రవర్తికి శ్రీ మహాలక్ష్మి రక్షను కట్టిందనే కథ 'భవిష్య పురాణం'లో కనిపిస్తుంది. "మహా బలశాలి అయిన బలి చక్రవర్తినే బద్ధుణ్ణి చేసిన, మహా శక్తిమంతమైన రక్షను నీకు కడుతున్నాను. దీని శక్తితో నువ్వు చల్లగా వర్ధిల్లుతూ ఉండాలి" అని ఈ శ్లోకానికి అర్థం. ఈ శ్లోకం చదువుతూ సోదరులకు రక్షను కట్టడం శుభప్రదమనేది శాస్త్రవచనం.

**- ఆయపిళ్ళ రాజపాప**

# విమానంలో వినూత్న ప్రయోగం!

విమానాల్లో ప్రయాణించే సమయాల్లో పిల్లలు ఏడ్వటం.. వాళ్లను తల్లులు, అమ్మమ్మలు సముదాయించటం మనకు చాలా సార్లు కనిపిస్తూ ఉంటుంది. విమానంలో ప్రయాణించే కొందరు ప్రయాణికులకు - ఈ వ్యవహారమంతా ఇబ్బందిగా ఉంటుంది. ముఖ్యంగా అంతర్జాతీయ విమానాలలో పిల్లలు ఏడుస్తుంటే ఇతరులు చిరాకు పడతారు. అందుకే దక్షిణ కొరియాకు చెందిన ఒక మహిళ ఒక వినూత్న ప్రయోగం చేసింది. ఈ మహిళ దక్షిణ కొరియా నుంచి అమెరికాకు తన నాలుగు నెలల పాపను తీసుకు వెళ్తోంది. ఆ పాప





వల్ల కలిగే అసౌకర్యానికి చింతించమంటూ తాను ప్రయాణిస్తున్న విమానంలోని 200 మంది ప్రయాణికులకు - బ్యాగులు పంచిపెట్టింది. ప్రతి బ్యాగులో- ఇయర్ ప్లగ్స్, చ్యూయింగ్ గమ్‌తో పాటు ఒక చిన్న సందేశం కూడా ఉంది. ఈ సందేశంలో - "హాయ్! నా పేరు జున్ వూ. నాకు నాలుగు నెలలు. నేను మా అమ్మ, అమ్మమ్మలతో కలిసి అమెరికా వెళ్తున్నాను. ఇది నా తొలి విమాన ప్రయాణం. చాలా భయంగా ఉంది. వీలైనంత వరకు ఏడ్వకుండా ఉండటానికి ప్రయత్నిస్తా. నా ఏడుపు పెద్దగా ఉంటే- ఇయర్ ప్లగ్స్ పెట్టుకోండి.." అని ఉంది.



# నాన్న, నేను... ఓ ప్రయాణం!

**అందరూ స్నేహితులతో కలిసి బైక్ రైడ్‌లకు వెళ్తారు. కానీ 17 ఏళ్ల ఏంజలికా డేనియల్ తన తండ్రి అజయ్‌తో కలిసి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 7 వేల కిలోమీటర్లు ప్రయాణించింది. ఈ యాత్ర తనకు అనేక జీవిత పాఠాలను నేర్పిందంటోంది ఏంజలికా.**

"నాన్నకు బైక్ రైడింగ్ అంటే ఇష్టం. కొన్ని నెలల పాటు బైక్ మీద తిరిగి వస్తూ ఉంటారు. తనకు ఒక బైక్ గ్యాంగ్ ఉంది. అందరూ కలిసి ప్రయాణాలు ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. కొన్నాళ్ళ క్రితం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఏడు వేల కిలోమీటర్ల బైక్ రైడ్‌కు వెళ్ళాలనుకున్నారు. కానీ ఆ తరువాత... రకరకాల కారణాల వల్ల ఒకరి తర్వాత ఒకరు రావటానికి కుదరదని చెప్పటం మొదలుపెట్టారు. దీనితో నాన్నకు చాలా నిరాశ కలిగింది. తను నిరాశగా ఉండటం నాకు నచ్చలేదు.. "నాన్నా... నేను నీతో వస్తా..." అన్నాను. నాన్న చాలా ఆశ్చర్యపోయారు.

**కొత్త కాదు, కానీ...**

నాన్న బైక్ రైడర్ కాబట్టి.. ఆయనతో ఈ తరహా ప్రయాణాలు నాకు కొత్త కాదు. కానీ ఏడు వేల కిలోమీటర్లు... ఒకే బైక్ మీద వెళ్లటం మాత్రం చాలా కొత్త అనుభవం. ప్రయాణం మొదట్లో నాన్నకు నా గురించే ఎక్కువ ఆందోళన పడేవారు. దారిలో అందమైన ప్రదేశాలను ఆస్వాదించటం మానేసి- నేను ఎలా ఉన్నాను? నాకు ఇబ్బందిగా ఉందా? అనే విషయాలపైనే శ్రద్ధ చూపించేవారు. మూడు నాలుగు రోజుల తర్వాత నాన్నకు నేను ఆ ప్రయాణం చేయగలననే విశ్వాసం వచ్చింది. దాంతో తను కూడా ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించటం మొదలుపెట్టారు. మేమిద్దరం ప్రయాణించే సమయంలో అనేక విషయాల గురించి మాట్లాడుకునేవాళ్లం. అప్పటి వరకూ నాకు నాన్న ఇష్టాల గురించి, ఆయన అనుభవాల గురించి కొంతే తెలుసు. కానీ ఈ ప్రయాణంలో నేను నాన్నలోని కొత్త కోణాలను చూశాను. ఆ ప్రయాణం మొదట్లో నేను నాన్నకు ఒక చిన్న పిల్లను. నెమ్మదిగా ఆయనకు ఒక స్నేహితురాలిగా మారిపోయాను. నేను, నాన్న ఒకే ఇంట్లో 17 ఏళ్ల ఉన్నాం. నేను ఎప్పుడూ నాన్న గురించి నాకు బాగా తెలుసని అనుకొనేదాన్ని. కానీ నాన్న గురించి నాకు తెలిసింది చాలా తక్కువని ఈ యాత్ర ద్వారా అర్థమయింది. అలాగే నా గురించి కూడా నాన్నకు చాలా తెలిసింది. నాకు చరిత్ర అంటే చాలా ఇష్టం. చరిత్రకు సంబంధించిన అనేక విషయాలునాకు తెలుసు. ఏవైనా కోటల దగ్గర, ఇతర చారిత్రాత్మక ప్రదేశాల దగ్గర ఆగినప్పుడు- నాన్నకు వాటి గురించి చెప్పేదాన్ని. కొన్నిసార్లు నాన్న - నాకు ఉన్న పరిజ్ఞానానికి ఆశ్చర్యపడేవారు. ఒక రోజు సాయంత్రం ప్రయాణం చేస్తున్నాం. అన్ని వైపులా నిశ్శబ్దం ఆవరించి ఉంది. నాకు చాలా భయమేసింది. ఆ నిశ్శబ్దాన్ని ఎలా అధిగమించాలో తెలియలేదు. అప్పుడు నాన్న నన్ను 'డిస్నీ-ఫ్రోజెన్' సినిమాలోని 'లెట్ ఇట్ గో' అనే పాట పాడమన్నారు. నాకు బాగా ఇష్టమైన పాట అది. ఆ పాట పాడుతుంటే నా భయమంతా పోయింది.

**నేర్చుకున్న పాఠాలెన్నో...**


మనం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మనకు ఏదో ఒక విధంగా సాయం అందుతుంది. కానీ మనకు ఆ సాయం అందుకొనే ఓపిక ఉండాలి. దాని కోసం వేచి చూడాలి. ఇదే నేను నేర్చుకున్న తొలి పాఠం. మా ప్రయాణంలో ఒకసారి మేము దారి తప్పాం. గూగుల్ మ్యాప్‌లు కూడా సరిగ్గా పనిచేయలేదు. ఏం చేయాలో తెలియని స్థితి. అలాంటి పరిస్థితుల్లో ఒక గ్రామం కనిపించింది. అప్పుడు మాకు కలిగిన రిలీఫ్ మాటల్లో చెప్పలేను. ఇక నాన్న బైక్ నడపటంలో చూపించిన నైపుణ్యం నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఎంత ఎత్తైన ప్రాంతంలోనైనా, లోతైన లోయల అంచుల్లో ఉన్నా - ఏ మాత్రం తొణకకుండా ఆయన బైక్‌ను డ్రైవ్ చేసిన తీరును మరిచిపోలేను. బహుశా నాన్న జీవితంలో విజయం సాధించటానికి ఈ ఏకాగ్రతే కారణం అనుకుంటా. 'కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ప్రయాణించిన అతి పిన్నవయస్కురాలైన పిలియన్ రైడర్'గా 'ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్' నన్ను గుర్తించింది. ఆ విధంగా కూడా ఈ ప్రయాణం నా జీవితాంతమంతా గుర్తుండిపోతుంది."

# స్పార్క్ సూపర్‌గా...

వర్కింగ్ కపుల్‌కు వారాంతాల్లో మాత్రమే తీరిక చిక్కుతుంది. ఆ సమయాన్ని మిగతా పనులకే వెచ్చించకుండా, అనుబంధం బలపడడం కోసం కూడా కేటాయిస్తూ ఉండాలి. మునుపటి ఆకర్షణ తగ్గిందనిపిస్తే, చిన్న చిన్న చిట్కాలతో కోల్పోయిన స్పార్క్‌ను తిరిగి జీవితాల్లోకి ఆహ్వానించాలి.

**ఇండోర్ గేమ్స్:**

ఆఫీసు పని, ఇంటి పనితోనే సరిపెట్టుకోకుండా ఇద్దరూ కలిసి క్యారమ్స్, ప్లేయింగ్ కార్డ్స్, లూడో, చెస్ మొదలైన ఇండోర్ గేమ్స్ ఆడాలి. ఆటలతో ఒత్తిడి తొలగడంతో పాటు, కాలక్షేపం కూడా దక్కుతుంది. కలిసి నాణ్యమైన సమయం గడిపామనే సంతృప్తి కూడా దక్కుతుంది.



**పాత జ్ఞాపకాలు:**

పెళ్లి నాటి ఫొటో ఆల్బమ్‌ను తిరగేస్తే పాత జ్ఞాపకాలతో మానసికోల్లాసం దక్కుతుంది. ఒకప్పటి గుర్తులు, సంఘటనలు కళ్ల ముందు మెదిలి, దంపతుల మధ్య దూరాలు తరుగుతాయి.

**సరదా సరదాగా:**

సరదా టెక్స్ట్ మెసేజీలు పంపుకుంటూ, ఒకర్నొకరు టీజ్ చేసుకుంటూ ఉండాలి. సరికొత్త వంటకాలతో భార్య భర్తనూ, ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి తెప్పించిన సర్‌ప్రైజ్ గిఫ్ట్‌తో భర్త భార్యనూ సర్‌ప్రైజ్ చేసుకోవచ్చు.

**పనుల్లో భాగస్వామ్యం:**

ఇంటి పనులు కలిసి చేయడం ద్వారా కూడా దంపతులు తమ మధ్య తగ్గే అన్యోన్యతను పెంచుకోవచ్చు. కూరగాయలు తరగడం, మిక్సీ, వాషింగ్ మెషిన్, గార్డెనింగ్ పనులతో భర్తలు భార్యలకు సహాయపడవచ్చు. అలాగే భార్యలు కూడా భర్తల పనుల్లో పాలుపంచుకోవచ్చు.

## నవ్య | చిత్రజ్యోతి

# అల్లు అరవింద్ ఆటపట్టించారు



అంకిత్ కొయ్యప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మారుతీనగర్ సుబ్రహ్మణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల వుతోంది. ఈ సందర్భంగా అంకిత్ మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమాలో ఇంద్రజగారు నా తల్లి పాత్ర చేశారు. ఆమె సూచన మేరకే దర్శకుడు నన్ను ఎంపిక చేశారు. ఇందులో నా పాత్రకు 'నేను అల్లు అరవింద్ కొడుకును, బన్నీ మా అన్నయ్య' అనే డైలాగ్ ఉంది. ఈ మధ్య అల్లు అరవింద్‌గారిని కలిసినప్పుడు 'నా కొడుకునని చెప్పుకొని తిరుగుతున్నావంట... తెలిసింది' అని సరదాగా ఆట పట్టించారు. రావు రమేశ్ కాంబినేషన్‌లో వచ్చే సీన్లు వినోదం పంచుతాయి' అని ఆయన తెలిపారు.

# సన్నీ 'క్యు జి'



జాకీ ష్రాఫ్, సన్నీలియోన్, ప్రియమణి ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'క్యు జి'. వివేక్ కన్నన్ కుమార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఎం వేణుగోపాల్ ఈ చిత్రం తెలుగు వెర్షన్‌ను విడుదల చేస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ 'సన్నీ లియోన్ నటన సినిమాకు ప్రత్యేకాకర్షణ. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు.

# ఫాంటసీ థ్రిల్లర్



సుధీర్‌బాబు హీరోగా వెంకట్ కల్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో తెలుగు-హిందీలో తెరకెక్కుతోన్నద్విభాషా చిత్రానికి 'జటాధర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాలో సుధీర్ బాబు లుక్‌తో పాటు టైటిల్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. సూపర్ నాచురల్ ఫాంటసీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం వచ్చే ఏడాది మహా శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న విడుదల కానుంది. ప్రేరణ్ అరోరా, శివిన్ నారంగ్, నిఖిల్ నందా, ఉజ్వల్ ఆనంద్ నిర్మిస్తున్నారు.

## కొత్తగా..

# మరోసారి జంటగా




హిట్ జోడీగా పేరు తెచ్చుకున్న శివాజీ, లయ జంటగా సరికొత్త క్రైమ్ కామెడీ థ్రిల్లర్ రూపొందుతోంది. సుధీర్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శివాజీ నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభమైంది. దిల్‌రాజు క్లాప్ ఇవ్వగా, బోయపాటి శ్రీను గౌరవ దర్శకత్వం వహించారు. ఈ నెల 20 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తామని యూనిట్ తెలిపింది.

# మెప్పించే మన కుటుంబం



సుమన్ ప్రధాన పాత్ర పోషిస్తున్న గ్రామీణ నేపథ్య చిత్రం 'మన కుటుంబం'. ఆకుల రాఘవ దర్శకత్వంలో కలకొండ హేమలత నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది, సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని నిర్మాత తెలిపారు. కథ, పాటలు ప్రేక్షకులను అలరిస్తాయని దర్శకుడు చెప్పారు. సంగీతం: భానుప్రసాద్, సినిమాటోగ్రఫీ: జగదీశ్

# మోహన్ లాల్‌కు అస్వస్థత



మలయాళ నటుడు మోహన్ లాల్ అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం ఆయన జ్వరం, కండరాల నొప్పులు, శ్వాస సంబంధిత సమస్యలతో కొచ్చిలోని ఓ ఆస్పత్రిలో చేరారు. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఐదు రోజుల పాటు విశ్రాంతి తీసుకోమ్మని వైద్యులు మోహనలాల్‌కు సూచించారు. కాగా, మోహన్‌లాల్ నటిస్తున్న 'బరోజ్', 'ఎల్ 2: ఎంపురాన్' సినిమాల్లో నటిస్తున్నారు.

# ఇప్పుడంత టైమ్ లేదు



మహేశ్‌బాబుతో సినిమా చేసేందుకు ఇప్పుడు టైమ్ కుదిరేలా లేదన్నారు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. ఆదివారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహేశ్‌తో సినిమా ఎప్పుడు చేస్తారని అడగ్గా... 'ప్రభాస్‌తో స్పిరిట్ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్తుంది, ఆ తర్వాత యానిమల్ 2 చిత్రాన్ని ప్రారంభిస్తా, ఈ రెండు సినిమాలను పూర్తి చేయడానికే నాలుగేళ్లు పడుతుంది. ఆ తర్వాతే కొత్త సినిమా గురించి ఆలోచిస్తాను' అని సందీప్ రెడ్డి చెప్పారు.

# సెట్స్‌పైకి శివన్న చిత్రం



శివరాజ్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న తెలుగు-కన్నడ ద్విభాషా చిత్రం (శివన్న 131-వర్కింగ్ టైటిల్) షూటింగ్ శనివారం మొదలైంది. కార్తీక్ అద్వైత్ దర్శకత్వంలో ఎస్.ఎన్ రెడ్డి, సుధీర్ పి నిర్మిస్తున్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో శివరాజ్‌కుమార్ శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. సంగీతం: సామ్ సీఎస్, సినిమాటోగ్రఫీ: ఎ. జె శెట్టి.

# ప్రభాస్ పాత్ర జోకర్‌లా ఉంది



బాలీవుడ్ నటుడు.. 'మున్నా భాయ్ ఎంబీబీఎస్' సినిమాలో సర్క్యూట్‌గా పాపులరైన అర్షద్ వార్సీ ప్రభాస్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఓ పాడ్ కాస్ట్‌లో మాట్లాడుతూ "కల్కి 2898 ఏ.డీ' సినిమా చూశాను. నాకు నచ్చలేదు. సినిమాలో అశ్వత్థామగా అమితాబ్ అదరగొట్టారు. ఇంత వయసులోనూ ఆయన ఈ స్థాయిలో నటించడం గొప్ప విషయం. ఆయనకు ఉన్న శక్తిలో కొంచెమైనా నాకు ఉండి ఉంటే.. ఈ పాటికి లైఫ్ సెట్ అయ్యిపోయేది. ఇందులో ప్రభాస్ పోషించిన పాత్ర బాలేదు. ఆయన పాత్ర జోకర్‌లా ఉంది. నేను ప్రభాస్‌ను 'మ్యాడ్ మాక్స్' లాంటి సినిమాలో మెల్ గిబ్సన్‌లా చూడాలనుకుంటున్నాను. కానీ నేను చూసింది వేరు" అని అన్నారు. ఇప్పుడు ఈ మాటలు సోషల్ మీడియాలో పెద్ద దుమారాన్నే రేపాయి. ఆయనపై ప్రభాస్ అభిమానులు తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# రూ.5 కోట్ల పరువునష్టం దావా



సంగీత దర్శకుడు యువన్ శంకర్‌రాజాపై చెన్నైలోని తిరువల్లికేణి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. తమకు ఇవ్వాల్సిన రూ.20 లక్షల అద్దె చెల్లించలేదని అజ్మత్ బేగం, ఆమె సోదరుడు మహ్మద్ జావిద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. "దాదాపు రూ.20 లక్షల అద్దెను యువన్ శంకర్‌రాజా చెల్లించాలి. ఆ విషయమై ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదు. మాకు తెలియకుండా సైలెంట్‌గా సామాన్లను వేరే చోటికి షిఫ్ట్ చేశారు" అని అందులో ఆరోపించారు. వారిపై యువన్ రూ. 5 కోట్లకు పరువునష్టం దావా వేశారు. ఈమేరకు అజ్మత్ బేగం, మహ్మద్ జావిద్‌లకు నోటీసులు పంపారు.



# జానీ మాస్టర్‌కు సన్మానం

ఇటీవలే ప్రకటించిన జాతీయ పురస్కారాల్లో.. ఉత్తమ కొరియోగ్రాఫర్ పురస్కారానికి ఎంపికైన జానీ మాస్టర్‌ను ఆదివారం తెలుగు చిత్రసీమ ప్రముఖులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జానీ మాస్టర్ మాట్లాడుతూ "నాపై ఇంతటి ప్రేమను చూపిస్తున్న మీ అందరికీ కృతజ్ఞతలు. ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది" అని చెప్పారు.

# భారీ యాక్షన్‌తో



విజయ్ కథానాయకుడిగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). శనివారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. యాక్షన్ సీక్వెన్స్‌లో విజయ్ అలరించారు. డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని. మైత్రీ మూవీ మేకర్స్ తెలుగులో విడుదల చేస్తోంది.

# రోమియో కథ



హర్ష రోషన్, హారిక హీరోహీరోయిన్లుగా భాస్కర్ రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'వాట్సప్ రోమియో'. ఆదివారం చిత్రబృందం ఫస్ట్ లుక్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత భిక్షమయ్య మాట్లాడుతూ 'రోమియో అనగానే ఆకతాయి కుర్రాడు అనుకుంటారు గానీ మా సినిమాలో రోమియో పాత్ర అందరినీ ప్రేమిస్తుంది' అన్నారు.

# స్పోర్ట్స్

విజయవాడ ● సోమవారం 19 ఆగస్టు 2024

## ప్రియ 'పాంచ్'

● భారత్-ఎ ఘన విజయం
● 171 పరుగులతో ఆసీస్ చిత్తు



మాకె (ఆస్ట్రేలియా): అరంగేట్ర లెగ్ స్పిన్నర్ ప్రియా మిశ్రా (5/14) తిప్పేయడంతో.. ఆస్ట్రేలియా టూర్‌లో భారత్-ఎ మహిళల జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్-ఎ 171 పరుగులతో ఆస్ట్రేలియా-ఎను చిత్తు చేసింది. తొలి రెండు వన్డేల్లో భారత్ ఓడడంతో, ఆసీస్ 2-1తో వన్డే సిరీస్‌ను దక్కించుకొంది. మొదట భారత్ 50 ఓవర్లలో 243/9 స్కోరు చేసింది. రఘ్వి బిస్త్ (53), తేజల్ (50) అర్ధ శతకాలు చేశారు. బ్రౌన్ 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత స్పిన్నర్ల ధాటికి ఆసీస్ 22.1 ఓవర్లలో 72 రన్స్‌కే కుప్పకూలింది. మిన్నూ మణి 2 వికెట్లు తీసింది. ఇరుజట్ల మధ్య ఏకైక అనధికార టెస్ట్ గురువారం నుంచి జరగనుంది.

## రంజీలతో షమి రీఎంట్రీ!

న్యూఢిల్లీ: శస్త్రచికిత్స చేయించుకొన్న అనంతరం పునరావాసంలో ఉన్న పేసర్ షమి రంజీలతో మళ్లీ పోటీ క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. రంజీ ట్రోఫీలో అక్టోబరు 11న యూపీతో, 18న బిహార్‌తో బెంగాల్ తలపడనుంది. వీటిల్లో ఒక మ్యాచ్‌లో షమి బరిలోకి దిగే అవకాశం ఉంది. అనంతరం న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరిగే టెస్ట్ సిరీస్‌లో ఒక మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేసే చాన్సులున్నాయి. ఫిట్‌నెస్ నిరూపించుకొంటే ఆస్ట్రేలియా టూర్‌కు ఎంపిక కావడం పక్కా. గతేడాది ఆస్ట్రేలియాతో వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌లో షమి చివరిసారిగా కనిపించాడు.

## షూటర్లను కాపాడే వ్యవస్థ ఏది?

జాతీయ సమాఖ్యపై జస్పాల్ రాణా ఆగ్రహం



న్యూఢిల్లీ: ఒలింపిక్స్ కోసం షూటర్ల ఎంపిక విధానం సరిగా లేదని మాజీ షూటర్ జస్పాల్ రాణా విమర్శలు గుప్పించాడు. పారిస్ గేమ్స్‌లో రెండు కాంస్యాలు సాధించిన మను భాకర్‌కు కోచ్‌గా వ్యవహరించిన రాణా.. తాజాగా భారత జాతీయ రైఫిల్ సమాఖ్య (ఎన్ఆర్ఏఐ)పై మండిపడ్డాడు. సెలెక్షన్ పాలసీలో సమాఖ్య నిలకడను ప్రదర్శించకపోతే భవిష్యత్‌లో ఎంతో మంది షూటర్లకు అన్యాయం జరుగుతుందని అన్నాడు. అలాగే జాతీయ శిబిరాలు, ట్రయల్స్‌కు షూటర్ల వ్యక్తిగత కోచ్‌లను అనుమతించకపోవడం కూడా సరికాదన్నాడు. 'ప్రతీ ఆరు నెలలకోసారి సమాఖ్య సెలెక్షన్ పాలసీ మారుతోంది. అందుకే ఇటీవల క్రీడామంత్రిని కలిసి ఎంపిక బాధ్యతలను సమాఖ్య నుంచి తీసుకోమని చెప్పాను. సమాఖ్య అనాలోచిత నిర్ణయాల వల్ల సౌరభ్ చౌదరి, జీతూ రాయ్‌లాంటి నైపుణ్యం కలిగిన షూటర్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? ఎవరైనా వారి గురించి మాట్లాడుతున్నారా? అసలు ఎన్ఆర్ఏఐలో షూటర్లను కాపాడుతూ, వారికి మద్దతిచ్చే వ్యవస్థే లేదు' అని రాణా ఆరోపించాడు.

## బంతికి టేప్ చుట్టి ఆడేవాణ్ణి





ఐఎస్‌పీఎల్ సీజన్ 2 ఆవిష్కరణ కార్యక్రమంలో సచిన్, బాలీవుడ్ నటులు కరీనా, సైఫ్‌అలీఖాన్

ముంబై: తాను క్రికెట్ ఆడే రోజుల్లో రివర్స్ స్వింగ్‌ను ఎదుర్కొనేందుకు బంతికి ఓవైపు టేపు చుట్టి ప్రాక్టీస్ చేసేవాడినని సచిన్ టెండూల్కర్ తెలిపాడు. 'లెదర్ బాల్‌లో నునుపు, గరుకు కనిపిస్తుంటాయి. కానీ టెన్నిస్ బంతికి అలా రావాలంటే ఓవైపు టేపు చుట్టాల్సి ఉంటుంది. నేను అంతర్జాతీయ క్రికెట్‌లో రివర్స్ స్వింగ్‌ను మెరుగ్గా ఆడేందుకు ఇలాంటి బంతులతోనే ప్రాక్టీస్ చేశాను. అందుకే ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ (ఐఎస్‌పీఎల్)లోనూ ఈ పద్ధతిని ఎందుకు అమలు చేయకూడదనిపించింది. దీని ద్వారా బ్యాటర్ల టెక్నిక్ కూడా మెరుగవుతుంది' అని ఆదివారం ఇక్కడ జరిగిన ఐఎస్‌పీఎల్ సీజన్ 2 లాంచింగ్ కార్యక్రమంలో సచిన్ తెలిపాడు. వచ్చే జనవరి 26 నుంచి ఫిబ్రవరి 9 వరకు థానే వేదికగా ఈ టెన్నిస్ బాల్ టోర్నీ జరుగనుంది.

## బంగారు పతకం 750 కిలోల లడ్డూలు

వినేశ్‌కు గ్రామస్థుల కానుకలు




ఒలింపిక్ పతకం చేజారడమనేది నా జీవితానికే అతిపెద్ద గాయం. అది మానడానికి ఎంత సమయం పడుతుందో చెప్పలేను. నాకు దక్కుతున్న ఆదరాభిమానాలను చూస్తుంటే వేగంగా కోలుకొని మళ్లీ రెజ్లింగ్‌లోకి పునరాగమనం చేస్తానేమోననిపిస్తోంది. నా రికార్డులను నా గ్రామం వారే అధిగమించాలి. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా గత ఏడాది కాలంగా మేము చేస్తున్న పోరాటం కొనసాగిస్తాం. దేవుడి దయతో నిజం బయట పడుతుంది.

-వినేశ్ ఫొగట్

న్యూఢిల్లీ: పారిస్ నుంచి తిరిగి వచ్చిన రెజ్లర్ వినేశ్ ఫొగట్‌కు ఆమె స్వగ్రామంలో అపూర్వ స్వాగతం లభించింది. ఢిల్లీ విమానాశ్రయం నుంచి హరియాణాలోని ఆమె సొంతూరు బలాలీకి చేరుకోవడానికి దాదాపు 13 గంటల సమయం పట్టింది. 135 కిలో మీటర్లు ప్రయాణించి శనివారం అర్ధరాత్రి గ్రామానికి చేరుకొన్న వినేశ్‌కు స్థానికులు నీరాజనం పలికారు. దీంతో ఒక్క సారిగా భావోద్వేగానికి గురైన ఆమెకు.. చుట్టుపక్కల వారు, గ్రామస్థులు వెన్నుతట్టి ధైర్యం చెప్పారు. తలపాగాతోపాటు ఆమెకు కత్తి ఇచ్చి ఘనంగా సన్మానించిన గ్రామస్థులు.. ఇచ్చిన మాట ప్రకారం గోల్డ్ మెడల్ (బంగారు పతకం)తో పాటు క్రౌడ్ ఫండింగ్ ద్వారా సేకరించిన రూ. 21 వేలను బహుమానంగా అందించారు. ఇదేమీ పెద్ద మొత్తం కాకపోయినా తమ ప్రేమాభిమానాలను ఈ రూపంలో వ్యక్తపరిచారు. ఓ వాచ్‌మన్ రూ. 100.. ఇలా ప్రతి ఒక్కరూ తమ కు తోచినంతగా జమ చేశారు. అంతేకాకుండా 750 కిలోల లడ్డూలను ఫొగట్‌కు కానుకగా ఇచ్చారు. అనంతరం వాటిని ఊరంతా పంచారు. ఒలింపిక్స్ రెజ్లింగ్ 50 కిలోల విభాగంలో ఫైనల్ చేరిన వినేశ్.. 100 గ్రాముల బరువు ఎక్కువగా ఉందనే కారణంతో అనర్హతకు గురైన సంగతి తెలిసిందే.

## ప్రతి జిల్లాలో మినీ స్టేడియాలు

ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని

విజయవాడ (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలోను క్రికెట్ మినీ స్టేడియాలు నిర్మిస్తామని ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వెల్లడించారు. విజయవాడలో ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏసీఏలో రాజకీయాలు లేకుండా చూస్తామన్నారు. మంగళగిరి, కడపలో అంతర్జాతీయ స్థాయి స్టేడియంల నిర్మాణాలను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. తెలంగాణ క్రికెట్ అకాడమీతో పోలిస్తే ఏసీఏలో రాజకీయాలు తక్కువేనన్నారు. దేశంలోని అన్ని క్రీడాసంఘాల కంటే అత్యుత్తమంగా ఏసీఏను తీర్చిదిద్దుతామన్నారు. తాము సెలక్షన్ కమిటీలో జోక్యం చేసుకోమన్నారు.

## పేస్ పదును పెంచేనా?

టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్కెల్‌పై అంచనాలు



(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

టీమిండియా ప్రధాన కోచ్ గంభీర్‌కు దక్షిణాఫ్రికా మాజీ పేసర్ మోర్నీ మోర్కెల్‌పై గట్టి నమ్మకమే ఉంది. ఇద్దరూ కలిసి ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున కలిసి పనిచేశారు. అలాగే కోల్‌కతా నైట్ రైడర్స్‌కు గతంలో కలిసి ఆడిన అనుభవముంది. అందుకే బౌలింగ్ కోచ్ రేసులో ఎన్ని పేర్లు వినిపించినా.. గౌతీ ప్రతిపాదన మేరకు బీసీసీఐ మోర్కెల్ వైపే మొగ్గు చూపింది. దీంతో మూడేళ్ల పాటు అంటే 2027 వన్డే వరల్డ్‌కప్ దాకా మోర్నీనే బౌలింగ్ కోచ్‌గా కొనసాగనున్నాడు. ముందుగా వచ్చే నెలలో బంగ్లాదేశ్‌తో జరిగే టెస్టు సిరీస్‌తో అతడి ప్రస్థానం ఆరంభమవుతుంది. అంతకన్నా ముందు అతడిపై పెద్ద బాధ్యతలే ఉన్నాయి. భారత బౌలింగ్ ఇప్పుడు సంధి దశలో ఉంది. వెటరన్ పేసర్ షమి గాయాలతో ఇబ్బంది పడుతున్నాడు. అలాగే స్టార్ పేసర్ బుమ్రాపై పని భారం పడకుండా చూడాల్సి వస్తోంది. దీంట్లో భాగంగా అతడిని అన్ని ఫార్మాట్లలో ఆడించేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ సిద్ధంగా లేదు.

వాస్తవానికి టెస్టు, వన్డేల్లో సీనియర్లు బుమ్రా, షమి, సిరాజ్‌ల స్థానానికి ఢోకా లేదు. కానీ టీ20లతో పాటు రిజర్వ్ బలాన్ని పెంచేందుకు యువ పేస్ దళాన్ని తయారు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ప్రసిద్ధ్ క్రిష్ణ, మయాంక్ యాదవ్, అవేశ్ ఖాన్, ఖలీల్, ఆకాశ్‌దీప్, ఉమ్రాన్ మాలిక్, ముకేశ్, హర్షిత్ రాణా జట్టు భవిష్యత్ ప్రణాళికల్లో ఉన్నారు. ఐపీఎల్‌లో మోర్కెల్ ఆధ్వర్యంలోనే లఖ్‌నవూ పేసర్ మయాంక్ యాదవ్ గంటకు 155 కి.మీ వేగంతో బంతులు విసిరి అందరినీ ఆశ్చర్యపరిచాడు. కొన్ని మ్యాచ్‌లకే మయాంక్ గాయపడినా అతడిపై మరింత ఒత్తిడి పడకుండా తగిన విశ్రాంతి కల్పించాడు. బోర్డు పరిశీలనలో ఉన్న పేసర్లు అంతర్జాతీయస్థాయిలో రాణించేందుకు మరింత శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. మరోవైపు బంగ్లాతో సిరీస్‌కు మరో 15 రోజుల గడువుంది. ఆ తర్వాత భారత జట్టు ఆస్ట్రేలియా టూర్‌కు వెళుతుంది. అక్కడ మోర్కెల్‌కు గతంలో దక్షిణాఫ్రికా పేసర్‌గా విశేషంగా రాణించిన అనుభవముంది. అన్నింటికన్నా ముఖ్యంగా టీమిండియా షెడ్యూల్‌లో 17 ఏళ్లుగా టెస్టు సిరీస్ గెలవని ఇంగ్లండ్ టూర్ కూడా ఉంది. అప్పటిలోగా గౌతీ-మోర్కెల్ ద్వయం పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను వణికించే పేసర్లను తయారుచేస్తారని ఆశిద్దాం. అయితే కెరీర్‌లో మోర్కెల్ తన పదునైన పేస్‌తో బ్యాటర్లను ఎంతగా వణికించినా.. కోచ్‌గా అతడి గ్రాఫ్ ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. గతేడాది వన్డే వరల్డ్‌కప్ కోసం పాకిస్థాన్ బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించినా మోర్కెల్ ప్రభావం చూపలేకపోయాడు. 9 నెలలకే రాజీనామా చేశాడు. ఆ తర్వాత నమీబియా, న్యూజిలాండ్ మహిళల జట్లకు పనిచేశాడు.

## విండీస్‌తో భారత్ పోరు షురూ

జనవరి 18 నుంచి మహిళల అండర్-19 టీ20 వరల్డ్‌కప్

దుబాయ్: మలేసియాలో జరిగే మహిళల అండర్-19 టీ20 వరల్డ్‌కప్ షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరగనుంది. భారత్ తమ ఆరంభ మ్యాచ్‌ను జనవరి 19న వెస్టిండీస్‌తో ఆడనుంది. ఇక, టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటాయి. వీటిని 4 గ్రూప్‌లుగా విభజించి మొత్తంగా 41 మ్యాచ్‌లు ఆడించనున్నారు. ప్రతీ గ్రూప్‌లో టాప్-3 జట్లు సూపర్ సిక్స్‌కు వెళతాయి. ఇందులోని రెండు గ్రూప్‌ల్లో టాప్-2 జట్లు సెమీస్ ఆడతాయి. గ్రూప్ 'ఎ'లో డిఫెండింగ్ చాంప్ భారత్‌తో పాటు వెస్టిండీస్, శ్రీలంక, మలేసియాలకు చోటు దక్కింది. గ్రూప్ 'బి'లో పాకిస్థాన్, ఇంగ్లండ్, ఐర్లాండ్, యూఎస్ఏ.. గ్రూప్ 'సి'లో న్యూజిలాండ్, సౌతాఫ్రికా, ఆఫ్రికా క్వాలిఫయర్, సమోవా.. గ్రూప్ 'డి'లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఆసియా క్వాలిఫయర్ స్కాట్లాండ్ ఉన్నాయి.

## సఫారీల రికార్డు



రెండో టెస్టులో విండీస్‌పై విజయం
సిరీస్ కైవసం

గయానా: వెస్టిండీస్‌తో రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 40 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను 1-0తో దక్కించుకుంది. తొలి మ్యాచ్ డ్రా అయ్యింది. ఈ విజయంతో సుదీర్ఘ ఫార్మాట్‌లో ఒకే జట్టుపై వరుసగా అత్యధిక టెస్టు సిరీస్ (10)లు గెలిచిన జట్టుగా దక్షిణాఫ్రికా రికార్డుకెక్కింది. ఇరు జట్ల మధ్య తొలిసారి 1991-92లో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్ సిరీస్‌లో మాత్రమే విండీస్ నెగ్గింది. ఆ తర్వాత అన్నింటా సఫారీలదే ఆధిపత్యం. ఇక గతంలో ఈ రికార్డు భారత్, ఆస్ట్రేలియా జట్ల పేరిట సంయుక్తంగా ఉండేది. ఈ రెండు జట్లు కూడా విండీస్‌పైనే 9 టెస్టు సిరీస్‌లు గెలవడం గమనార్హం. శనివారం మూడో రోజే ముగిసిన ఈ టెస్టులో విండీస్ 263 పరుగుల లక్ష్యం కోసం బరిలోకి దిగింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో విజయం కోసం పోరాడినప్పటికీ 222 రన్స్‌కు ఆలౌటైంది. కేశవ్, రబాడలకు మూడేసి వికెట్లు దక్కాయి. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 160, రెండో ఇన్నింగ్స్‌లో 246 స్కోర్లు చేయగా.. విండీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 144 రన్స్‌కు కుప్పకూలింది.

## క్షమాపణలు కోరిన అల్కారజ్

సిన్సినాటి: ఓ టోర్నీలో మ్యాచ్ సందర్భంగా రాకెట్ విరగ్గొట్టినందుకు ప్రపంచ టెన్నిస్ మాజీ నెంబర్‌వన్ కార్లోస్ అల్కారజ్ క్షమాపణలు చెప్పాడు. గతవారం సిన్సినాటి ఓపెన్‌లో మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) చేతిలో ఓటమిపాలైన స్పెయిన్ స్టార్ అల్కారజ్.. ఆ మ్యాచ్‌లో పలుమార్లు అసహనానికి లోనవుతూ రాకెట్‌ను నేలకేసి కొట్టాడు. దీనిపై తాజాగా స్పందిస్తూ.. 'ఆరోజు మ్యాచ్‌లో నేనలా ప్రవర్తించి ఉండకూడదు. కోర్టులో కొన్నిసార్లు సహనాన్ని కోల్పోతుంటాం. మరోసారి ఇలాంటిది జరగదు' అని 21 ఏళ్ల అల్కారజ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

# బిజినెస్

## 1.7 లక్షల కోట్ల పెట్టుబడులు

● ఐదేళ్లలో బీపీసీఎల్ టార్గెట్.. ● ఏపీలో రిఫైనరీ ఏర్పాటుపై మౌనం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బీపీసీఎల్ కంపెనీ భారీ విస్తరణకు సిద్ధమవుతోంది. వచ్చే ఐదేళ్లలో ఇందుకోసం రూ.1.7 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్టు చైర్మన్ జీ కృష్ణకుమార్ తాజా వార్షిక నివేదికలో పేర్కొన్నారు. కీలకమైన ఆయిల్ రిఫైనింగ్, పెట్రో ఉత్పత్తులు, మార్కెటింగ్, ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై ఈ పెట్టుబడులు పెట్టనున్నట్టు తెలిపారు. ఇందుకోసం 'ప్రాజెక్టు యాస్పైర్' పేరుతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. భవిష్యత్ వృద్ధికి మంచి అవకాశం ఉన్న పెట్రో కెమికల్స్, హరిత ఇంధన ప్రాజెక్టులపైనా బీపీసీఎల్ ప్రత్యేక దృష్టి పెట్టనుంది. ఈ విస్తరణతో కంపెనీ షేర్ల దీర్ఘకాలిక విలువ కూడా పెరుగుతుందని కృష్ణకుమార్ తెలిపారు. ఆకర్షణీయంగా ఉన్న కంపెనీ ఆస్తి-అప్పుల పట్టిక తమ ఇంధన పరివర్తనకు దోహదం చేస్తుందన్నారు.

### ఆంధ్రప్రదేశ్ సందర్భన

ఆంధ్రప్రదేశ్‌లో రిఫైనరీ, పెట్రోకెమికల్స్ ప్లాంట్ ఏర్పాటుపై బీపీసీఎల్ చైర్మన్ ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. అయితే వచ్చే ఐదేళ్లలో కంపెనీ రిఫైనింగ్, పెట్రో ఉత్పత్తుల సామర్థ్యాన్ని మరింత విస్తరిస్తామన్నారు. ఇందుకోసం కొత్త రిఫైనరీ, పెట్రోకెమికల్స్ ప్లాంట్ ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రిఫైనరీ ప్రాజెక్టు ఏర్పాటు కోసం కృష్ణకుమార్ నేతృత్వంలోని కంపెనీ ఉన్నతాధికారుల బృందం ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో భేటీ అయి చర్చించిన విషయం తెలిసిందే.

### రూ. 80,000 కోట్ల పెట్టుబడి

రూ.60,000 కోట్ల నుంచి రూ.80,00 కోట్ల పెట్టుబడితో, ఏటా 90 నుంచి 110 లక్షల టన్నుల రిఫైనింగ్ సామర్థ్యంతో ఈ కొత్త రిఫైనరీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని బీపీసీఎల్ భావిస్తోంది. తీర ప్రాంతంలోని మచిలీపట్నం, రామాయపట్నం లేదా మూలపాడు వద్ద ఈ భారీ ప్రాజెక్టుకు అవసరమైన భూమి కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. త్వరగా సవివరమైన ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకుని తనను కలవాలని సీఎం చంద్రబాబు నాయుడు బీపీసీఎల్ ఉన్నతాధికారులను కోరారు. దీంతో వచ్చే ఆరేడు నెలల్లో ఈ ప్రాజెక్టు ఏర్పాటుపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## చిన్న డిపాజిట్లకే పెద్దపీట: కెనరాబ్యాంక్ ఎండీ సత్యనారాయణరాజు



న్యూఢిల్లీ: కరెంట్ అకౌంట్, సేవింగ్స్ ఖాతాలు (కాసా) లేదా చిన్న డిపాజిట్ల సమీకరణకే బ్యాంక్ ప్రాధాన్యం ఇస్తున్నదని, ఈ దిశగా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని కెనరాబ్యాంక్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె.సత్యనారాయణ రాజు అన్నారు. ప్రస్తుతం తమ కాసా నిష్పత్తి మొత్తం డిపాజిట్లలో 31 శాతం ఉన్నదని, ఈ ఆర్థిక సంవత్సరాంతానికి దాన్ని 33 శాతం చేర్చాలనుకుంటున్నామని ఆయన చెప్పారు. జూన్ నుంచి జూన్‌తో పోల్చితే ఏడాది కాలంలో సేవింగ్స్ ఖాతాల నిల్వ రూ.12,000 కోట్లు పెరిగిందని రాజు చెప్పారు. అత్యంత ప్రత్యేకమైన, కొత్త రకం ఉత్పత్తులు ప్రవేశపెట్టడం ద్వారా వ్యక్తిగత ఎస్‌బి ఖాతాలు పెంచుకునే కృషిని బ్యాంక్ కొనసాగిస్తుందని ఆయన వెల్లడించారు.

## 2030 నాటికి లక్ష మంది కంపెనీ సెక్రటరీలు అవసరం

న్యూఢిల్లీ: భారత్‌కు 2030 నాటికి లక్ష మంది కంపెనీ సెక్రటరీలు (సీఎస్) అవసరమని ఐసీఎస్ఐ ప్రెసిడెంట్ బి.నరసింహన్ అన్నారు. ప్రస్తుతం దేశంలో 73,000 మంది కంపెనీ సెక్రటరీలుండగా 12 వేల మంది మాత్రం ప్రాక్టీస్ చేస్తున్నారని ఆయన చెప్పారు. కంపెనీలు చట్టబద్ధమైన నిబంధనలన్నింటికీ కట్టుబడేలా చూడడంలో సీఎస్‌ల పాత్ర కీలకమని తెలిపారు. దేశం సాధిస్తున్న వృద్ధిని పరిగణనలోకి తీసుకుంటే రాబోయే కాలంలో సీఎస్‌ల పాత్ర మరింతగా పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తాము సగటున సంవత్సరానికి 2500 మందికి సభ్యత్వం అందిస్తున్నామని చెప్పారు.

## ఫాక్స్‌కాన్ నుంచి త్వరలో విద్యుత్ వాహనాలు

త్వరలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి ప్లాంట్‌పైనా నిర్ణయం



శ్రీపెరంబుదూర్ (తమిళనాడు): కాంట్రాక్టు పద్ధతిలో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తయారు చేసే తైవాన్ కంపెనీ 'ఫాక్స్‌కాన్' భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరించనుంది. ఇందులో భాగంగా విద్యుత్ వాహనాల (ఈవీ) రంగంలోకి ప్రవేశిస్తోంది. త్వరలోనే ఈ ఈ ప్రాజెక్టులో ఉత్పత్తి ప్రారంభమవుతుందని ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న కంపెనీ చైర్మన్ యంగ్ లీ చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి ప్లాంట్ ఏర్పాటుపైనా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ ప్లాంటు కోసం తమిళనాడు, కర్ణాటకతో పాటు తెలంగాణ కూడా పోటీపడుతోంది. తమ రాష్ట్రంలో ఈ ప్లాంటు ఏర్పాటు చేస్తే పలు రాయితీలు కల్పిస్తామని ఇటీవల తమను కలిసిన లీకి ఈ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హామీ ఇచ్చారు. దీంతో ఫాక్స్‌కాన్ ఈ ప్లాంట్ ఎక్కడ ఏర్పాటు చేస్తుందన్న ఉత్కంఠత నెలకొంది.

**తైవాన్‌లోనే తొలి ప్లాంట్:** ఫాక్స్‌కాన్ ఇటీవలే తైవాన్‌లో ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఇ-బస్సుల నుంచి ఈ బ్యాటరీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో ఈ తరహా ప్లాంటు తమ దేశంలోనూ ఏర్పాటు చేయాలని ఇండోనేషియా ప్రభుత్వం ఫాక్స్‌కాన్‌ను కోరింది. ఇపుడు భారత్‌లోనూ ఈ తరహా ప్లాంటు ఏర్పాటుకు కంపెనీ సిద్ధమవుతోంది. దేశంలో వేగంగా పెరుగుతున్న ఈవీల అమ్మకాలతో ఈ బ్యాటరీ ఇంధన స్టోరేజి యూనిట్లకు మంచి డిమాండ్ ఉంటుందని భావిస్తోంది.

## 24800 పైన బుల్లిష్

(ఆగస్టు 19-23 తేదీల మధ్య వారాని



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అనలిస్ట్

గత వారం నిఫ్టీ : 24541 (+173)

నిఫ్టీ గత వారం 24531-24100 పాయింట్ల మధ్యన కదలాడి 173 పాయింట్ల లాభంతో 24541 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24800 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

● 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24263, 24287, 24435, 24493 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24800 బ్రేక్‌డౌన్ స్థాయి : 24250

నిరోధ స్థాయిలు: 24730, 24830, 24930 (24630 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 24330, 24230, 24130 (24430 దిగువన బేరిష్)

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 19వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 450 | విజయవాడ | 496 |
| వరంగల్ | 452 | గోదావరి | 501 |
| చిత్తూరు | 508 | విశాఖపట్నం | 505 |
| | | డజను గుడ్లు రూ. 66 | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 105 | విజయవాడ | 113 |
| వరంగల్ | 105 | గుంటూరు | 113 |
| కరీంనగర్ | 105 | ఒంగోలు | 113 |
| మహబూబ్‌నగర్ | 105 | చిత్తూరు | 114 |
| కర్నూలు | 105 | నెల్లూరు | 114 |
| విశాఖపట్నం | 109 | అనంతపురం | 113 |
| గోదావరి | 113 | | |

## మరింత ముందుకే....

సానుకూల అంతర్జాతీయ సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్ ఈ వారం మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికా కేంద్ర బ్యాంకు 'ఫెడ్' వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, ఆ దేశంలో మాంద్యం భయాలు తొలగడం, రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం ఇందుకు దోహదం చేయనున్నాయి. అయితే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల విషయంలో మదుపరులు అప్రమత్తంగా ఉండక తప్పదు. నిఫ్టీకి ఈ వారం 24450 పాయింట్ల వద్ద మద్దతు, 24650 వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది.

### ఈ వారం స్టాక్ రికమండేషన్స్

**ఎంసీఎక్స్:** దీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో ఉన్న ఈ షేర్లలో గత వారం చక్కని కన్సాలిడేషన్ జరిగింది. ఈ షేర్లు కీలకమైన రూ.4,300 మద్దతు స్థాయిని అధిగమించాయి. రిలెటివ్ స్ట్రెంత్, కదలిక, డెలివరీ వాల్యూమ్స్ గణనీయంగా పెరుగుతున్నాయి. శుక్రవారం 5.86 శాతం లాభంతో రూ.4,630 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.4,680/4,755 టార్గెట్‌తో రూ.4,600 వద్ద ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.4,545ని గట్టి స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

**వెల్‌స్పన్ కార్ప్:** ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు జీవిత కాల గరిష్ఠ స్థాయిలో ట్రేడవుతున్నాయి. ప్రైస్ యాక్షన్ నిలకడగా ఉంది. ఈ కౌంటర్లో కన్సాలిడేషన్ కూడా ముగిసింది. గత వారం ఈ కంపెనీ షేర్లు 6.93 శాతం లాభంతో రూ.706 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.775/825 టార్గెట్‌తో ఈ కౌంటర్లో రూ.690/700 శ్రేణిలో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.660ని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**బిర్లా సాఫ్ట్:** గత ఆరు నెలలుగా అండర్ పర్ఫార్మెన్స్ చేస్తున్న ఈ షేర్లకు రూ.600 వద్ద కీలక మద్దతు లభించింది. ఐటీ షేర్లకు ఫ్రెష్ డిమాండ్ నేపథ్యంలో మదుపరుల చూపు మళ్లీ ఈ కౌంటర్‌పై పడింది. గత వారం ఈ కంపెనీ షేర్లు 6.12 శాతం లాభంతో రూ.600 వద్ద ముగిశాయి. మూమెంటం ఇన్వెస్టర్లు రూ.590/575 శ్రేణిలో రూ.660/750 టార్గెట్‌తో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.555ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**డీఎల్ఎఫ్ :** రేటింగ్ తర్వాత అప్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కంపెనీ షేర్లలో ప్రస్తుతం కన్సాలిడేషన్ జరుగుతోంది. రిలెటివ్ స్ట్రెంత్, వాల్యూమ్స్ గణనీయంగా పెరుగుతున్నాయి. చివరి త్రైమాసికం అంచనాలను అందుకోనప్పటికీ ఈపీఎస్ బాగుంది. కీలకమైన రూ.820 వద్ద మద్దతు లభించడంతో మదుపరుల చూపు మళ్లీ ఈ కంపెనీ షేర్లపై పడింది. గత వారం ఈ కంపెనీ షేరు 5.51 శాతం లాభంతో రూ.866 వద్ద ముగిశాయి. రూ.960/1020 టార్గెట్‌తో మదుపరులు రూ.850 వద్ద ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.800ని స్ట్రిక్ట్ స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**హిందూస్తాన్ కాపర్:** ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు స్వల్పకాల డౌన్‌ట్రెండ్‌లో ఉన్నాయి. తాజా త్రైమాసిక ఆర్థిక ఫలితాల తర్వాత ఈ కౌంటర్లో కొంత కదలిక కనిపిస్తోంది. ఈ కంపెనీ షేర్లు గత వారం 5.12 శాతం లాభంతో రూ.313 వద్ద ముగిశాయి. మదుపరులు ఈ కౌంటర్లో రూ.345/365 టార్గెట్‌తో రూ.300 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.289ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.




- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

## 24500 పైన పటిష్ఠం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో కీలక స్థాయి 24500 వద్ద విఫలమై బలమైన కరెక్షన్‌లో ప్రవేశించినా 24100 వద్ద కోలుకుని శుక్రవారం బలమైన ర్యాలీలో 400 పాయింట్ల మేరకు లాభపడింది. మొత్తానికి 175 పాయింట్లు లాభపడి వారం గరిష్ఠ స్థాయి 24540 వద్ద ముగియడం సానుకూల సంకేతం. ఈ రికవరీతో తక్షణ డౌన్‌ట్రెండ్ ప్రమాదం నుంచి బయటపడిందని భావించవచ్చు. కాగా గత వారం మిడ్ క్యాప్-100 సూచీ 480 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 26 పాయింట్లు లాభంతో ముగిశాయి. మార్కెట్ ఈ వారం పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో ఇటీవల సాధించిన గరిష్ఠ స్థాయిల్లో మళ్లీ పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది.

**బుల్లిష్ స్థాయిలు:** గతంలో ఏర్పడిన టాప్ 24500 వద్ద బ్రేకౌట్ సాధించినందు వల్ల పుల్‌బ్యాక్ రియాక్షన్‌కు ఆస్కారం ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ ప్రధాన నిరోధం 24700 కన్నా పైన నిలదొక్కుకోవాల్సి ఉంది. తదుపరి ప్రధాన నిరోధ స్థాయిలు 24850, 25100.

**బేరిష్ స్థాయిలు:** మైనర్ మద్దతు స్థాయి 24400 వద్ద విఫలమైతే బలహీనతకు ఆస్కారం ఉంటుంది. ప్రధాన మద్దతు స్థాయి 24200. శుక్రవారం ఏర్పడిన బాటమ్ ఇదే. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయి 24000.

**బ్యాంక్ నిఫ్టీ:** ఈ సూచీ కూడా గత వారం కరెక్షన్‌లో 800 పాయింట్ల మేరకు దిగజారినా రికవరీ సాధించి 32 పాయింట్ల స్వల్ప లాభంతో 50500 వద్ద ముగిసింది. ప్రధాన నిరోధం 51000. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలహీనపడి మైనర్ మద్దతు స్థాయి 50300 కన్నా దిగజారితే బలహీనత సంకేతం ఇస్తుంది.

**పాటర్న్:** మార్కెట్ ప్రస్తుతం 25 డిఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. 24400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక అప్రమత్తతను సూచిస్తుంది.

**టైమ్:** ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

| సోమవారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం | 24,610, 24,660 |
| మద్దతు | 24,460, 24,400 |

# అమెరికాలో ప్రకాశం టెకీ మృతి

- కాలిఫోర్నియా బీచ్‌లో ఈతకు వెళ్లి దుర్మరణం
- 20 నెలల క్రితం యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం
- 6 నెలల క్రితం భార్య, కుమారుడు కూడా అమెరికాకు
- మృతదేహాన్ని స్వగ్రామానికి తెచ్చేందుకు ఏర్పాట్లు: టీడీపీ


బుచ్చిబాబు (ఫైల్)

ముండ్లమూరు, ఆగస్టు 18: ప్రకాశం జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అమెరికాలోని ఓ బీచ్‌లో ఈతకు దిగి ప్రాణాలు కోల్పోయారు. ముండ్లమూరుకు చెందిన దద్దాల కోటేశ్వరరావు, కోటేశ్వరమ్మల ఏకైక కుమారుడు దద్దాల బుచ్చిబాబు(40) ఎంసీఏ పూర్తి చేశారు. 20 నెలల క్రితం ఆయనకు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో అక్కడికి వెళ్లారు. ఆరు నెలల క్రితం భార్య, ఐదేళ్ల కుమారుడు నిఖిల్ అద్వైత్ చౌదరి కూడా అమెరికాకు వెళ్లారు. వీరు ముగ్గురూ శనివారం కాలిఫోర్నియాలోని బీచ్‌కి వెళ్లి కొద్దిసేపు సరదాగా సముద్రంలో స్నానం చేశారు. సెల్ఫీలు దిగారు. ముగ్గురూ ఒడ్డుకు వచ్చిన తర్వాత బుచ్చిబాబు ఒంటరిగా ఈతకు దిగి నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ముండ్లమూరులోని బుచ్చిబాబు తల్లిదండ్రులకు ఆదివారం ఈ సమాచారం అందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి.. బుచ్చిబాబు తండ్రి కోటేశ్వరరావును ఫోన్‌లో పరామర్శించారు. రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లతో మాట్లాడి త్వరగా మృతదేహాన్ని ముండ్లమూరుకు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

### పరువు కోసమే పోరాడుతున్నా
# ఆస్తులేమీ అడగడం లేదు

- అనుమానాస్పద వ్యక్తుల సంచారం పెరిగింది: దువ్వాడ వాణి

టెక్కలి, ఆగస్టు 18: పరువు కోసమే పోరాటం చేస్తున్నానని.. తానేమీ ఆస్తులు అడగడం లేదని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సతీమణి, జడ్పీటీసీ దువ్వాడ వాణి స్పష్టంచేశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో శ్రీనివాస్ నివాసం వద్ద ఆమె చేస్తున్న న్యాయపోరాట దీక్ష.. ఆదివారానికి 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. శనివారం రాత్రి 10 గంటల తరువాత రోడ్డుపై పది మంది యువకులు అనుమానాస్పదంగా వాహనాలపై తిరుగుతుండటంపై ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం అర్ధరాత్రి 2 గంటల తరువాత దివ్వెల మాధురి ఈ ఇంట్లోకి వచ్చిందని అనుమానాలున్నాయని, సీసీ ఫుటేజీలు పరిశీలించి ఇంటిలో తనిఖీలు చేపట్టాలని పోలీసులను కోరామని తెలిపారు. ఈ వ్యవహారంపై సోమవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానని వాణి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా దువ్వాడ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాధురి ఆదివారం సెల్ఫీ వీడియో విడుదల చేశారు. 'మీ అందరి అండతో ధైర్యంగా ఉన్నాను.. ఆరోగ్య సమస్య వచ్చింది. తలలో రక్తం గడ్డ కట్టింది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు. పది రోజుల తరువాత లైవ్‌లోకి వస్తా'ను అని ఆమె పేర్కొన్నారు.


గిరిజన గ్రామంలో వరినాట్లు వేస్తున్న పార్వతీపురం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

## వరినాట్లు వేసిన 'మన్యం' కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలో ఆదివారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పర్యటించారు. ఈ సందర్భంగా గొరడ గిరిజన గ్రామంలో రైతులతో కలిసి పొలంలో వరి నాట్లు వేశారు. అనంతరం జీవామృతం తయారీలో భాగస్వాములయ్యారు. సుమారు 20 నిమిషాల పాటు అక్కడే ఉన్న ఆయన గిరిజన రైతులతో మాట్లాడి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయం అంటే తనకెంతో ఇష్టమని, జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. గిరిజన రైతులు రసాయన ఎరువులకు దూరంగా ఉండాలని సూచించారు. పండించిన పంటలకు ఆన్‌లైన్ ద్వారా మార్కెట్ సదుపాయం కల్పించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. సేంద్రియ పద్ధతిలో పసుపు, ముల్లంగి, చింతపండు తదితరాలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు.

# తీరు మారిన 'నైరుతి'

(మొదటి పేజీ తరువాయి)

వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రుతుపవనాల సీజన్‌లో ఆగస్టును అత్యంత కీలకమైన నెలగా పరిగణిస్తారు. ఖరీఫ్ పంటలకు దోహదం చేసేలా ముసురుపట్టి వర్షాలు కురవాలి. కానీ, ప్రస్తుతం వేసవి కాలమా అనే సందేహం కలిగేలా వాతావరణం ఉంటోంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. మిగులు వర్షపాతం నమోదైనా దేశంలోని అనేక ప్రాంతాల్లో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. గత రెండున్నర నెలల కాలాన్ని పరికించి చూస్తే వాతావరణంలో అనేక మార్పులు వచ్చాయని స్పష్టమవుతుంది. వర్షాలకు భూమి, ఆకాశం, సముద్రాలు సహకరించాలి. అంటే మూడింట మధ్య ఏర్పడే తేడాల ప్రభావంతో వర్షాలు కురవాలి. కానీ, ఈ మూడూ వేడెక్కడంతో సమతుల్యత తప్పింది. నైరుతి సీజన్‌లో బంగాళాఖాతంలో సగటున ప్రతి వారం ఒక అల్పపీడనం ఏర్పడాలి. సీజన్ మొత్తం ఆరేడు వాయుగుండాలు రావాలి. కానీ, పది రోజులక్రితం భూమిపై అల్పపీడనం ఏర్పడగా, మళ్లీ శుక్రవారం వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం వచ్చింది. ఈ నెలలో గత 16 రోజుల్లో రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వర్షాభావం కొనసాగుతుండడం ఖరీఫ్ సాగుపై ప్రభావం చూపింది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకునే నైరుతి రుతుపవనాల తీరు మారిందని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### వేసవి ఛాయలు..

రాష్ట్రంతోపాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో ఆగస్టులో వేసవి ఛాయలు నెలకొన్నాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత, భరించలేని ఉక్కపోత ఉంటున్నాయి. అసలైతే ముసురు వాతావరణంతో ఉష్ణోగ్రతలు కనీస స్థాయికి పడిపోవాలి. కానీ, గత 16 రోజుల్లో రెండు, మూడు రోజుల తప్ప ఎక్కువ రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నాలుగైదు రోజులు దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో నమోదయ్యాయి. రానురాను వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయని నిపుణులు చెబుతున్న నేపథ్యంలో గతేడాది కంటే ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో తేడా మరింత ఎక్కువగా కనిపిస్తోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇది పంటలపై ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. రోజుల తరబడి పొడి వాతావరణం నెలకొనడంతో పంటల ఎదుగుదల, మనుగడ ఇబ్బందిగా మారుతుందని విశ్లేషిస్తున్నారు.

### రాష్ట్రంలోని 54 మండలాల్లో వర్షాభావం..

నైరుతి సీజన్‌లో జూన్ ఒకటి నుంచి శుక్రవారం వరకు రాష్ట్రంలోని 54 మండలాల్లో వర్షాభావం నెలకొంది. 242 మండలాల్లో మిగులు వర్షాలు, 328 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మొత్తం 670 మండలాల్లో 345.9 మి.మీ.కుగాను 403.9 మి.మీ(సాధారణం కంటే 16.7 శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. కడప జిల్లాలో 10, శ్రీకాకుళంలో 7, ఒంగోలులో 6, పల్నాడు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో నాలుగేసి మండలాల్లో వర్షాభావం కొనసాగుతోంది. కొన్ని జిల్లాల్లో ఒకటి నుంచి మూడు మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఆగస్టులో గడచిన 16 రోజుల్లో మూడు రోజులు తప్ప మిగిలిన 13 రోజుల్లో సాధారణం కంటే 20 నుంచి 80 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. కొన్ని జిల్లాల్లోని కొన్ని మండలాల్లో సాధారణం కంటే చాలా ఎక్కువగా, మరికొన్నిచోట్ల అతి తక్కువ వర్షపాతం నమోదైంది. కొన్ని మండలాల్లో అసలు వర్షాలే కురవలేదు. ఐఎండీ నివేదిక ప్రకారం గతవారం రోజుల్లో అనకాపల్లి, బాపట్ల, గుంటూరు, కృష్ణా, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఎక్కువగా, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, కాకినాడ, కోనసీమ, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో కొంతమేర లోటు వర్షపాతం నమోదైంది. జూలైలో మాత్రమే మంచి వర్షాలు కురిశాయని, నైరుతి ప్రారంభ నెల జూన్‌లో ఎక్కువ రోజులు, అలాగే, ఆగస్టు తొలి పక్షంలో ఎండ తీవ్రత, ఉక్కపోతతో వర్షాభావం నెలకొందని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

### నీరు నిల్వ చేసే విధానం తేవాలి..

పండిన పంటను ఏడాదికి సరిపడేలా రైతులు ఇళ్లలో, గాదెల్లో భద్రపరుచుకుంటారు. ఇదే విధానం ఇప్పుడు నీటి నిల్వ కోసం అమలుచేయాల్సి అవసరం ఉందని వాతావరణ శాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ఎందుకంటే నాలుగు నెలల నైరుతి సీజన్‌లో వర్షాలు కురిసే రోజుల సంఖ్య తగ్గుతోందని, ఒకవేళ కురిసినా భారీవర్షాలే తప్ప చిరుజల్లుల నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే తీరు ఇప్పుడు మాయమైందని పేర్కొన్నారు. పడిన వర్షం నీటిని ఒడిసిపట్టి ప్రతి గ్రామంలో ఒకచోట నిల్వ చేసుకునేలా చెరువులు, కుంటల ఏర్పాటు తప్పనిసరి చేయాల్సిన పరిస్థితి వచ్చిందని, లేకపోతే నీటికి కటకట తప్పదని హెచ్చరించారు.

> **వేడెక్కిపోతున్న సముద్రం, భూమి, ఉపరితలం..**
>
> రుతుపవనాల సీజన్‌లో ఒక వారం వర్షాలు కురిస్తే, మరో వారం కొంత వరకు పొడి వాతావరణం ఉంటుంది. అంటే వర్షం పడిన తరువాత సముద్రంలో తిరిగి తేమ తయారీకి వారం పడుతుంది. కానీ, ఇప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చింది. భూమి, సముద్రం, వాతావరణం మూడూ కూడా వేడెక్కిపోతున్నాయి. సాధారణంగా భూమి వేడెక్కినప్పుడు సముద్రం చల్లగా ఉంటే మేఘాలు ఏర్పడి వర్షాలు కురుస్తాయి. ఈ మూడు వేడెక్కడంతో పరిస్థితి భిన్నంగా తయారైంది. ఒకవేళ మేఘాలు ఆవరించినా అవి ముక్కలై ఒక వైపు భారీ వర్షం కురిస్తే మరోవైపు పొడి వాతావరణం నెలకొంటుంది. ఈ ఏడాది కేరళ, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, అసోం, హిమాచల్‌ప్రదేశ్‌లలో వరదలు సంభవించగా మరికొన్నిచోట్ల సాధారణ వర్షపాతం లేదా అనావృష్టి కొనసాగుతోంది. చివరకు బంగాళాఖాతంలో అల్పపీడనాలు, వాయుగుండాలు తక్కువగా ఏర్పడుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతోనే రుతుపవనాల కాలంలో అతివృష్టి లేదా అనావృష్టి పరిస్థితులు నెలకొంటున్నాయి.
>
> -ఆచార్య సునీత, ఏయూ ఓషనోగ్రఫీ, మెట్రాలజీ విభాగాధిపతి

## శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు


తిరుమల ఆలయం ముందు జస్టిస్ జయసూర్య, జస్టిస్ గోపాలకృష్ణారావు

తిరుమల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు ఆదివారం దర్శించుకున్నారు. జస్టిస్ జయసూర్య, జస్టిస్ గోపాల కృష్ణారావు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వారికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

## ఉక్కపోత.. కరెంటు మోత!

- రాష్ట్రంలో 228.94 మిలియన్ యూనిట్ల డిమాండ్
- 20 కోట్లతో బహిరంగ మార్కెట్లో 38.744 ఎంయూ కొనుగోలు

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వానాకాలంలోనూ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఎండ వేడి పెరిగిపోవడంతో విద్యుత్ వాడకం కూడా పెరిగిపోతోంది. ఉక్కపోతకు ఏసీలు(ఎయిర్ కండీషన్లు) వాడకపోతే ఉండలేని పరిస్థితి నెలకొంది. శనివారం ఏకంగా 228.941 మిలియన్ యూనిట్ల(ఎంయూ) విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. 190.197 ఎంయూ విద్యుత్ మాత్రమే అందుబాటులో ఉండటంతో డిస్కమ్‌లు బహిరంగ మార్కెట్లో సగటున యూనిట్‌కు రూ.6.503 చొప్పున 38.744 ఎంయూ విద్యుత్‌ను రూ.20.806 కోట్లకు కొనుగోలు చేశాయి. కాగా, పొడి వాతావరణంతో రాష్ట్రంలో సోలార్ విద్యుత్ 18.833 ఎంయూ, పవన విద్యుత్ 4.025 ఎంయూ, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్ల ద్వారా 38.001 ఎంయూ, ఏపీజెన్కో సోలార్ ద్వారా 2.647 ఎంయూ, ఏపీ జెన్కో హైడల్ 25.304 ఎంయూ, ఏపీ జెన్కో థర్మల్ 74.215 ఎంయూ ఉత్పత్తి అవుతోంది.

## గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం చేయండి: షర్మిల

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసిన అభ్యర్థులకు న్యాయం చేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోరారు. గ్రూప్-2 డిప్యూటీ డీఈవో పోస్టుల ఎంపికలో అనుసరిస్తున్నట్లుగానే.. గ్రూప్-1లోనూ 1:100 విధానాన్ని అనుసరించాలని ఆదివారం ఎక్స్ వేదికగా ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబును అభ్యర్థించారు. గ్రూప్-2, గ్రూప్-1 పరీక్షలకు సమయం తక్కువగా ఉందని, కొత్త సిలబస్ అంటూ పాత సిలబస్‌లోనే పరీక్షలు నిర్వహించడంతో అభ్యర్థులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని తెలిపారు. అభ్యర్థుల జీవితాలకు సంబంధించిన అంశమైనందున సానుభూతితో పరిశీలించి న్యాయం చేయాలని చంద్రబాబును కోరారు.

## 'ప్రత్యేక హోదా'ను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

- చంద్రబాబు వచ్చినా అవినీతిపరులపై చర్యల్లేవు
- ఇంకా వైసీపీ ప్రభుత్వమే నడుస్తున్నట్లుంది
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యలు


కర్నూలులో మాట్లాడుతున్న నారాయణ

కర్నూలు(కల్చరల్), అనంతపురం విద్య ఆగస్టు 18: ప్రత్యేక హోదా అనేది రాజ్యాంగపరమైన నిబంధన అని, దాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అలా చేయడం వల్ల ఏ ప్రభుత్వం వచ్చినా దాన్ని మార్చేందుకు వీలుండదన్నారు. ఆదివారం కర్నూలులో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక హోదా అంశాన్ని పట్టించుకోలేని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రత్యేక హోదా అంశంపై చొరవ తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.15వేల కోట్లు బడ్జెట్ ప్రకటించినా అది అప్పు రూపంలోనే ఇచ్చిందని, అందుకు ఉప్పొంగి పోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని, మోదీకి చంద్రబాబు అవసరం ఉండడం వల్ల ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం మారినా అవినీతిపరులపై చర్యలు లేవని, చంద్రబాబు అధికారంలో ఉన్నా వైసీపీ ప్రభుత్వమే నడుస్తున్నట్లు ఉందని విమర్శించారు. అధికార మార్పిడితోపాటు అవినీతి మార్పిడి జరుగుతోందని, ఉద్యోగులు మారడం లేదని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై సెప్టెంబరు1 నుంచి 7 వరకు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

### మోదీ చరిత్రహీనుడిగా నిలిచిపోతారు

ప్రజావ్యతిరేక విధానాలతో ప్రధాని మోదీ చరిత్రహీనుడిగా నిలిచిపోతారంటూ నారాయణ మండిపడ్డారు. అనంతపురంలో సీపీఐ సీనియర్ నాయకుడు ఎంవీ రమణ సంస్మరణ సభలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దేశాన్ని మోదీ ఫాసిజంలోకి తీసుకెళుతోందన్నారు. ధరలు విపరీతంగా పెంచి, సామాన్యుల నడ్డి విరిచారంటూ మండిపడ్డారు. కార్పొరేట్‌కు కొమ్ముకాసే మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాల్సిన చరిత్రాత్మక కర్తవ్యం ప్రజలపై ఉందన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## భారీగా వైసీపీ భూఆక్రమణలు

- మదనపల్లెలో ఫైళ్ల దహనం ఉదంతమే నిదర్శనం
- అగ్రిగోల్డ్ భూములనూ అమ్మేసిన వైసీపీ నేతలు: సీపీఐ రామకృష్ణ


అగ్రిగోల్డ్ వెంచర్‌ను పరిశీలిస్తున్న రామకృష్ణ

కూడేరు, ఆగస్టు 18: రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ భూములను గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు బినామీ పేర్లతో ఆక్రమించుకుని, అమ్ముకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం కమ్మూరు గ్రామం వద్ద గల అగ్రిగోల్డ్ వెంచర్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. అక్కడే నిరసన తెలిపారు. రామకృష్ణ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 23 వేల ఎకరాల అగ్రిగోల్డ్ ఆస్తులున్నాయన్నారు. వేల కోట్ల విలువైన ఆస్తులున్నా... బాధితులకు న్యాయం చేయలేదన్నారు. అగ్రిగోల్డ్ భూములను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని, వాటిని అమ్మి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లాలో మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు అగ్రిగోల్డ్ భూమును కొనుగోలు చేసి, జైలుకెళ్లారని గుర్తుచేశారు. బత్తలపల్లి మండలంలో రూ.60కోట్ల విలువైన 20 ఎకరాల మంతం భూములను బినామీ పేర్లతో ఆక్రమించుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూఆక్రమణలు పెద్దఎత్తున జరిగాయని, మదనపల్లెలో ఫైళ్ల దహనం ఉదంతమే ఇందుకు నిదర్శనమన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సైతం ఫైళ్లను దహనం చేశారన్నారు. వీటన్నింటిపై ఈనెల 28న విజయవాడలో రాష్ట్ర భూబాధితుల సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బాధితులందరూ హాజరవ్వాలన్నారు. వారి నుంచి వచ్చిన వినతులను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## కేరళ కబేళాకు తరలిస్తున్న గేదెలు స్వాధీనం

- ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకొస్తుండగా తమిళనాడులో పట్టివేత

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి కేరళ రాష్ట్రానికి తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లా మీదుగా లారీలో తరలిస్తున్న 45 గేదెలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేరళలోని కబేళాకు ఆంధ్రప్రదేశ్ నుంచి గేదెలు తరలిస్తున్నట్టు తిరువళ్లూర్‌లోని ప్రాణుల సంక్షేమ ఫోరం సభ్యులకు అందిన సమాచారంతో వారు అచ్చరపాక్కం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శరవణన్ నేతృత్వంలోని పోలీసుల బృందం ఆతూర్ టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టింది. ఆ సమయంలో వచ్చిన కంటైనర్ లారీని ఆపి తనిఖీ చేశారు. అందులో ఉన్న 45 గేదెలను నిబంధనలకు విరుద్ధంగా కేరళకు తరలిస్తున్నట్టు గుర్తించారు. పశుసంవర్థక శాఖ వైద్యులు కార్తిక్, పోలీసులు స్వాధీనం చేసుకున్న గేదెలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం గేదెలను మరమలైనగర్‌లో ఉన్న శరణాలయానికి తరలించారు. కంటైనర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## జ్యుడీషియల్ అధికారుల రాష్ట్ర అధ్యక్షుడిగా చక్రపాణి ఎన్నిక


జి.చక్రపాణి

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జ్యుడీషియల్ అధికారుల రాష్ట్ర అధ్యక్షుడిగా జి.చక్రపాణి ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం గుంటూరు ఫ్యామిలీ కోర్టులో జడ్జిగా సేవలందిస్తున్నారు. రాష్ట్ర విభజన తరువాత ఏపీ జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. ఈ నెల 14న ఎన్నికలు నిర్వహించారు. ఆదివారం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా టి.లీలావతి, కె.శైలజ, జె.శ్రీనివాసరావు గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్.రమేష్ నాయుడు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.ప్రదీప్‌కుమార్, ఎ.కృష్ణప్రసాద్, జి.కార్తిక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గసభ్యులుగా బి.లీలా వెంకటశేషాద్రి, ఎస్‌పీడీ వెన్నెల, బి.రాధారాణి, డాక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబు ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది విరూపాక్ష దత్తాత్రేయ గౌడ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

## జీపీలుగా మరో 10 మంది నియామకం

- ఇప్పటివరకు నియమించిన ఎస్‌జీపీలు, జీపీలలో 9 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు మరో 10మంది ప్రభుత్వ న్యాయవాదులను నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి(ఎఫ్ఏసీ) వి.సునీత ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాదులు కొచ్చిరి రామారావు, పుల్లకూర నాగరాజు, బి.రామకృష్ణ నాయక్, పతివాడ రామకృష్ణ, వై.బాలాజీ, సుష్మ యాగంటి, ఎ.జయంతి, జి.రామచంద్రరావు, బి.రాజేశ్వర్ రెడ్డి, తోట శ్రీనివాస రాయలు జీపీలుగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇద్దరు ఎస్‌జీపీలు, 16 మంది జీపీల నియామకం జరిగింది. వీరిలో 9 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందినవారు ఉండటం గమనార్హం. మరోవైపు ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఓ బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని ప్రభుత్వం మొదటిసారి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. ఈ నియామకాల ప్రక్రియను పరిశీలిస్తే బలహీనవర్గాలకు చెందిన న్యాయవాదులకు సమున్నత అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం సంకల్పించినట్లు అర్థమవుతోంది. టీడీపీని స్థాపించిన దగ్గర నుంచి ఉన్నత పదవులలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఆ పార్టీ ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికీ అదే ఒరవడిని కొనసాగిస్తోంది.

## 15 వేల మంది టీచర్ల సర్దుబాటు!

- అంచనా వేసిన పాఠశాల విద్యాశాఖ
- ఎస్జీటీలు 4,922 మంది అవసరం.. ఇంకా 5,513 మంది టీచర్ల మిగులు
- స్కూల్ అసిస్టెంట్లు 2,299 మంది కొరత

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పని సర్దుబాటు అంశం కొలిక్కి వచ్చింది. సుమారు 15వేల మంది టీచర్లను సర్దుబాటు విధానంలో ఇతర పాఠశాలలకు పంపనున్నారు. ఈ మేరకు ఈ నెల 16 నాటికి బడుల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాల విద్యాశాఖ టీచర్ల అవసరాన్ని అంచనా వేసింది. ప్రాథమిక పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు భారీగా మిగిలిపోతుంటే, ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల (సబ్జెక్టు టీచర్లు) కొరత కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల్లో 10,435 మంది టీచర్లు మిగులుగా ఉన్నారు. ఇతర పాఠశాలల్లో 4,922 మంది అవసరముంది. దీంతో ఇంకా 5,513 మంది టీచర్లు మిగిలిపోయే పరిస్థితి ఏర్పడింది. అవసరమైన మేరకే టీచర్ల సర్దుబాటు చేస్తామని పాఠశాల విద్యాశాఖ ప్రకటించినందున సర్దుబాటు అవసరం రాని టీచర్లు ప్రస్తుత స్థానాల్లోనే కొనసాగుతారు. ఇక ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3824 మంది మిగులు ఉంటే, 4,527 మంది అవసరమయ్యారు. అంటే ఇంకా 703 మంది టీచర్లు అవసరం. అయితే వారిలో 164 మంది ఎస్జీటీల అవసరముంది. ఇక ఉన్నత పాఠశాలల్లో 5,447 మంది టీచర్లు మిగులుగా ఉంటే, 7,207 మంది అవసరమవుతున్నారు. అంటే ఇంకా 1,760 మంది స్కూల్ అసిస్టెంట్ల అవసరముంది. మొత్తంగా ఎస్జీటీలుగా భారీగా మిగిలిపోతుంటే, స్కూల్ అసిస్టెంట్ల కొరత కొంతమేర కనిపిస్తోంది. సర్దుబాటుపై పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే మార్గదర్శకాలు జారీచేసింది. బడిలో అత్యంత జూనియర్‌ను మొదటి మిగులు టీచర్‌గా చూపిస్తారు. దీంతో జూనియర్ టీచర్లే ఇప్పుడు సర్దుబాటులో ఇతర బడులకు మారాలి. ఒకవేళ సీనియర్ టీచర్లు స్వచ్ఛందంగా సర్దుబాటులో వెళ్తాం అంటే వారికి అవకాశం కల్పిస్తారు. అలాగే మొదట మేనేజ్‌మెంట్ వారీగా సర్దుబాటు చేస్తారు. అప్పటికీ టీచర్ల అవసరం ఉంటే మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ మేనేజ్‌మెంట్లలో కలిపి సర్దుబాటు చేస్తారు. అలాగే మండలం, డివిజన్ స్థాయిలో తొలుత సర్దుబాటు చేసి, ఆ తర్వాత జిల్లా స్థాయిలో చేస్తారు.

# స్టాప్‌లాగ్ నుంచి లీకేజీ బంద్


హైదరాబాద్ మియాపూర్‌లో కన్నయ్యనాయుడును ఓపెన్ టాపు వాహనంలో ఊరేగిస్తున్న మాతృశ్రీ కాలనీవాసులు

బళ్లారి/కర్నూలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం 19వ గేటు స్థానంలో అమర్చిన స్టాప్‌లాగ్‌లో లీకేజీని ఆదివారం పూర్తిగా అరికట్టారు. సిమెంటు, స్టోన్‌పౌడర్, బెల్లంతో తయారు చేసిన మిశ్రమాన్ని నీరు లీక్‌అవుతున్న చోట అతికించారు. స్టాప్‌లాగ్ గేటులో మొత్తం 5 సెగ్మెంట్లు ఉన్న సంగతి తెలిసిందే. వాటిని బిగించాక వాటి మధ్య నుంచి 500 క్యూసెక్కుల నీరు లీక్ అవుతుండడాన్ని గుర్తించారు. ఇప్పుడు దానికీ అడ్డుకట్ట వేశారు. డ్యాం గేట్లన్నీ మూసివేశారు. పంట కాలువలకు మాత్రం 10,700 క్యూసెక్కులు వదులుతున్నారు. డ్యాంలో ఆదివారం సాయంత్రానికి 73.553 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పూర్తిస్థాయి నీటి మట్టం 1,633 అడుగులకు గాను ప్రస్తుతం 1,624.09 అడుగుల మేర నీరు ఉంది. ఇన్‌ఫ్లో 29,847 క్యూసెక్కులు వస్తోంది. ఎగువ పరివాహక ప్రాంతంలో శనివారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. డ్యాం సమీపంలోని కొప్పళ, విజయనగర జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడ్డాయి. దీంతో మళ్లీ జలాశయం నిండేందుకు ఎలాంటి ఢోకా ఉండదని బోర్డు వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా.. కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం గేటు స్థానంలో స్టాప్‌లాగ్‌ను బిగించి, ఆయకట్టుకు ప్రాణం పోసిన డ్యాం గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడిని తుంగభద్ర బోర్డు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి మాట్లాడుతూ.. ఈతరం ఇంజనీర్లు, యువతకు కన్నయ్యనాయుడు ఆదర్శప్రాయుడని కొనియాడారు. రైతుల పాలిట ఆపద్బాంధవుడిలా వచ్చాడని, అపార అనుభవంతో స్టాప్‌లాగ్ అమర్చి, మూడు రాష్ట్రాల రైతుల ఆశలు నిలిపారని ప్రశంసించారు. అనంతరం హైదరాబాద్ చేరుకున్న కన్నయ్యనాయుడుకు ఘనస్వాగతం లభించింది. మియాపూర్‌లోని మాతృశ్రీ కాలనీ వాసులు ఆయన్ను టాపు లేని వాహనంలో కాలనీ ప్రధాన ద్వారం నుంచి ఇంటి వరకు ఊరేగించి పూలవర్షం కురిపించారు. 'ఓ మహర్షీ.. మీ సేవలు భరత జాతికి ఇంకా కావాలి' అంటూ ఆకాంక్షించారు. వారంరోజులకుపైగా కుటుంబానికి దూరంగా ఉండి.. ఇంత వృద్ధాప్యంలోనూ కన్నయ్య నాయుడు స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ బిగించడంలో కీలక పాత్ర పోషించడం అభినందనీయమనీ, క్రస్ట్ గేట్ల తయారీలో ఆయన ఓ మహర్షి అని కొనియాడారు.

## చైన్‌లింక్ తెగడంతో కాదు.. నీటి ఒత్తిడి తట్టుకోలేకే..!

**క్రస్ట్ గేటు కొట్టుకుపోవడంపై అధికారుల ప్రాథమిక అంచనా**

రాయదుర్గం, ఆగస్టు 18: తుంగభద్ర జలాశయంలో చైన్‌లింక్ తెగిపోవడం వల్ల 19వ క్రస్ట్‌గేటు కొట్టుకుపోలేదని బోర్డు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. నీటి ఒత్తిడికి గేటు చీలిపోవడం వల్లే ఇది జరిగిందని తేల్చారు. గేటు కొట్టుకుపోయే సమయానికి జలాశయం నీటి నిల్వ 105.788 టీఎంసీలుగా ఉంది. ఆ స్థాయిలో నీటిని ఎప్పుడూ నిల్వ చేయలేదు. సాధారణంగా ఇన్‌ఫ్లో అధికంగా ఉన్నప్పుడు వంద టీఎంసీలలోపే నిల్వచేస్తారు. ఇన్‌ఫ్లోకు తగినట్లుగా కొంచెం పెంచి, క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు వదులుతారు. ఈ నెల 10వ తేదీన జలాశయంలో 105.788 టీఎంసీల నీరు నిలువ చేశారు. దీంతో 19వ క్రస్ట్‌గేటు మధ్య భాగంలో తీవ్ర నీటి ఒత్తిడి పెరిగింది. ఆ ఒత్తిడి తట్టుకోకపోవడంతో క్రస్ట్‌గేటు మధ్య భాగంలో ఒక్కసారిగా చీలిక ఏర్పడి పెద్ద శబ్దంతో గేటు నదిలో కొట్టుకుపోయింది. క్రస్ట్‌గేటులో చీలిక ఏర్పడిన అనంతరం ఆ బరువు మోయలేక షట్టర్ ఆపరేషన్ చేసేందుకు వినియోగించే చైన్‌లింక్ తెగిపోయిందని అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. 98 టీఎంసీల నిల్వకు మించి వచ్చే వరద నీటిని ఎప్పటికప్పుడు దిగువకు వదిలేయడం జలాశయానికి శ్రేయస్కరమని పేర్కొన్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితులు ఎదురైన నేపథ్యంలో ఈ విధానాన్ని అనుసరించడంతో ఐదు టీఎంసీల నీరు కోల్పోయారు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లోను అంచనా వేయడంలో బోర్డు అధికారులు విఫలమవడంపై అప్పట్లో కర్ణాటక రైతు సంఘాలు మండిపడ్డాయి. దీంతో ఈ ఏడాది ఆటువంటి పరిస్థితి తలెత్తకూడదని అత్యుత్సాహంతో జలాశయాన్ని పూర్తిస్థాయిలో నింపారు. ఈ కారణంతోనే క్రస్ట్‌గేటు కొట్టుకుపోయిందని బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. పైగా క్రస్ట్‌గేట్లకు నీటి ఒత్తిడిని తట్టుకునే ఫ్రేమ్డ్ యాంగిళ్లు వెనుకవైపు ఉంటాయి. వాటికి వెల్డింగ్‌లు తుప్పుపట్టి ఊడిపోయి ఉంటాయనీ, అప్పుడే ఇటువంటి పరిస్థితులు తలెత్తుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. జలాశయంలో నీటి చేరికకు ముందు క్రస్ట్‌గేట్లను పరిశీలించడంలో విఫలమవడం, దీనికితోడు కాలం తీరిన క్రస్ట్‌గేట్లపై మరింత భారం పడేలా పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయడం బోర్డు అధికారుల తప్పిదంగా విశ్లేషిస్తున్నారు.

# నేడు 15 పరిశ్రమలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

విమానాశ్రయం నుంచి విమానంలో బయల్దేరి 11.30 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడనుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12గంటలకు శ్రీసిటీ వెళ్లనున్నారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌ను సందర్శించి మధ్యాహ్నం 2.30 వరకూ అక్కడే గడపనున్నారు. ఈ సందర్భంగా ఎల్జీ పాలిమర్స్, నైడెక్, ఈప్యాక్ డ్యూరబుల్స్, నియో లింక్ టెలికమ్యూనికేషన్స్, ఓజీ ఇండియా ప్యాకేజింగ్, జెన్ లైనెన్ ఇంటర్నేషనల్, బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్, జేజీఐ మెటల్ కన్‌వెర్ట్స్, త్రినాథ్ ఇండస్ట్రీస్, ఎవర్ ఫైన్ మౌల్డర్స్, ఆటోడేటా, ఎస్‌కే కాంపోనెంట్స్, అడ్మైర్ కేబుల్స్, బాంబో కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్, శ్రీలక్ష్మి ఆగ్రో ఫుడ్స్ తదితర పరిశ్రమలతో పాటు శ్రీసిటీ ఈఎంసీ ఫైర్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. అలాగే బ్లూస్టార్, ఎన్టీసీ ట్రాన్స్‌మిషన్, సిద్ధార్థ లాజిస్టిక్స్, టీఏఎల్ హెల్త్ కేర్, ఏజీపీ సిటీ గ్యాస్, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్, వెర్మైరెన్ రిహాబ్ తదితర పరిశ్రమలతో పాటు హైటెక్ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత డైకిన్, యాక్సెలెంట్ ఫార్మా, ఆర్మ్ వెస్ట్ మిరైటెక్ ఇండియా, క్యాప్ మ్యాన్ ఇండియా, పీఐ ప్రిస్టేజ్ ఇంటర్నేషనల్ తదితర ఐదు పరిశ్రమల ఏర్పాటుకు ఆయా సంస్థల ప్రతినిధులతో ఎంవోయూలు కుదుర్చుకుంటారు. అనంతరం శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల సీఈవోలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. 2014-19 మధ్యకాలంలో శ్రీసిటీ విస్తరణకు... పెట్టుబడుల ఆకర్షణకు నాటి టీడీపీ ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేసింది. 2016లో 4వేల మందికి ఉపాధి లభించేలా రూ.1,200 కోట్లతో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకొంది. 2017లో రూ.600 కోట్లతో పరిశ్రమల ఏర్పాటుకు 13 కంపెనీలతో, 2018లో 14 సంస్థలతో రూ.3,500కోట్ల పెట్టుబడులతో 4వేల ఉద్యోగాలు లభించేలా ఒప్పందాలు కుదిరాయి. ఈసారి కూడా అక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపిస్తోంది. దీనిలో భాగంగానే అక్కడ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాటైంది. శ్రీసిటీ పర్యటన అనంతరం నెల్లూరు జిల్లాలోని సోమశిల ప్రాజెక్టును చంద్రబాబు సందర్శిస్తారు. అనంతరం సాయంత్రం గన్నవరం తిరుగు ప్రయాణం కానున్నారు.

## మేజర్ నాయుడు.. అసామాన్యుడు!

- ఆర్మీ మేజర్ రాంగోపాల్‌కు కీర్తిచక్ర
- దేశ రెండో అత్యున్నత శౌర్య పురస్కారానికి ఎంపికైన మొట్టమొదటి తెలుగు రైతు బిడ్డ



(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

అది 2023, అక్టోబరు 26. ఉదయం 10 గంటలు. జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో.. నియంత్రణ రేఖ వద్ద ఉగ్రవాదులు మాటువేశారన్న సమాచారం అందింది. అంతే! శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆర్మీ మేజర్ మల్లా రాంగోపాల్ నాయుడు నేతృత్వంలో మరాఠా లైట్ ఇన్‌ఫాంట్రీ, 56వ బెటాలియన్, రాష్ట్రీయ రైఫిల్స్ సైనికులు మెరుపు వేగంతో రంగంలోకి దిగారు. కుప్వారాలో మాటువేసిన ఐదుగురు ఉగ్రవాదులను గుర్తించారు. వారిపై విరుచుకుపడ్డారు. కాల్పులు-ఎదురుకాల్పులతో ఆ ప్రాంతం హోరెత్తిపోయింది. ఈ క్రమంలో ఒక టెర్రరిస్టును మేజర్ రాంగోపాల్ మట్టుబెట్టారు. మరొక ఉగ్రవాదిని గాయపర్చారు. అయితే.. గుహలో నక్కిన మరికొందరు ఉగ్రవాదులు.. భారత సైన్యాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి ప్రయత్నించారు. దీనిని గమనించిన మేజర్ నాయుడు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రెప్పపాటు కాలంలో భారత సైన్యాన్ని పెను ప్రమాదం నుంచి తప్పించి.. ఆ గుహ దిశగా పరుగులు పెట్టారు. అక్కడే నక్కిన ఉగ్రవాదులను అంతమొందించే ప్రయత్నం చేశారు. అయితే.. గుహలో నక్కిన ఉగ్రవాది ఆయనపై గ్రెనేడ్లు విసిరాడు. అయినా సరే వెరవకుండా, వాటి నుంచి వెంట్రుకవాసిలో తప్పించుకుంటూ పాయింట్-బ్లాంక్ రేంజ్‌లో ఒక ఉగ్రవాదిని మట్టుబెట్టారు. నాయుడు నేరుగా ఇద్దరు ఉగ్రవాదులను అంతమొందించగా ఆయన టీమ్ మరికొందరిని మట్టుబెట్టింది. దీంతో కుప్వారాలో ఉగ్రమూకల ఆట కట్టించినట్టయింది. దేశానికి పొంచి ఉన్న ప్రమాదాన్ని తప్పించినట్టయింది.

### సాహసానికి శాల్యూట్!

మేజర్ రాంగోపాల్ నాయుడు వ్యూహాత్మక ఆలోచన, ధైర్యసాహసాలతో దళాలను కాపాడుకోవడంలో చేసిన కృషికిగాను ఆయనను ఆర్మీ ఉన్నతాధికారులు ప్రతిష్ఠాత్మక శౌర్య పతకాల్లో రెండోదైన కీర్తిచక్రకు సిఫారసు చేశారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము 4 కీర్తిచక్ర, 18 శౌర్యచక్ర అవార్డులకు ఆమోదం తెలిపారు. కీర్తిచక్రకు ఎంపికైన నలుగురులో మేజర్ రాంగోపాల్ నాయుడు మాత్రమే రాష్ట్రపతి నుంచి స్వయంగా అవార్డును అందుకోనున్నారు. మిగిలిన ముగ్గురికి మరణానంతరం ప్రదానం చేయనున్నారు. కాగా, తెలుగు రాష్ట్రాల్లో కీర్తిచక్రకు ఎంపికైన తొలి మేజర్ నాయుడే కావడం విశేషం.

### రైతు కుటుంబం నుంచి రణరంగం దాకా!

మేజర్ మల్లా రాంగోపాల్ నాయుడుది శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం, నగిరిపెంట గ్రామం. తండ్రి అప్పలనాయుడు సన్నకారు రైతు. తల్లి గృహిణి. చిన్నప్పటి నుంచే రక్షణ దళాల్లో చేరి దేశానికి సేవా చేయాలని రాంగోపాల్ తపించారు. భారత సైన్యంలో చేరడానికి ఆయనకు విజయనగరం జిల్లా కోరుకొండలోని సైనిక స్కూల్ వేదికగా మారింది. అక్కడే ఆయన సెకండరీ ఎడ్యుకేషన్ పూర్తి చేశారు. ఇంటర్ తరువాత 2012లో ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)కి ఎంపికయ్యారు. అక్కడ అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన నాయుడు 2016లో డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలటరీ అకాడమీ(ఐఎంఏ) నుంచి పట్టభద్రుడయ్యారు. ఆయన అత్యుత్తమ ప్రదర్శనకుగాను బంగారు పతకం సొంతమైంది. అనంతరం ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్‌గా చేరారు. 2022 నాటికి మేజర్ స్థానాన్ని సాధించారు.

## నివాసానికే పరిమితమైన సిద్దూ

బెంగళూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అవినీతి వివాదంలో ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతులు ఇవ్వడంతో కర్ణాటక సీఎం సిద్దరామయ్య అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. ఆదివారం ఆయన తన అధికారిక నివాసానికే పరిమితమయ్యారు. ముందుగా ఖరారైన షెడ్యూల్ ప్రకారం సోమవారం బళ్లారి, మంత్రాలయం సందర్శించాల్సి ఉండగా, అనివార్య కారణాలతో రద్దు చేసుకున్నట్టు సీఎం ఆఫీసు అదనపు కార్యదర్శి చిరంజీవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం 4 గంటలకు విధానసౌధలో కాంగ్రెస్ లెజిస్లేచర్ సమావేశానికి సభ్యులను సీఎం ఆహ్వానించారు.

## డెంగీతో కేంద్రమంత్రి సతీమణి మృతి

భువనేశ్వర్, ఆగస్టు 18 : డెంగీతో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జ్యుయల్ ఓరం సతీమణి ఝింగియా ఓరం(58) చనిపోయారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. భువనేశ్వర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె శనివారం రాత్రి మృతి చెందారు. అదే ఆసుపత్రిలో కేంద్రమంత్రి జ్యుయల్ ఓరం కూడా డెంగీతో చికిత్స పొందుతున్నారు. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఝింగియా ఓరం మృతికి సంతాపం తెలిపారు.

## శ్రీవాణి ట్రస్టు ఫైల్సే కాల్చేశారు: కిరణ్ రాయల్

మంగళం, ఆగస్టు 18: తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో శ్రీవాణి ట్రస్టు కుంభకోణం బయటపడుతుందనే ఉద్దేశంతో అందుకు సంబంధించిన ఫైల్స్ కాల్చేశారని జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ ఆరోపించారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీకి చెందిన వారు ఇంకా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్నారని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలకు సంబంధించిన ఫైల్స్‌ను పథకం ప్రకారం దహనం చేస్తున్నారని ఆరోపించారు. దీపం వల్ల ఫైల్స్ కాలిపోవడం ఏంటని ప్రశ్నించారు. త్వరలో మాజీ మంత్రి రోజా అరెస్టు కాబోతున్నారన్నారు. రోజాపై నిఘా పెంచి ఆమె విదేశాలకు పోకుండా, ఆమె పాస్‌పోర్టును అధికారులు స్వాధీనం చేసుకోవాలని కోరారు.

## ఎస్సీ గురుకులాల్లో మునగ మొక్కల పెంపకం

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 190 అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలల ఆవరణలో మునగ, పండ్ల మొక్కలను నాటాలని నిర్ణయించారు. సెప్టెంబరు 4న జాతీయ న్యూట్రిషన్ డే సందర్భంగా ఒక్కో పాఠశాలలో 40 మొక్కలు నాటాలని ఇప్పటికే అన్ని జిల్లాల డ్వామా అధికారులకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ కృష్ణతేజ ఆదేశాలిచ్చారు. గురుకులాల్లో పిల్లలకు న్యూట్రిషన్ కోసం ఉపయోగపడే మునగ మొక్కలతో పాటు ఇతర పండ్ల మొక్కలను నాటాలని ఇప్పటికే ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి ప్రతిపాదనలు పంపడంతో గ్రామీణాభివృద్ధిశాఖ ఆ మేరకు నిర్ణయం తీసుకుని ఆదేశాలిచ్చింది.

# టీఎంసీలో చిచ్చు!

**హత్యాచార ఘటన విషయంలో మమత సర్కారుపై తలోమాట**

- కీలక నేత అభిషేక్ మూగనోము
- మమత ర్యాలీకి యువనేత గైర్హాజరు
- ప్రభుత్వంపై సొంత నేతల విమర్శలు



ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా కోల్‌కతాలోని శ్యామ్ బజార్‌లో వైద్యుల భారీ ర్యాలీ

కోల్‌కతా, ఆగస్టు 18: పశ్చిమబెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)లో పరిస్థితి ఏమంత బాగున్నట్టుగా కనిపించడం లేదు. ఈ నెల 9న వెలుగు చూసిన ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన, అదేసమయంలో ఈ నెల 14న ఆసుపత్రిపై జరిగిన దాడి ఘటనపై సొంత సర్కారు వ్యవహరిస్తున్న తీరును టీఎంసీ నాయకులే విమర్శిస్తున్నారు. అదేవిధంగా ఈ వ్యవహారంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలను మరికొందరు నాయకులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ మూగనోము పాటించడంపైనా నాయకులు విస్తుబోతున్నారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పార్టీ కీలక నాయకుడు కునాల్ ఘోష్.. తప్పులు సరిచేసుకోవాల్సిన అవసరం తమపై ఉందన్నారు. అభిషేక్ మూగనోము సరికాదని, ఆయన స్పందించాలని కునాల్ సూచించారు. రాష్ట్రంలో ఆందోళనల వెనుక కమ్యూనిస్టు, కాంగ్రెస్ నాయకుల కుట్ర ఉందని ఆరోపించారు.



### అభిషేక్ మాటకు విలువలేదా?

హత్యాచార ఘటన తర్వాత ఆర్‌జీ కర్ ఆసుపత్రిపై ఈ నెల 14న జరిగిన దాడిపై అదే రాత్రి అభిషేక్ బెనర్జీ స్పందించారు. ఈ ఘటన వెనుక ఎవరున్నా వదిలి పెట్టరాదని, వెంటనే అరెస్టు చేయాలని ఆయన ఎక్స్ వేదికగా కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను కోరారు. విధ్వంసానికి బాధ్యులైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టరాదని, బాధ్యులను 24గంటల్లోగా అరెస్టు చేయాలని చెప్పారు. అయితే, అభిషేక్ ఆశించింది ఏమీ జరగలేదని, అందుకే ఆయన మౌనంగా ఉన్నారని టీఎంసీలోని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు. టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న అభిషేక్ బెనర్జీకి పార్టీలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నది మరికొందరి వాదన. ఈ ఏడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో టీఎంసీకి ఎదురుదెబ్బ తగిలింది. ఈ నేపథ్యంలో సరిగా పనిచేయని నాయకులపై వేటు వేయాలని అభిషేక్ కోరారు. దీనిని పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా పరిగణించలేదు. ఈ పరిణామాలతో.. తనకు పార్టీలో ప్రాధాన్యం తగ్గుతోందన్న భావనలో బెనర్జీ ఉన్నారని పలువురు నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. పాలనా పరంగా తప్పులు, సీనియర్ నేతల వైఖరి కారణంగానే అభిషేక్ మౌనంగా ఉన్నారని మరికొందరు నాయకులు అంతర్గత చర్చల్లో చెబుతుండడం గమనార్హం. ఇదిలావుంటే, హత్యాచార ఘటనపై అభిషేక్ మీడియాతో మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనల్లో దోషులకు ఉరి శిక్ష విధించేలా కేంద్రం చట్టం తీసుకురావాలని సూచించారు.

### మమత రాజీనామా చేయాలి: బీజేపీ

"యువ వైద్యురాలిపై జరిగిన ఘోరంలో వైద్య కళాశాల, ఆసుపత్రి ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్, కోల్‌కతా కమిషనర్ వినీత్‌ల పాత్ర ఉందని అధికార పార్టీ సీనియర్ నాయకులే విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో అధికార యంత్రాంగం చచ్చుబడిపోయింది. ఈ నేపథ్యంలో సీఎం మమత రాజీనామా చేయాలి" అని బీజేపీ నేత సుకాంత్ ముజుందార్ ఎక్స్‌లో డిమాండ్ చేశారు.

### సొంత సర్కారుపై తలోమాట


హత్యాచార ఘటనపై అధికార పార్టీ టీఎంసీలో నేతలు తలోమాట మాట్లాడడం రాజకీయంగా చర్చనీయాంశం అయింది. సీనియర్ నేత శంతను సేన్ మాట్లాడుతూ.. హత్యాచార ఘటన సీఎంకు తెలియజేయకుండా ఆర్‌జీకర్ ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర సందీప్ ఘోష్ తొక్కిపెట్టారని, దీనిపై అనేక అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. మరో నేత కునాల్ మాత్రం సర్కారుకు వ్యతిరేకంగా మాట్లాడారు. ఘటన జరిగిన ప్రాంతంలో ఆధారాలు చెరిగిపోయేలా మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు చేపట్టరాదని వ్యాఖ్యానించారు. టీఎంసీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సుఖేందు శేఖర్‌రాయ్ వైఖరి పార్టీలో మరింత దుమారం రేపింది. ఈ నెల 14న మహిళలు చేపట్టిన ధర్నాలో ఆయన ఒంటరిగా పాల్గొనడంతోపాటు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

## కోల్‌కతా హత్యాచారంపై సుప్రీంకోర్టు విచారణ

(మొదటి పేజీ తరువాయి)

విచారించనున్న కేసుల జాబితాలో ఇది కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కేసుపై ఇప్పటికే సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్న విషయం తెలిసిందే. మరోవైపు, జూనియర్ డాక్టర్‌పై దారుణంగా లైంగికదాడికి పాల్పడి, హత్య చేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సంజయ్‌రాయ్‌కి ఆదివారం మానసిక పరీక్షలు జరిపారు. ఢిల్లీ నుంచి కోల్‌కతాకు వచ్చిన సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి చెందిన మానసిక విశ్లేషకులు ఈ పరీక్షలు నిర్వహించారు. కోల్‌కతా పోలీస్ విభాగంలో పౌర వలంటీర్‌గా 2019లో చేరిన సంజయ్‌రాయ్ ఇప్పటికి నాలుగుసార్లు పెళ్లిళ్లు చేసుకున్నాడని, అతడొక తిరుగుబోతు అని, బాక్సింగ్‌లో ప్రవేశం ఉందని వెల్లడైంది. తాజా ఘటన అనంతరం ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పదవి నుంచి వైదొలిగిన సందీప్ ఘోష్‌ను సీబీఐ అధికారులు ఆదివారం కూడా విచారించారు. ఆయన ఫోన్‌కాల్స్ వివరాలను పరిశీలిస్తున్నారు. హత్యాచారం ఘటన జరిగిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో సీబీఐ దర్యాప్తు బృందం త్రీడీ లేజర్ మ్యాపింగ్ నిర్వహించింది. కాగా, హత్యాచారానికి బలైన జూనియర్ డాక్టర్ పేరు వెల్లడిస్తూ సోషల్ మీడియాలో వీడియో విడుదల చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సినీ నటి రచనా బెనర్జీపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆమె ఆ వీడియోను తొలగించి క్షమాపణ చెప్పారు. ఇదిలా ఉండగా, కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. శాంతిభద్రతల పరిస్థితులపై ప్రతీ రెండు గంటలకోసారి తమకు నివేదిక పంపించాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రహోంశాఖ ఈ నెల 16న ఆదేశాలు జారీ చేసినట్లుగా తాజాగా వెల్లడైంది. ఈ మేరకు రాష్ట్రాల పోలీసు విభాగాలు కేంద్ర హోంశాఖకు నివేదికలు పంపుతున్నాయి.

## లోకం తీరు




## శ్రీరామ్స్ ఐఏఎస్‌కు రూ.3 లక్షల జరిమానా

న్యూఢిల్లీ, ఆగస్టు 18: సివిల్ సర్వీసుల పరీక్షకు కోచింగ్ ఇచ్చే ఓ ఇన్‌స్టిట్యూట్‌కు కేంద్రం షాక్ ఇచ్చింది. తప్పుదారి పట్టించేలా ప్రకటన చేయడంతో పాటు వినియోగదారుల హక్కుల ఉల్లంఘనకు పాల్పడినందుకు కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ శ్రీరామ్స్ ఐఏఎస్‌కు కేంద్ర వినియోగదారుల రక్షణ అథారిటీ(సీసీపీఏ) రూ.3లక్షల జరిమానా విధించినట్టు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ ఆదివారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఎగ్జామ్ 2022కు సంబంధించి తప్పుదారి పట్టించేలా ప్రకటన చేసినందుకు సీసీపీఏ ఈ చర్యకు ఉపక్రమించింది. ఢిల్లీలో సెంటర్లు ఉన్న శ్రీరామ్స్ ఐఏఎస్ తన ప్రకటనలో.. "యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఎగ్జామ్ 2022లో 200కు పైగా సెలెక్షన్స్, మేమే దేశంలో నంబర్ వన్ ప్రతిష్ఠాత్మక యూపీఎస్సీ/ఐఏఎస్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్" అని పేర్కొంది. ఈ ఇన్‌స్టిట్యూట్ వివిధ రకాల కోర్సులను ప్రచారం చేసిందని, కానీ యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలో విజయవంతమైన అభ్యర్థులు ఎంచుకున్న కోర్సుకు సంబంధించిన సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టినట్టు సీసీపీఏ గుర్తించింది. 200కు పైగా సెలెక్షన్స్ అని చెప్పినా 171 మంది విజయవంతమైన అభ్యర్థుల వివరాలను మాత్రమే ఈ ఇన్‌స్టిట్యూట్ సమర్పించిందని, వీరిలో 102 మంది ఉచిత ఇంటర్వ్యూ గైడెన్స్ ప్రోగ్రామ్, 55 మంది ఉచిత టెస్ట్ సిరీస్, 9 మంది జనరల్ స్టడీస్ క్లాస్ రూమ్ కోర్సు, ఐదుగురు ఉచిత కోచింగ్‌ను అందించడానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, ఇన్‌స్టిట్యూట్ మధ్య కుదిరిన ఎంఓయూ కింద వివిధ రాష్ట్రాలకు చెందిన వారని తెలిపింది. ఈ విషయాన్ని ప్రకటనలో వెల్లడించలేదని పేర్కొంది. కాగా కోచింగ్ ఇన్‌స్టిట్యూట్లు, ఆన్‌లైన్ ఎడ్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లు విజయవంతమైన అభ్యర్థుల ఒకే చిత్రాలు, పేర్లను వినియోగిస్తూ అభ్యర్థులను ప్రభావితం చేస్తున్నాయని, అయితే వారు ఏ కోర్సును ఎంచుకున్నది, కోర్సు కాల పరిమితిని మాత్రం వెల్లడించడం లేదని పేర్కొంది.

# బీజేపీలోకి చంపయీ సోరెన్!

**పార్టీ మారనున్న ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి!**

- ఆరుగురు జేఎంఎం ఎమ్మెల్యేలతో ఢిల్లీకి
- 'ఎక్స్' ఖాతా నుంచి పార్టీ పేరు తొలగింపు



ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతున్న చంపయీ

ఢిల్లీ, రాంచీ, ఆగస్టు 18: త్వరలో ఎన్నికలు జరగనున్న ఝార్ఖండ్‌లో అనూహ్య పరిణామం..! ఆ రాష్ట్ర మాజీ సీఎం, ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కీలక నాయకుడు చంపయీ సోరెన్ బీజేపీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం జల వనరుల శాఖ మంత్రిగా ఉన్న చంపయీ.. ఆదివారం తెల్లవారుజామున పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలతో కలిసి హఠాత్తుగా ఢిల్లీ వెళ్లడం ఊహాగానాలకు కారణమైంది. కుమార్తెను కలిసేందుకే దేశ రాజధానికి వచ్చినట్లు ఆయన చెప్పారు. అయితే, ఈలోగానే తన 'ఎక్స్' ఖాతా నుంచి పార్టీ పేరును తొలగించారు. సాయంత్రానికి సుదీర్ఘ లేఖ విడుదల చేశారు. జేఎంఎలో తీవ్ర అవమానాలు ఎదుర్కొన్నానని, వాటిని తట్టుకోలేకే ప్రత్యామ్నాయం గురించి ఆలోచిస్తున్నానని పేర్కొన్నారు. రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకోవడం, సొంతంగా పార్టీని స్థాపించడం, తోడుగా నిలిచేవారితో కలిసి ప్రయాణించడం అనే మార్గాలున్నట్లు తన ముందు ఉన్నాయని వివరించారు. హేమంత్ జైలు నుంచి విడుదలైన తర్వాత ఎజెండా ఏమీ లేకుండా నిర్వహించిన సమావేశంలో తనను రాజీనామా చేయమని కోరారని.. అంతకుముందు తన కార్యక్రమాలన్నింటినీ హఠాత్తుగా రద్దు చేశారని వాపోయారు. కాగా, జేఎంఎం అధిష్ఠానానికి నమ్మకస్తుడయిన చంపయీ ఫిబ్రవరి 2 నుంచి జూలై 3 వరకు సీఎంగా వ్యవహరించారు. భూ కుంభకోణం కేసులో హేమంత్ సోరెన్‌ను ఈడీ అరెస్టు చేయడంతో సీఎంగా చంపయీకి అవకాశం దక్కింది. హేమంత్‌కు బెయిల్ రావడంతో వైదొలగాల్సి వచ్చింది. అప్పటినుంచి ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు చెబుతున్నారు. కాగా, శనివారం రాత్రి కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ బీజేపీ నాయకుడు సువేందుతో చంపయీ సమావేశమయ్యారని, కేంద్రమంత్రి శివరాజ్‌తో సంప్రదింపుల్లో ఉన్నారని సమాచారం. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద ఇటీవల అనర్హత వేటుకు గురైన జేఎంఎం ఎమ్మెల్యే లొబిన్ హెంబ్రోమ్ చంపయీతో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకొంది.

# కాంగ్రెస్‌లో భారీ మార్పులు!

**మీడియా ఇన్‌చార్జిగా జైరాం రమేశ్ అవుట్!**

- కేరళ పీసీసీ చీఫ్‌గా వెళ్లనున్న వేణుగోపాల్?



న్యూఢిల్లీ, ఆగస్టు 18: కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా భారీ మార్పులు తలపెట్టినట్లు తెలిసింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శుల్లో కీలకంగా వ్యవహరిస్తున్న జైరాం రమేశ్ (మీడియా వ్యవహారాల ఇన్‌చార్జి), కేసీ వేణుగోపాల్ (సంస్థాగత వ్యవహారాలు)లను మార్చబోతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యంగా జైరాం రమేశ్‌పై రాహుల్‌గాంధీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. బీజేపీ విమర్శలను అనుకున్న రీతిలో ఆయన తిప్పికొట్టలేకపోతున్నారని, హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇది ప్రతికూల ప్రభావం చూపించవచ్చని సీనియర్ నాయకులు చెప్పారు. దీంతో ఆ పదవి నుంచి వైదొలగాలని జైరాంను రాహుల్ కోరుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అయితే తనను ఈశాన్య భారత వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమించాలని జైరాం విజ్ఞప్తి చేశారని పేర్కొన్నాయి. రాహుల్‌కు అత్యంత సన్నిహితుడైన వేణుగోపాల్‌ను మార్చాలనుకోవడమే పార్టీ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్‌లో కాంగ్రెస్ విజయం సాధించడంతో.. నాడు ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా ఉన్న అశోక్ గహ్లోత్ సీఎంగా వెళ్లారు. దరిమిలా ఆ పదవి చేపట్టిన వేణుగోపాల్.. ఇప్పటికీ కొనసాగుతున్నారు. కేరళ పీసీసీ అధ్యక్షుడిగా వెళ్లాలని రాహుల్‌గాంధీయే ఆయన్ను కోరారని అంటున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో కాంగ్రెస్ కూటమి యూడీఎఫ్ ఘనవిజయం సాధించింది. 20 స్థానాల్లో 18 గెలిచింది. 2026లో ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. సీఎం పదవికి రేసులో తాను లేనని వేణుగోపాల్ చెబుతున్నప్పటికీ.. ఆయనకు ఆ ఆకాంక్ష ఉందని ఓ సీనియర్ నేత తెలిపారు. పీసీసీ పగ్గాలు చేపడితేనే టికెట్ల పంపిణీ తన చేతుల్లో ఉంటుందని.. యూడీఎఫ్ విజయం సాధిస్తే తన వర్గం ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉంటే తనకే సీఎం పీఠం దక్కుతుందని ఆయన భావిస్తున్నారని.. అందుకే రాష్ట్ర రాజకీయాలకు వెళ్లాలనుకుంటున్నారని పేర్కొన్నారు. కాగా.. వేణుగోపాల్ స్థానంలో సంస్థాగత ప్రధాన కార్యదర్శి పదవి రేసులో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎంలు అశోక్ గహ్లోత్, భూపేశ్ బఘేల్ ఉన్నట్లు తెలుస్తోంది. సోనియాకు అత్యంత విశ్వాసపాత్రుడిగా మెలిగిన గహ్లోత్.. ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల సమయంలో అధిష్ఠానాన్ని ధిక్కరించారు. తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి కారణమయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనకు మళ్లీ ఇంతటి కీలక పదవిని రాహుల్ అప్పగిస్తారా అనేది అనుమానమేనని పార్టీ వర్గాలు అంటున్నాయి. బఘేల్ ప్రియాంకకు సన్నిహితుడు. ఆయన్ను సంస్థాగత ఇన్‌చార్జిగా నియమిస్తే పార్టీలో ప్రియాంక పాత్ర పెరుగుతుందని.. రాహుల్ సన్నిహితులు తగ్గిపోతారని కొందరి వాదన. అయితే, మార్పులపై రాహుల్‌దే తుది నిర్ణయమని ఏఐసీసీ వర్గాలు స్పష్టంచేశాయి.

# హడావుడిగా నా కుమార్తె అంత్యక్రియలు

- దీనిపై అనుమానాలున్నాయి: ట్రైనీ డాక్టర్ తండ్రి

కోల్‌కతా, ఆగస్టు 18: స్థానిక ఆర్‌.జి. కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో 31 ఏళ్ల ట్రైనీ డాక్టర్ దారుణంగా అత్యాచారానికి, హత్యకు గురయిన సంఘటనపై దర్యాప్తు జరుగుతున్న తీరు సక్రమంగా లేదని ఆమె తండ్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేసుపై మమత ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం బాగులేదని అభిప్రాయపడ్డారు. తన కుమార్తె భౌతిక కాయాన్ని హడావిడిగా దహనం చేశారని, దీనిపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. శ్మశానంలో అప్పటికే మూడు శవాలు ఉన్నప్పటికీ తన కుమార్తె భౌతిక కాయానికి ముందుగా దహన సంస్కారాలు చేశారని చెప్పారు. "న్యాయం చేస్తామని సీఎం అంటున్నారు. కానీ న్యాయం కోసం డిమాండు చేస్తున్న సామాన్యులను జైల్లో పెడుతున్నారు" అని వాపోయారు. ప్రస్తుతం సీబీఐ జరుపుతున్న దర్యాప్తు పట్ల కూడా ఆయన సంతృప్తి చెందలేదు. "దర్యాప్తు జరుగుతున్నా ఇంతవరకు ఎలాంటి ఫలితాలు వెల్లడి కాలేదు. డిపార్టుమెంటు తరఫునగానీ, కాలేజీ తరఫునగానీ ఒక్కరు కూడా మాకు సహకరించలేదు. మొత్తం డిపార్టుమెంటుకు ఇందులో ప్రమేయం ఉంది" అని ఆరోపించారు. న్యాయం కోసం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలను రాష్ట్ర ప్రభుత్వం అణచివేస్తోందని చెప్పారు. ఒకప్పుడు వీధి పోరాటాలు చేసిన ముఖ్యమంత్రే ఇప్పుడు నిరసన ప్రదర్శనలను అడ్డుకుంటున్నారన్నారు.

### వైద్య ఉద్యోగుల భద్రతకు ప్రత్యేక చట్టం కావాలి

న్యూఢిల్లీ, ఆగస్టు 18: వైద్య ఉద్యోగుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరుతూ 70మందికిపైగా పద్మ అవార్డు గ్రహీత వైద్యులు ప్రధానికి లేఖ రాశారు. మాటల రూపంలోగానీ, భౌతికంగాగానీ హింసించే వారికి కఠిన శిక్షలు విధించేలా ఆర్డినెన్స్ తీసుకురావాలని కోరారు. వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య సంస్థలపై దాడుల నిరోధక బిల్లును 2019లోనే రూపొందించినా, ఇంతవరకు పార్లమెంటులో ప్రవేశపెట్టని విషయాన్ని గుర్తు చేశారు. దీనిని వెంటనే ఆమోదించాలని కోరారు. ఈ విషయంలో తక్షణమే స్వయంగా జోక్యం చేసుకోవాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు.ఈ లేఖపై సంతకాలు చేసిన వారిలో ఐసీఎంఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బలరాం భార్గవ్, ఎయిమ్స్-ఢిల్లీ మాజీ డైరెక్టర్ డాక్టర్ గులేరియా ఉన్నారు.

### ముంబైలో మహిళా డాక్టర్‌పై దాడి

ముంబై, ఆగస్టు 18: ముంబైలోని సియోన్ ఆస్పత్రిలో రాత్రి విధుల్లో ఉన్న ఓ మహిళా డాక్టర్‌పై మద్యం మత్తులో ఉన్న రోగి, అతని బంధువులు దాడి చేశారు. శనివారం అర్ధరాత్రి 12.30 సమయంలో ముఖంపై గాయాలతో ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సకు వచ్చాడు. ఆయన వెంట 8మంది బంధువులు ఉన్నారు. తెల్లవారుజామున 3.30 సమయంలో డ్యూటీలో ఉన్న మహిళా రెసిడెంట్ డాక్టర్‌పై వీరు దుర్భాషలాడుతూ.. దాడి చేశారు. "సదరు మహిళా డాక్టర్ రోగి గాయాలను పరిశీలించేందుకు బ్యాండేజీని తొలగిస్తుండగా.. రోగి, అతని బంధువులు దుర్భాషలాడారు. రక్తపు బ్యాండేజీలను ఆమెపై విసిరి, దాడికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న నర్సు వెంటనే సెక్యూరిటీని పిలిపించారు. భద్రతాసిబ్బంది వచ్చేలోపే రోగి, అతని బంధువులు అక్కడి నుంచి పారిపోయారు.

# ఆకాశమంత ఎత్తు.. ఆరోగ్యం చిత్తు?

(మొదటి పేజీ తరువాయి)

మెగాహిట్ పాటలతో బహుళ ప్రజాదరణ పొందిన పాప్ గాయని ధ్వని భానుశాలి ముంబైలో ఒక ఆకాశహర్మ్యంలో 76వ అంతస్తులో ఫ్లాట్ తీసుకున్నారు! ఆ ఫ్లాట్‌లో ఇంటీరియర్ డిజైనింగ్ చేయడానికి వెళ్లిన బృందంలో కొందరికి తీవ్రమైన తలనొప్పి వచ్చింది. కారణాలను ఆరాతీయగా.. అంత ఎత్తున ఆక్సిజన్ స్థాయులు తక్కువగా ఉండడమే కారణమని తేలింది. సాధారణంగా.. ఎత్తైన ప్రాంతాలకు వెళ్లినప్పుడు కొందరికి శ్వాస సమస్యలు వస్తుంటాయి. సముద్ర మట్టం నుంచి ఎత్తుకు వెళ్లే కొద్దీ గాలి పల్చబడి ఆక్సిజన్ స్థాయులు తగ్గడమే దీనికి కారణం. అయితే, ఆరోగ్యవంతుల శరీరాలు.. మారే వాతావరణ పరిస్థితికి అనువుగా మారుతాయి. శరీరం ఇలా సర్దుబాటు చేసుకోవడాన్ని 'ఎక్లైమెటైజేషన్' అంటారు. ఈ సామర్థ్యం అందరికీ ఒకేలా ఉండదు. వ్యక్తుల వయసు, ఆరోగ్యం వంటివి ఈ సామర్థ్యాన్ని నిర్ణయిస్తాయి. ఆస్తమా వంటి సమస్యలున్నవారికి ఎక్లైమెటైజేషన్ కెపాసిటీ తక్కువగా ఉంటుంది. అలాంటివారు 30 అంతకు మించి అంతస్తులుండే భారీ భవనాల్లో ఎక్కువకాలం ఉంటే 'హైపోక్సియా' బారిన పడే ప్రమాదం ఉంది. అంటే శరీరంలోని కణాలకు తగినంత ప్రాణవాయువు అందకపోవడం. "హైపోక్సియా వల్ల.. శ్వాస పీల్చుకోవడం కష్టమవుతుంది. హృదయస్పందన వేగం, రక్తపోటు పెరుగుతాయి. ఎక్కువగా రాత్రిపూట ఇలాంటి సమస్యలు వస్తాయి" అని ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్ మనోజ్ పవార్ వెల్లడించారు. దీర్ఘకాలంపాటు (క్రానిక్) హైపోక్సియాకు గురయ్యేవారిలో.. ఆ ప్రభావం గుండె ఆరోగ్యంపైనా పడుతుందని, నిద్రలేమి వంటి సమస్యలు చుట్టుముడతాయని ఆయన వివరించారు. ముఖ్యంగా గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, హృద్రోగాలతో, శ్వాససమస్యలతో బాధపడేవారి ఈ సమస్య ఎక్కువగా ఉండే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. "8000 అడుగులు (అంటే దాదాపు 80 అంతస్తులు) అంతకు మించి ఎత్తైన భవనాల్లో నివసించేవారిలో ఈ ఆరోగ్య సమస్యలు మరింత గణనీయంగా కనిపిస్తాయి. ఊపిరి ఆడకపోవడం, అలసట, తలనొప్పి వంటి ఇబ్బందులు వస్తాయి. కొన్ని సందర్భాల్లో వారి మెదడు పనితీరుపైనా ప్రభావం పడుతుంది. 10,000 అడుగులు (అంటే 3000 మీటర్లు- దాదాపు 100 అంతస్తులు) దాటితే.. ముందే రకరకాల అనారోగ్యాలతో బాధపడే వృద్ధుల్లో ఈ ముప్పు మరింత పెరుగుతుంది" అని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. నిజానికి ఇలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకుగాను.. హైరైజ్ భవనాలు నిర్మించేటప్పుడు.. వాయు నాణ్యతను నియంత్రించే అత్యంత అధునాతన విధానాలను బిల్డర్లు పాటిస్తుంటారు. అలాంటివి పాటించకుండా నిర్మించే భవనాల్లో.. శ్వాసకోశ, గుండె సంబంధిత జబ్బులున్నవారు 30కి మించి అంతస్తుల్లో ఎక్కువకాలం నివాసం ఉంటే వారి ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

### పలు అధ్యయనాలు..

ఆకాశహర్మ్యాల్లో నివసించడం వల్ల ఆరోగ్యంపై ఏవైనా దుష్ప్రభావాలు పడతాయా? అనే అంశంపై గతంలో చాలా పరిశోధనలు జరిగాయి. ఉదాహరణకు 2011లో చైనాలో వైద్యనిపుణులు 46 అంతస్తుల భవనంలో నివసించేవారి హృదయస్పందనల్లో తేడాలపై పరిశోధన చేశారు. 31 అంతస్తుల లోపు ఉండేవారితో పోలిస్తే.. 32 నుంచి 46వ అంతస్తు దాకా ఉండేవారిలో హార్ట్ రేట్ వేరియబిలిటీ (హెచ్‌ఆర్‌వీ) పెరుగుతున్నట్టు వారి పరిశోధనలో వెల్లడైంది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. స్త్రీలు, పురుషులు, వృద్ధులు, వారి వయసు.. ఇలా చాలా కారణాలు హెచ్‌ఆర్‌వీని ప్రభావితం చేస్తున్నట్టు గుర్తించారు. అలాగే.. ఆకాశహర్మ్యాల్లో నివసించే వారిలో అధిక రక్తపోటు ఎందుకు వస్తోందన్న అంశంపై 26 సంవత్సరాల క్రితమే జపాన్‌లోని టొకాయ్ యూనివర్సిటీ మెడికల్ స్కూలుకు చెందిన ఫ్యుమియో ఒసాకా చేసిన పరిశోధన కూడా ఆసక్తికరం. ఎత్తైన భవనాల్లో నివసించేవారిలో 50 ఏళ్లు దాటిన మహిళలు హైబీపీ బారిన పడే ముప్పు ఎక్కువని ఆ పరిశోధనలో తేలింది. అయితే, దీనికి కారణం ఆక్సిజన్ స్థాయులు తక్కువగా ఉండడం కాదు. కేవలం జీవనశైలి సమస్య. అంత ఎత్తున ఉండేవారు పదేపదే కిందకి దిగలేరు. దిగాలంటే తప్పనిసరిగా లిఫ్ట్ వాడాల్సిందే. ఫలితంగా వారు ఎక్కువకాలం అలా ఇంట్లోనే ఉండిపోవాల్సి వస్తుంది. బయటకు వెళ్లి పచ్చిగాలి పీల్చి, కాసేపు అలా తేలికపాటి వ్యాయామాలు చేసే అవకాశం ఉండదు. ఒక ఇరుకైన ప్రదేశంలో ఎక్కువకాలం ఉన్న భావనతో వారిలో ఆందోళన పెరుగుతుంది. దీన్ని 'సెల్ఫ్ ఇండ్యూస్డ్ క్యాబిన్ ఫీవర్' అంటారు. కాబట్టి, ఎత్తైన భవనాల్లో ఉన్నా కొద్దిగా ఓపిక చేసుకుని కిందకు వెళ్లి వాకింగ్, జాగింగ్ వంటివి చేయడం.. నలుగురితో కలిసి మాట్లాడడం వంటివి చేస్తే మంచిదని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అలాగే.. శ్వాస సమస్యలతో, హృద్రోగాలతో బాధపడేవారు ఆకాశహర్మ్యాల్లో ఉండాలనుకుంటే/ఫ్లాట్ కొనాలనుకుంటే.. వైద్యులను ఒకసారి సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు.

- సెంట్రల్ డెస్క్

# ఏటీఎంల్లో భారీ చోరీ


చోరీకి గురైన పెందుర్తి లోని ఎస్‌బీఐ ఏటీఎం

- రెండు ఏటీఎంల నుంచి రూ.33లక్షలు అపహరణ
- విశాఖలో పోలీసులకు సవాల్ విసిరిన ఆగంతకులు
- పెందుర్తి, తగరపువలస ఎస్‌బీఐ ఏటీఎంల్లో ఘటనలు
- వైర్లు కత్తిరించి, గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంల తొలగింపు
- సీసీ కెమెరాలపై బ్లాక్ పెయింట్ స్ప్రే
- ఆధారాలు దొరక్కుండా సీసీ ఫుటేజ్ బాక్స్ అపహరణ
- కారులో వచ్చి దర్జాగా దొంగతనం
- అంతర్రాష్ట్ర ముఠా పనేనంటున్న పోలీసులు

పెందుర్తి, భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 18: విశాఖలో కొందరు ఆగంతకులు రెండు ఎస్‌బీఐ ఏటీఎంలను కొల్లగొట్టి పోలీసులకు సవాల్ విసిరారు. పెందుర్తి, తగరపువలసలో రెండు చోట్ల కలిపి మొత్తం రూ.33లక్షలు అపహరించుకుపోయారు. పోలీసుల కథనం మేరకు శనివారం అర్ధరాత్రి దాటాక.. ఆదివారం తెల్లవారుజాము మూడు గంటల సమయంలో.. ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు ధరించిన ఆగంతకులు ఓ కారులో పెందుర్తి నటరాజ్ థియేటర్ సమీపంలోని ఓ కాంప్లెక్స్‌లోగల ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం వద్దకు వచ్చారు. ఏటీఎంలో చొరబడి అక్కడ రెండు వైపులా ఉన్న సీసీ కెమెరాల్లో తమ చిత్రాలు రికార్డు కాకుండా వాటిపై బ్లాక్ పెయింట్ స్ప్రే చేశారు. తొలుత ఏటీఎంకు ఉన్న విద్యుత్ తీగలను కత్తిరించారు. తర్వాత గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి ఏటీఎంలో ఉన్న రూ.19 లక్షల నగదును దోచుకుని పారిపోయారు. ఎలాంటి ఆధారాలూ దొరకనీయకుండా సీసీ టీవీ ఫుటేజీ రికార్డయ్యే డీవీఆర్ బాక్స్, విడి భాగాలను కూడా తొలగించి తమతో పాటు తీసుకుని, దర్జాగా కారులో పరారయ్యారు. అనంతరం, భీమిలి మండలం తగరపువలస సమీపంలోని అవంతి కళాశాల వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్టేట్ బ్యాంక్ ఏటీఎంను ఆగంతుకులు కొల్లగొట్టి అందులో ఉన్న రూ.14.40 లక్షలు చోరీ చేశారు. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం యంత్రాన్ని కట్ చేసి, నోట్ల కట్టలను ఎత్తుకుపోయినట్టు తెలుస్తోంది. ఈ సమీపంలో హోటళ్లు, పలు దుకాణ సముదాయాలు రాత్రి 11 గంటల వరకు తెరిచి ఉంటాయని, వారి నుంచి కూడా సమాచారాన్ని రాబడుతున్నామని పోలీసులు తెలిపారు. సీసీ టీవీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ఆరా తీస్తున్నామన్నారు. చోరీలో ముగ్గురు పాల్గొన్నట్టు ప్రాథమికంగా అంచనా వేశారు.

### కెమెరా పనిచేయకపోవంతో వెలుగులోకి...

కాగా, ఎస్‌బీఐ నిర్వహణలోని సెక్యూరిటీ కమాండ్ కంట్రోల్ చెక్‌అప్‌లో పెందుర్తిలోని ఏటీఎం సీసీ కెమెరా ఎర్రర్‌గా చూపిస్తుండడాన్ని సిబ్బంది గుర్తించి, వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించడంతో చోరీ విషయం బయటపడింది. దీంతో పోలీసులకు సమాచారం అందజేశారు. క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, ఏసీపీ శ్యామలరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సూరిబాబు స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. అయితే ఆగంతకులు పలురకాల జాగ్రత్తలు తీసుకోవడంతో ఎటువంటి ఆధారాలూ లభ్యం కాలేదని సమాచారం. ఈ క్రమంలో ఏటీఎం సమీపంలోని భవనాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించగా ముఖాలకు మాస్కులు, చేతులకు గ్లౌజులు ధరించిన నలుగురైదుగురు ఆగంతకులు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. జాతీయ రహదారుల వెంబడి ఉన్న ఏటీఎంలను టార్గెట్ చేసుకుని జరిగిన చోరీలను బట్టి, ఇది అంతర్రాష్ట్ర ముఠాల పనిగానే భావిస్తున్నామని డీసీపీ వెంకటరత్నం తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్టు క్రైమ్ ఏసీపీ శ్యామలరావు తెలిపారు.

# వైసీపీ వాళ్లకు ఇచ్చేద్దాం!

- పెండింగ్ బిల్లులపై అనుకూల అధికారుల హడావుడి
- 'ఉపాధి'లో 100 కోట్లు చెల్లించేందుకు సిద్ధం
- మరో రూ.234 కోట్ల కోసం ప్రతిపాదనలు
- ఎన్నికలయ్యాక హడావుడిగా ఆ బిల్లుల అప్‌లోడ్
- అప్పట్లో పూర్తిగా సహకరించిన అధికారులు
- ఇప్పుడు సొమ్ము చెల్లింపులకూ కదిలిన ఫైళ్లు
- పంచాయతీరాజ్, గ్రామీణ శాఖల్లో నాడు వైసీపీతో అంటకాగిన అధికారుల పనేనా!
- గతంలో టీడీపీ కార్యకర్తలకు నానా తిప్పలు
- కోర్టులకు వెళ్లినా బిల్లులివ్వని జగన్ సర్కారు
- ఇప్పటికీ 21 శాతం బిల్లులు పెండింగులోనే
- వాటిని వదిలేసి.. వైసీపీ వారికి అధికారుల మేళ్లు
- తమకూ ఇవ్వాలంటున్న దేశం కార్యకర్తలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సరిగ్గా ఐదేళ్ల కిందట టీడీపీ అధికారం కోల్పోయి, వైసీపీ అధికారంలోకి వచ్చినప్పుడు.. 2014-19 మధ్య ఉపాధి హామీ పనులు చేసిన వారికి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించకుండా నిలిపేశారు. అంతేకాదు అప్పటికే ప్రారంభమైన పనులను కూడా రద్దు చేశారు. అప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కోర్టులకు వెళ్లిన వారికి సైతం సొమ్ములు చెల్లించేందుకు రెండేళ్లు పట్టింది. రెండేళ్ల తర్వాత కూడా 21 శాతం బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. అయితే, తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైసీపీ హయాంలో చేసిన పనికి పూర్తిగా భిన్నంగా వ్యవహరిస్తోంది. వైసీపీ ప్రభుత్వం మాదిరిగా గతంలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వరాదన్న నిబంధనలు పెట్టలేదు. పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలు అమలు చేస్తున్నారో? లేక కమిషనరేట్‌లో గతంలో పని చేసిన అధికారులే ఉండటంతో వారికి బిల్లులు చెల్లించాలన్న అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారో తెలియదు గాని ఎట్టకేలకు ఉపాధి బిల్లులు చెల్లించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వైసీపీ సర్కార్‌లో కార్యకర్తలు చేపట్టిన సచివాలయ, ఆర్బీకే భవనాల నిర్మాణంతో పాటు ఉపాధి నిధులతో చేపట్టిన పలు పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు సమాయత్తం అయ్యారు. గ్రామీణాభివృద్ధిశాఖ వద్ద కేవలం రూ.150 కోట్లే ఉండటంతో మరో రూ.200 కోట్లు ఇవ్వాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మొత్తం రూ.334 కోట్ల పెండింగ్ ఉపాధి బిల్లులు చెల్లించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. తొలుత అందుబాటులో ఉన్న రూ.100 కోట్లు చెల్లించేందుకు అధికారులు ఇప్పటికే ఫైళ్లు సిద్ధం చేస్తున్నారు.

### అధికారుల ప్రత్యేక శ్రద్ధ

వైసీపీ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలు చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించేందుకు కొంత మంది అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో భారీ స్థాయిలో పనులేమీ జరగలేదు. పనిచేసిన కొంత మంది కాంట్రాక్టర్లకు ఎన్నికలకు ముందు హడావుడిగా బిల్లులు చెల్లించిన అప్పటి సీఎం జగన్.. ఎన్నికల్లో వారి సేవలను వాడుకున్నారు. అయితే, ఎన్నికలకు ముందుగానే బిల్లులు సమర్పించినప్పటికీ ఇంకా రూ.334 కోట్ల మేరకు బిల్లులు ఎందుకు పెండింగ్ ఉన్నాయో తెలియాల్సి ఉంది. అయితే, ఎన్నికల తర్వాత కౌంటింగ్‌కు ముందు పలు పనులకు సంబంధించి హడావుడిగా బిల్లులు పెట్టినట్లు సమాచారం. ఆయా పనులు పూర్తి కాకుండానే కొంత మంది బిల్లులు అప్‌లోడ్ చేసినట్లు తెలుస్తోంది. దీనికి కమిషనరేట్‌లోని కొంత మంది అధికారులు సహకరించారన్న వాదన వినిపిస్తోంది.

**అప్పుడు-ఇప్పుడు:** గతంలో టీడీపీ కార్యకర్తలు, అప్పట్లో సర్పంచ్‌లు చేసిన ఉపాధి పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా చుక్కలు చూపించింది. కానీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వం మాత్రం అచ్చంగా వైసీపీ కార్యకర్తలు చేపట్టిన ఉపాధి పనులకు బిల్లులు చెల్లించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం. అప్పట్లో టీడీపీ కార్యకర్తలు, సర్పంచ్‌లు చేపట్టిన సిమెంట్ రోడ్లకు బిల్లులివ్వకుండా ఆపేయడంతో వారు కోర్టును ఆశ్రయించారు. దీంతో బిల్లులు ఇవ్వాలని కోర్టు ఆదేశించినా వైసీపీ ప్రభుత్వం రెండేళ్లపాటు బిల్లులు చెల్లించలేదు. దీంతో వారంతా హైకోర్టులో ధిక్కరణ వ్యాజ్యాలు వేశారు. మరో వైపు బిల్లుల చెల్లింపును మరింత జాప్యం చేసేందుకు ఆయా పనులపై విజిలెన్స్ తనిఖీలు చేపట్టారు. అప్పటికే ఆ పనులు పూర్తయి మూడేళ్లవుతున్నా.. మళ్లీ విజిలెన్స్ తనిఖీలు చేపట్టి అటు ఇంజనీర్లను, ఇటు కాంట్రాక్టర్లను బెంబేలెత్తేలా చేశారు. దీంతో కొంత మంది మాజీ సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు బిల్లులు రాక, వడ్డీల భారం పెరిగిపోయి ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. అప్పట్లో టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన అధికారులు ఇప్పుడు వైసీపీ కార్యకర్తలకు బిల్లులు చెల్లించడంలో అత్యుత్సాహం చూపిస్తున్నారు. బిల్లులు ఎలాగైనా చెల్లించాల్సిందేనని, అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల్లో వైసీపీ కార్యకర్తలకు హడావుడిగా అంత మేర బిల్లులు ఎందుకు చెల్లించాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్లాంటేషన్‌కు సంబంధించి రైతులకు చెల్లించాల్సినవి కొన్ని తొలి ప్రాధాన్యంగా చెల్లించవచ్చని.. కానీ సచివాలయ భవనాలు, ఇతర రోడ్లకు సంబంధించిన బిల్లులు అంత అత్యవసరంగా చెల్లించే అవసరం లేకపోయినా ఆ బిల్లులు చెల్లించేందుకు కొంత మంది అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సమాచారం.

> వైసీపీ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలు చేపట్టిన ఉపాధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు కూటమి సర్కారులోని కొంత మంది అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. హడావుడిగా బిల్లుల చెల్లింపునకు ఫైళ్లు సిద్ధం చేశారు. కానీ, గతంలో వైసీపీ సర్కారు.. 2014-19 మధ్య టీడీపీ కార్యకర్తలు చేపట్టిన పనులకు బిల్లులు ఇవ్వకుండా నానా తిప్పలు పెట్టిన విషయాన్ని ప్రభుత్వం మరిచిపోయినట్టుంది. కోర్టుకు వెళ్లినా కనికరించకపోగా ఇప్పటికీ 21 శాతం మేరకు సొమ్ములు చెల్లించాల్సి ఉంది. దీంతో టీడీపీ కార్యకర్తలు తమకు కూడా న్యాయం చేయాలని కోరుతున్నారు.



### నాటి బిల్లులకు మోక్షమేదీ?

ఎన్నికల తర్వాత ఆదరాబాదరాగా బిల్లులు పెట్టి అప్‌లోడ్ చేసిన వైసీపీ కార్యకర్తలకు చెల్లించేందుకు ఉత్సాహం చూపిస్తున్న అధికారులు.. గత టీడీపీ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించి చెల్లించాల్సిన 21 శాతం సొమ్ములను ఇచ్చేందుకు ప్రయత్నించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. అప్పట్లో టీడీపీ కార్యకర్తలు చేసిన పనులకు 21 శాతం బిల్లులివ్వకుండా ఆపేశారు. ఆయా పనులపై విజిలెన్స్ తనిఖీ చేయిస్తున్నామని, పూర్తయిన తర్వాత మిగిలిన 21 శాతం సొమ్ము చెల్లిస్తామని అధికారులు కోర్టుకు తెలిపారు. అయితే.. విజిలెన్స్ విచారణ పూర్తయినా బిల్లులు చెల్లించలేదు. ఇప్పుడు కూటమి సర్కారు వచ్చాక కూడా సదరు బిల్లులను చెల్లించాలన్న ఆలోచన కమిషనరేట్ అధికారుల్లో కనిపించడం లేదు. గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా శశిభూషణ్‌కుమార్‌ను ఎన్నికలకు ముందు నియమించారు. అయితే, కూటమి ప్రభుత్వంలోనూ ఆయననే కొనసాగిస్తున్నారు. కమిషనర్‌గా కేరళ నుంచి వచ్చిన కృష్ణ తేజ నియమితులయ్యారు. కమిషనరేట్‌లో మిగతా అధికారులందరూ గతంలో పని చేసిన వారే. ఈ పనులకు సంబంధించి ఏం జరిగిందో వాస్తవాలు కమిషనరేట్‌లో కొద్ది మందికే తెలుసు. గత ఐదేళ్లలో అక్కడ వైసీపీ నేతలకు అంటకాగిన అధికారులే ఎక్కువ మంది ఉన్నారు. కొంత మంది అప్పట్లో వైసీపీ కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకే పనిచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన శాఖల్లో రాజకీయ జోక్యం ఉండదని చెప్పడంతో వారు సంతోషపడిపోయారు. తమ సీటు పదిలంగా ఉంటుందని భావిస్తున్నారు. అందుకే బిల్లుల చెల్లింపుల్లో ఉన్నతాధికారులను మభ్యపెట్టి వైసీపీ కార్యకర్తలకు చెల్లించేందుకు అత్యుత్సాహం చూపిస్తున్నారు.

# నేడు పవన్‌కల్యాణ్ వీడియోకాన్ఫరెన్స్

- గ్రామసభలపై అధికారులకు దిశానిర్దేశం?



అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న పనుల ఆమోదం కోసం ఈ నెల 23న చేపట్టనున్న గ్రామసభలకు సంబంధించి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది ఏయే రకాల పనులు చేపట్టాలన్న దానిపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకే రోజు(ఈ నెల 23న) ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందికి సమాచారమిచ్చారు. దానికి సంబంధించి దిశా నిర్దేశం చేసేందుకు జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులతో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఉపముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో జడ్పీ సీఈవోలు, డీపీవోలు, డ్వామా పీడీ, డీఎల్‌డీవోలు, డీఎల్‌పీవోలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ఎంపీడీవోలు, ఈఓ పీఆర్ అండ్ ఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి పథకం ఏపీవోలు హాజరు కావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ కృష్ణతేజ ఆదేశాలిచ్చారు. డ్వామా పీడీలు జిల్లా స్థాయిలో, ఎంపీడీవోలు మండలస్థాయిలో అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ సూచించారు.

# వినూత్నంగా ఏపీ భవన్!

- కొత్త భవన నిర్మాణంపై సీఎం చంద్రబాబు సమీక్ష
- అమరావతికి తిరుగుపయనం

న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిలో ఆంధ్రప్రదేశ్(ఏపీ) భవన్‌కు నూతన భవన నిర్మాణంపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఆదివారమిక్కడ తన అధికారిక నివాసం 1-జన్‌పథ్‌లో.. ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్‌తో గంటకు పైగా చర్చించారు. భవన్ డిజైన్లపై కీలక సూచనలు చేసినట్లు తెలిసింది. అనంతరం చంద్రబాబు అమరావతికి తిరిగి వెళ్లారు. అంతకుముందు రాష్ట్రానికి చెందిన 16 మంది సర్పంచ్‌లు ఆయన్ను కలిశారు. ఆగస్టు 15న ఎర్రకోటలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన వారు.. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తమకు గౌరవం లభిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

### నేడు సాంఘిక సంక్షేమశాఖ వర్క్‌షాప్

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో వర్క్‌షాపు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పాల్గొంటారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జరిగే ఈ వర్క్‌షాపులో అన్ని జిల్లాల సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పాల్గొని సంక్షేమ పథకాల అమలు, జిల్లాల్లోని శాఖాపరమైన అంశాలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ప్రజంటేషన్ ఇస్తారు.

# వాసుదేవరెడ్డికి సీఐడీ ఉచ్చు



(మొదటి పేజీ తరువాయి)

అమ్ముడుపోయిన ఐదు పాపులర్ బ్రాండ్లను 2019 తర్వాత నిలిపివేయడానికి కారణాలేంటి.. అని వాసుదేవరెడ్డిపై ప్రశ్నలవర్షం కురిపించారు. యావత్ కుంభకోణంపై ఆయన నుంచి ఆశ్చర్యపోయే సమాచారాన్నే రాబట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

### ముందే తరలించేశారు..!

ఎన్నికల్లో జగన్ ఘోరపరాజయం పాలుకావడం.. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో.. తనకు కష్టాలు తప్పవని వాసుదేవరెడ్డి ముందుగానే గ్రహించారు. జూన్ 6న (ఫలితాలు వెలువడిన మూడో రోజు) విజయవాడ ప్రసాదంపాడులోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి అర్ధరాత్రి కొన్ని ఫైల్స్, కంప్యూటర్ హార్డ్ డిస్కులు, ఇతర ఆధారాలను కారులో తీసుకెళ్లారు. కొందరు గమనించి కొంతదూరం వెంబడించారు. నున్న పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో.. మంగళగిరి సీఐడీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. జూన్ 7న 12 మంది సీఐడీ సభ్యుల బృందం హైదరాబాద్‌లోని వాసుదేవరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన్ను విచారించింది. కీలక డాక్యుమెంట్లు, ఫైళ్లు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకుంది. వాసుదేవరెడ్డిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అప్పటికే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సీఐడీ బృందాలు ఆయన కోసం గాలిస్తున్నాయి. ఎన్నికల్లో పరాజయం పాలైనప్పటి నుంచి జగన్ తరచూ తన బెంగుళూరు (యలహంక) ప్యాలెస్‌కు వెళ్తున్నారు. అక్కడ కూడా సీఐడీ నిఘాపెట్టింది. ఈ క్రమంలో వాసుదేవరెడ్డి కొందరు న్యాయవాదులతో కలిసి ఆ ప్యాలెస్‌లోకి వెళ్లినట్లు పక్కా సమాచారం అందింది. ఈ క్రమంలో ఆయన్ను సీఐడీ ఈ నెల 16న పిలిపించి ప్రశ్నించినట్లు సమాచారం. ఆ సందర్భంగా కీలక వివరాలు ఆయన బయటపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ వివరాలను వాస్తవాలతో బేరీజు వేసుకుని అసలు సూత్రధారులకు ఉచ్చు బిగించే దిశగా సీఐడీ అధికారులు అడుగులు వేస్తున్నారు. మాజీ ఎంపీ డీకే ఆదికేశవులునాయుడు కుమారుడు డీకే శ్రీనివాస్ సహా డిస్టిలరీల యజమానులను కూడా విచారించాక తదుపరి చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. కాగా.. ఈ కేసు తన మెడకు చుట్టుకుంటే ఎలా బయటపడాలన్న అంశంపై పెద్దపెద్ద న్యాయవాదులతో జగన్ యలహంక ప్యాలెస్‌లో చర్చలు జరిపారని వాసుదేవరెడ్డి వెల్లడించినట్లు సమాచారం.

# మద్యం అక్రమాల సూత్రధారి వాసుదేవరెడ్డే!

- డిస్టిలరీల నుంచి షాపుల వరకు ఆయన కనుసన్నల్లోనే

అమరావతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం అక్రమాల్లో అప్పటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డే ప్రధాన పాత్ర పోషించారు. మద్యాన్ని తయారుచేసే డిస్టిలరీల నుంచి విక్రయించే షాపుల వరకు మొత్తం ఆయన కనుసన్నల్లోనే నడిచాయి. ఒక్కమాటలో చెప్పాలంటే గత ప్రభుత్వంలో మద్యం వ్యాపారం మొత్తాన్ని మాజీ సీఎం జగన్... వాసుదేవరెడ్డి చేతిలో పెట్టారు. డిస్టిలరీస్ కమిషనర్ బాధ్యతలనూ అప్పగించారు. దీంతో సర్వం ఆయన చెప్పినట్లుగానే వ్యవహారాలు సాగాయి.

అదాన్ డిస్టిలరీస్ లాంటి కొత్త కంపెనీలకు భారీగా ఆర్డర్లు ఇచ్చి వాటికి సంబంధించిన బ్రాండ్లనే మద్యం షాపుల్లో విక్రయించేలా చేశారు. ఇక కమీషన్లు ఇచ్చేది లేదన్న అంతర్జాతీయ కంపెనీలను పక్కన పెట్టారు. ఎంత పాపులర్ బ్రాండ్లు అయినా తమకు సంబంధం లేదని, కమీషన్ ఇచ్చేవారికే ఆర్డర్లు అన్న సింగిల్ లైన్ సొంత మద్యం పాలసీని అనధికారికంగా అమలుచేశారు. యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్, పెర్నాడ్ రికర్డ్ ఇండియా, అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలరీస్, జాన్ డిస్టిలరీస్ లాంటి ప్రముఖ ఉత్పత్తి సంస్థలను తరిమేశారు. 2014-19 కాలంలో ఏపీలో 53శాతంగా ఉన్న వారి మార్కెట్‌ను కేవలం 5 శాతానికి పడేశారు. ఇక తమకు సంబంధించిన ఎస్ఎన్‌జే షుగర్స్ అండ్ ప్రొడక్ట్ లిమిటెడ్, పెరల్ డిస్టిలరీ, ఎస్పీవై ఆగ్రో, సెంటిని బయో ప్రొడక్ట్స్, షర్యానీ అల్కో బ్రూ లాంటి కంపెనీలకు అనూహ్యంగా ఆర్డర్లు పెంచేశారు. వీటిలో కొన్ని టీడీపీ సానుభూతిపరులవి కాగా.. వాటిని తాత్కాలికంగా లీజుకు తీసుకుని, వాటిలో వైసీపీ పెద్దలు వారి బ్రాండ్లను తయారుచేయించారు.

తయారీ కంపెనీలకు ఆర్డర్ల అనంతరం ఏ షాపునకు ఏ బ్రాండ్లు పంపాలనేది కూడా బేవరేజెస్ కార్పొరేషనే నిర్ణయించేది. అయితే ఇందులో వాసుదేవరెడ్డితో పాటు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన మరికొందరు అధికారులు కూడా ఉన్నారు. రోజూ వారు చెప్పిన బ్రాండ్లనే షాపుల్లో విక్రయించేలా వ్యాపారాన్ని నియంత్రించారు. కమీషన్లు ఇచ్చిన మేరకు రొటేషన్ విధానంలో అన్ని బ్రాండ్లనూ విక్రయించేలా చేశారు. ఇక షాపుల్లో డిజిటల్ చెల్లింపులు లేకపోవడం మరో పెద్ద కుంభకోణం. ఐదేళ్లలో రూ.99 వేల కోట్లకు పైగా మద్యం విక్రయాలు రాష్ట్రంలో జరుగగా.. అందులో డిజిటల్ పేమెంట్లు ఒక్క శాతం లోపే.

తొలుత కంపెనీలే కమీషన్లు ఇవ్వాలనే షరతు పెట్టారు. తర్వాత ఇవ్వాల్సిన దాని కంటే అదనంగా ధర చెల్లిస్తామని, అదనంగా ఇచ్చిన మొత్తాన్ని తమకు ఇవ్వాలని స్పష్టంచేశారు. ప్రముఖ కంపెనీలు ఈ విధానానికి ససేమిరా అన్నాయి. తమకు వాస్తవ ధర మాత్రమే ఇవ్వాలని, అదనంగా వద్దని వాదించాయి. దీంతో వాటికి ఆర్డర్లు ఆపేశారు. అంగీకరించిన కంపెనీలకు మాత్రం పక్క రాష్ట్రాలతో పోలిస్తే ఎక్కువ ధరలు చెల్లించారు. ఉదాహరణకు ఒకే బ్రాండ్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ.1,094 చెల్లిస్తే, ఏపీ ప్రభుత్వం రూ.1,697 చెల్లించింది. ఇలా ఎక్కువ ఇచ్చిన మొత్తాన్ని వైసీపీ పెద్దలకు కమీషన్‌గా ఇచ్చారు. అలా ఐదేళ్లలో రూ.3,113 కోట్లు కమీషన్ల రూపంలో దోపిడీ చేసినట్లు కూటమి ప్రభుత్వ ప్రాథమిక విచారణలో తేలింది. ఇక సంబంధం లేని ఎక్సైజ్, సెబ్ అధికారుల బదిలీల్లోనూ ఆయన జోక్యం చేసుకున్నారు. బార్ పాలసీలోనూ ఆయనే పెత్తనం చేశారు.

# పవన్ చెప్పినా బేఫికర్!

(మొదటి పేజీ తరువాయి)

ప్లాంట్స్‌కు అనుమతులు ఇవ్వాలి. కానీ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వీటిని తుంగలో తొక్కి కొత్త ప్లాంట్స్‌కు అనుమతులిచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఉత్తరాంధ్రకు చెందిన వైసీపీ మాజీ మంత్రి అండదండలతో విజయనగరం జిల్లాల్లో ఒక కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేసేశారు. ఈ కంపెనీకి బయో వేస్ట్ కలెక్షన్ చేసుకునేందుకు అనుమతివ్వాలని పీసీబీ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో పాటు పీసీబీ అధికారులకు భారీగా ముడుపులు ముట్టజెప్పారు. ప్రభుత్వం మారినా అధికారులు సదరు కంపెనీకి మేలు చేసే విధంగా బయో వేస్ట్ కలెక్షన్‌కు అనుమతులిచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

### ఇదీ పరిస్థితి

రాష్ట్రంలో ఇప్పటికే 13 బయో వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రుల్లో ప్రతి పది వేల పడకలకు ఒక బయో వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి. ఒక ప్లాంట్ దాదాపు 150 కిలోమీటర్ల పరిధిలోని ఆస్పత్రుల నుంచి బయో వేస్ట్‌ను సేకరించవచ్చని సీపీసీబీ స్పష్టమైన మార్గదర్శకాలున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 13 ప్లాంట్లు ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాటయి ఉన్నాయి. ఇక కొత్తగా ప్లాంట్స్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్రంలో ఎక్కడా అవకాశం లేదు. కానీ రాష్ట్ర పీసీబీ అధికారులు కొత్తగా మరో ఏడు ప్లాంట్స్ ఏర్పాటుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో జిల్లాల్లో రెండు ప్లాంట్స్ అందుబాటులో ఉన్నాయి. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కలిసి 9600 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. విశాఖపట్నంలో పరిధిలో కూడా దాదాపు ఇంతే స్థాయిలో పడకలు అందుబాటులో ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ మధ్య 150 కిలోమీటర్ల పరిధి మాత్రమే ఉంది. ప్రస్తుతం ఒక్కో కంపెనీకి దాదాపు 30 వేల పడకలకు సంబంధించిన బయో వేస్ట్ ట్రీట్‌మెంట్ చేసే సామర్థ్యం ఉంది. కానీ కేవలం 10 వేల పడకలు అందుబాటులో ఉండడంతో ఆయా కంపెనీలు అక్కడి వరకే పరిమితమవుతున్నాయి. అవకాశం లేకపోయినా పీసీబీ అధికారులు మరో కంపెనీకి అనుమతులు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

### హైకోర్టులో కేసులున్నా..

కొత్త ప్లాంట్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ హైకోర్టులో అనేక కేసులున్నాయి. అసలు కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతులిచ్చేందుకు పీసీబీకి అధికారం లేదని ఒక సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై స్పందించిన హైకోర్టు గ్యాప్ అనాలసిస్ స్టడీ చేయాలని పీసీబీని ఆదేశించింది. దీంతో గ్యాప్ అనాలసిస్ స్టడీ చేసినా, క్షేత్రస్థాయిలో స్టడీని సక్రమంగా నిర్వహించలేదు. దీంతో మళ్లీ ప్రభుత్వం ఏజెన్సీ ద్వారా గ్యాప్ అనాలసిస్ చేయించింది. ఇందుకు సదరు సంస్థకు కోటి రూపాయిల వరకు చెల్లించింది. సదరు ఏజెన్సీ గత ఏడాది స్టడీ రిపోర్టును సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు పంపించింది. రిపోర్టును పరిశీలించిన సీపీసీబీ గ్యాప్ అనాలసిస్ స్టడీ సక్రమంగా లేదని, మరోసారి స్టడీ చేయాలని పీసీబీని మరోసారి ఆదేశించింది. దాదాపు 20 పాయింట్లపై సీపీసీబీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. దీనిపై వెంటనే సమాధానం చెప్పాలని కూడా ఆదేశించింది. ప్రస్తుతం పీసీబీ అధికారులు అదే పనిలో ఉన్నారు. మరోవైపు గ్యాప్ అనాలసిస్‌పై ప్రయివేటు వ్యక్తి హైకోర్టు వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఈ నెల 21 వ తేదీన హైకోర్టులో వాదనలున్నాయి. ఇన్ని కేసులు, ఇంత గందరగోళం ఉన్నప్పటికి పీసీబీ అధికారులు మాత్రం వైసీపీకి చెందిన కంపెనీకి బయో వేస్ట్ కలెక్షన్ చేసేందుకు అనుమతిచ్చేందుకు సిద్ధమయ్యారు. గత వారం ప్రత్యేక సమావేశం పెట్టి ఆర్డర్ ఇవ్వాలని నిర్ణయించారు. కానీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదులు అందడంతో వెనక్కి తగ్గారు. డిప్యూటీ సీఎం జోక్యం చేసుకున్నారని పీసీబీ అధికారులు ఆ రోజు వరకూ ఆర్డర్ ఇవ్వకుండా ఆపారు. కానీ ఇప్పటికీ సదరు ఫైల్‌ను తెరపైకి తీసుకువస్తున్నారు.

### ఇవీ నిబంధనలు...

ఒక ప్రాంతంలో ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే అక్కడ గ్యాప్ అనాలసిస్ స్టడీ చేసి సీపీసీబీకి నివేదించాలి. అనుమతి వచ్చాక కేంద్ర పర్యావరణ శాఖ ఆమోదంతో టెండర్లను ఆహ్వానించాలి. ఎల్1 వచ్చిన కంపెనీకి తొలుత కన్సెంట్ ఆఫ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌కు అనుమతిస్తారు. అంటే ప్లాంట్ నిర్వహణకు పరికరాలు కొనుగోలు చేసుకుని, కంపెనీ ఏర్పాటు చేయాలి. అది కూడా నివాస ప్రాంతాలకు దూరంగా, ప్రజలకు ఇబ్బంది లేని ప్రాంతంలో ఏర్పాటు చేయాలి. ప్లాంట్ నిర్మాణం పూర్తయ్యాక మరోసారి పీసీబీ అధికారులు.. అన్నీ సక్రమంగా ఉన్నాయా లేదా అని దానిని పరిశీలిస్తారు. దీనిపై నివేదిక అందాకే సీపీసీబీ సీఎఫ్‌వో(కన్సెంట్ ఆఫ్ ఆపరేషన్)కు అనుమతిస్తుంది. ఆ అనుమతుల ఆధారంగా పీసీబీ అధికారులు ప్లాంట్ నిర్వహణను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు పాటించకుండానే, గ్యాప్ అనాలసిస్ స్టడీ చేయకుండానే, సీపీసీబీ ఆమోదం లేకుండా విజయనగరం, విశాఖ, తూర్పు గోదావరి, కృష్ణా, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ప్లాంట్లకు గతంలో పీసీబీ అనుమతులు ఇచ్చేసింది. దీనిపై కొంత మంది హైకోర్టు ఆదేశాల మేరకు అప్పిలేట్ అథారిటీని ఆశ్రయించారు. అథారిటీ కూడా మొత్తం వ్యవహారాన్ని అబయన్స్‌లో పెట్టమని ఆదేశించింది. ఆ ఆదేశాలను కూడా పీసీబీ అధికారులు బుట్టదాఖలు చేసి విజయనగరం, మరి కొన్ని చోట్ల ప్లాంట్స్‌కు అనుమతులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి, పీసీబీని గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందన్న సూచనలు వినిపిస్తున్నాయి.

# జేటీసీలూ బెజవాడ వచ్చేయండి

(మొదటి పేజీ తరువాయి)

వెలువడిన ఈ ఉత్తర్వులు రవాణా శాఖలో ఒక్కసారిగా కలకలం రేపాయి. వివరాల్లోకి వెళ్తే.. రవాణా శాఖలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) నుంచి డిప్యూటీ రవాణా కమిషనర్ (డీటీసీ) వరకూ జిల్లాల్లో ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగి ఉంటారు. ఆర్టీఏ కార్యాలయాల్లో ఉండే వీరికి ఆదాయం కూడా బాగానే ఉంటుంది. అయితే జేటీసీలుగా పదోన్నతి పొందాక రాష్ట్ర కమిషనరేట్‌లో పని చేయాల్సి ఉంటుంది. అక్కడ ఆదాయానికి ఆస్కారం బాగా తక్కువ. పని మాత్రం ఉంటుంది. ఇక్కడకు వచ్చి వెట్టి చాకిరీ చేయడం కన్నా.. నాలుగు ప్రాంతీయ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు సృష్టించుకుని జిల్లాల్లోనే వసూళ్లు, పెత్తనాలు సాగించేందుకు రాయలసీమకు చెందిన ఒక జేటీసీ.. జగన్ హయాంలోనే పథకం వేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇంట్లో మనిషిలా ఉండే ఈయన విగతా జేటీసీలతో అవగాహనకు వచ్చారు. తిరుపతి, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం కేంద్రాలుగా ప్రాంతీయ కార్యాలయాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అయితే కమిషనరేట్‌లో జేటీసీలకు చాలా పని ఉంటుందని, ప్రాంతీయ కార్యాలయాలు అవసరమే లేదని కమిషనర్ ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ప్రభుత్వం నిధులు ఇచ్చేందుకు ససేమిరా అనేసింది. అయినా వెనక్కి తగ్గకుండా ఎంవీఐలపై పడిన నలుగురు జేటీసీలు.. బల్లలు, కుర్చీలు వారితోనే తెప్పించుకుని ఆ నాలుగు నగరాల్లో ఆఫీసులు ఏర్పాటు చేసేసుకున్నారు. ప్రభుత్వం మారిన రెండు నెలల తర్వాత రవాణా మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి ఆ శాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మనీశ్‌కుమార్ సిన్హా అసలు సమస్య చెప్పారు. కమిషనరేట్‌లో ముగ్గురు జేటీసీలు ఉంటే ఒకరు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారని.. మరొకరు నెలాఖరుకు అదనపు కమిషనర్ అవుతున్నారని, మిగిలిన ఏకైక జేటీసీతో మొత్తం పనంతా చేయించడం కష్టమని వివరించారు. దీనిపై 'పని ఇక్కడ.. అధికారులు అక్కడ' అన్న శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ఇటీవల వార్త ప్రచురించింది. సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లిన మంత్రి.. జిల్లాల్లో జేటీసీ కార్యాలయాలను తీసివేయించి నలుగురినీ కమిషనరేట్‌కు పంపేలా ఉత్తర్వులు ఇప్పించారు. దీంతో తిరుపతి జేటీసీ బసిరెడ్డి, గుంటూరు జేటీసీ కృష్ణవేణి, విజయవాడ జేటీసీ శివరామ్ ప్రసాద్, విశాఖపట్నం జేటీసీ సుందర్ తక్షణమే కార్యాలయాలు మూసేసి సోమవారం రవాణా కమిషనర్ సిన్హాకు రిపోర్టు చేయాలని ఆదేశాలు వెలవడ్డాయి. ఆదివారం సెలవు రోజైనప్పటికీ రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేయడం పెద్ద చర్చనీయాంశంగా మారింది.



# అన్న క్యాంటీన్లకు మాజీ ఎంపీ గోకరాజు కోటి విరాళం

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు రూ.కోటి విరాళం ఇచ్చారు. ఈ చెక్‌ను ఆదివారం మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. గంగరాజు చేయూతకు, ఉదార సహకారానికి మంత్రి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెరుగైన ఆంధ్రప్రదేశ్‌కు బాటలు వేసేందుకు వివిధ భాగస్వాములు కలిసి వస్తున్నందుకు సంతోషిస్తున్నానంటూ, గంగరాజు విరాళమిచ్చిన ఫొటోను 'ఎక్స్'లో మంత్రి లోకేశ్ పోస్టు చేశారు.

# నలుగురిపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. అలాగే విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న ఇద్దరు అధికారులకు షోకాజు నోటీసులు ఇచ్చారు. సీనియర్ అసిస్టెంట్లు కె.నూకరాజు, కారం బేబీ, స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.కళాజ్యోతి, ఆఫీసు సబార్డినేట్ కె.రాజశేఖర్‌ను సస్పెండ్ చేయగా, డిప్యూటీ తహశీల్దార్లు ఎం.కుమారి, ఎ.సత్యదేవికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఫైళ్లకు నిప్పుపెట్టిన ఘటనను తీవ్రంగా పరిగణించామని, ఆర్డీవో ప్రాథమిక విచారణలో అవి ప్రాధాన్యం లేని పత్రాలుగా గుర్తించినప్పటికీ, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేస్తామని చెప్పారు. కాగా, ఈ ఘటనపై విచారణాధికారిగా జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడును కలెక్టర్ నియమించారు. ఆయన ధవళేశ్వరం ఇరిగేషన్ ఆఫీసుకు వెళ్లి, పరిస్థితిని ఆరా తీశారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఎస్పీ నరసింహ కిశోర్ స్వయంగా ఇక్కడి పరిస్థితిని పరిశీలించారు.

## ధవళేశ్వరం పీఎస్‌లో కేసు

ఫైళ్లకు నిప్పుపెట్టిన ఘటనపై డిప్యూటీ కలెక్టర్ కె.వేదవల్లి ధవళేశ్వరం పోలీసుస్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఎస్పీ నరసింహ రమేష్ ఆదేశాల మేరకు సెక్షన్ 326(ఎఫ్) రెడ్‌విత్ 3(5) భారతీయ న్యాయ సమ్మత చట్టం, సెక్షన్ 4 ఆఫ్ ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం చట్టం-1984 ప్రకారం సీఐ గణేష్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తుకు సంబంధించి సస్పెండైన ఉద్యోగులతో పాటు షోకాజ్ నోటీసులు అందుకున్న వారికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వడానికి రైతుల దగ్గర నుంచి ఏ రికార్డులు తీసుకుంటారు? ఆఫీసులో ఎలాంటి రికార్డులు నిర్వహిస్తారు? నిర్వాసితులకు నష్టపరిహారం అందించే విధివిధానాలు ఏమిటి? అని ప్రశ్నిస్తూ, వాటికి పూర్తి సమాచారం ఇవ్వాలని నోటీసులు అందజేశారు.

## పరిహారం కోసం జిరాక్స్‌లే ఇస్తారు: ముప్పాళ్ల

పోలవరం నిర్వాసితులకు పరిహారం ఇచ్చేటప్పుడు అధికారులకు సంబంధిత రైతులు ఆధార్, రేషన్‌కార్డులకు సంబంధించిన జిరాక్స్ పత్రాలే ఇస్తారని, అధికారులు అవి జిరాక్స్‌లే.. ఇబ్బందిలేదని చెప్పడం సరికాదని ప్రముఖ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు అన్నారు. ఆదివారం ఆయన ధవళేశ్వరంలో ఘటనా స్థలాన్ని పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత వైసీపీ అక్రమాలకు సంబంధించిన సాక్ష్యాధారాలన్నీ భద్రపరచాలని చెప్పినప్పటికీ, నిర్లక్ష్యంగా వ్యవహరించారని చెప్పారు. పెద్దిరెడ్డి అక్రమాలు మదనపల్లిలో బయటపడిన నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు భూసేకరణ విషయంలో జగన్ ప్రభుత్వం శ్మశానాలు, ప్రభుత్వ భూములను వైసీపీ వాళ్లపేర రాయించుకుని, అధికారులకు లంచాలు ఇచ్చి, పరిహారం దోచేశారని ఆరోపించారు. వీటన్నింటిపైనా విచారణ చేయాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు.


ఫైళ్లు తగులపెట్టిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

## జూన్ నాటికి విశాఖకు నీరు

ఇటీవల సీఎం చంద్రబాబు అనకాపల్లిలో పర్యటించిన సందర్భంగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ పరిస్థితిని పరిశీలించి, వచ్చే జూన్ నుంచి విశాఖపట్నానికి మంచినీరు, పరిశ్రమలకు 23.44 టీఎంసీల నీరు అందివ్వాలని సర్కిల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో తునిలో ఉన్న ఎల్ఎంసీ సర్కిల్ అధికారులు అత్యవసర పనుల కోసం రూ.1,093 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించారు. ఈఎల్ఎంసీ కోసం మొత్తం 202 కిలోమీటర్ల మేర 10,306 ఎకరాల భూమి సేకరించారు. ఇంకా 43.68 ఎకరాల సేకరించాల్సి ఉంది. ఈ కాలువ పనులను 8 ప్యాకేజీలుగా విభజించారు. 2వ ప్యాకేజీ పనులు పూర్తయ్యాయి. మిగతా ప్యాకేజీల్లో కొంతమేర పనులు జరిగాయి. ఇంతలోనే భూసేకరణ కార్యాలయంలో ఫైళ్లకు నిప్పుపెట్టిన ఘటన చోటు చేసుకుంది.

## ఎన్నో అనుమానాలు

గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దేవీపట్నం తదితర వరద ప్రాంతాల నుంచి జనం బయటకు వచ్చేట్టు ఒత్తిడి చేసింది కానీ, వారికి పునరావాసం కల్పించలేదు. పూర్తిగా నష్టపరిహారమూ ఇవ్వలేదు. పోలవరం ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి కూడా చాలావరకూ భూసేకరణ పూర్తయింది. అందులో కూడా సమస్యలున్నాయి. భూసేకరణలో లోపాలున్నాయి. ఒకరి పేరు మీద వేరేవారు డబ్బులు కాజేసిన సంఘటనలున్నాయి. చాలామందికి న్యాయపరంగా ఇవ్వకుండా, బినామీ పేర్ల మీద కూడా రూ.కోట్లు కాజేశారు. ఈ పరిస్థితుల్లో ఇక్కడి ఫైళ్లకు నిప్పు పెట్టడం అనుమానాలకు తావిస్తోంది.

## అన్ని కోణాల్లో విచారణ: దుర్గేశ్

పోలవరం భూసేకరణ కార్యాలయ ఆవరణలో పలు పత్రాలు, ఫైళ్లు తగులపెట్టిన ఘటనపై మంత్రి కందుల దుర్గేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు, ఆదివారం ఉదయం ఆయన ధవళేశ్వరంలోని కార్యాలయానికి వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించారు. సెక్షన్ సిబ్బందితో మాట్లాడుతూ ఎవరి అనుమతి లేకుండా ఫైళ్లకు నిప్పు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస బాధ్యత లేకుండా వ్యవహరించారంటూ మండిపడ్డారు. సొంత ఇంట్లో చెత్త తగులబెట్టినట్లుగా ప్రభుత్వ కార్యాలయంలో ఫైళ్లను కాల్చేస్తారా అని ప్రశ్నించారు. అవన్నీ జిరాక్స్ కాపీలు, అవసరం లేని పత్రాలుగా పేర్కొన్న ఆర్డీవో లక్ష్మీ శివజ్యోతిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఎవరినీ రక్షించే ప్రయత్నాలు చేయవద్దన్నారు. కాలిపోయిన పత్రాల్లో ఒరిజినల్స్ కూడా ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని జేసీని ఆదేశించారు. ఈ ఘటనకు కారణమైన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, పోలవరం ఫైళ్ల దహనం ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ నరసింహ కిశోర్ తెలిపారు. ఉదయం పోలవరం భూ సేకరణ స్పెషల్ కలెక్టర్ కార్యాలయంలో సిబ్బందిని ఆయన విచారించారు. పత్రాలు, ఫైళ్లు తగులబెట్టిన ప్రాంతాన్ని పరిశీలించారు. విచారణాధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి కుట్రకోణం దాగి ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రెండు రోజుల్లో నివేదిక: జేసీ

ఫైళ్ల దహనం ఘటనపై సమగ్ర విచారణ చేపట్టామని జాయింట్ కలెక్టర్ చినరాయుడు తెలిపారు. రికార్డులన్నీ భద్రంగా ఉన్నాయో లేదో పరిశీలిస్తున్నామని, రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.